

నిష్పక్షపాతం.. సత్యనిష్ఠ..
అంకితభావం..
ప్రజల మేలు కోసం చూపే తెగువ
పత్రికలకు అవశ్యం.

# ఆంధ్రపత్రిక

స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం 1914

విజయవాడ సంపుటి : 60 సంచిక : 337 • పేజీలు : 12 • గురువారం 29 ఆగస్టు 2024 • వెల : రూ. 5.00 Published from : Vijayawada| Visakhapatnam |Srikakulam | Rajahmundry|Kurnool|Guntur|Ongole| Nellore Tirupati


## జన్‌ధన్‌కు పదేళ్లు..

- ప్రధాని మోదీ ప్రత్యేక పోస్టు



**న్యూఢిల్లీ,ఆగస్టు 28 :** దేశ ప్రజల సమ్మిళిత ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన' పథకానికి నేటితో పదేళ్లు పూర్తయింది.ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో సమ్మిళిత అభివృద్ధికి తోడ్పేందుకు రూపొందించిన ఎన్నో ఆర్థిక పదకాల్లో ఇదీ ఒకటి. ఈ మిగతా 7లో

## కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం

- 12 పారిశ్రామిక స్మార్ట్ సిటీలకు ఆమోదం



**న్యూఢిల్లీ,ఆగస్టు 28 :** నేడు సమావేశమైన కేంద్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. దేశవ్యాప్తంగా కొత్తగా 12 స్మార్ట్ సిటీలను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుందని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.వీటి ద్వారా 10 లక్షల మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మిగతా 7లో

## ఉడాయ్‌కి కేంద్రం ఆదేశాలు

- 9 లక్షల మంది బయోమెట్రిక్‌లు అన్‌బ్లాక్ చేయండి



**న్యూఢిల్లీ,ఆగస్టు 28 :** ఈశాన్య రాష్ట్రం అస్సాం వాసులకు సంబంధించిన ఆధార్ నమోదు విషయంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఆ రాష్ట్రానికి చెందిన 9,35,682 మంది పౌరుల బయోమెట్రిక్ మిగతా 7లో

- రివర్స్ టెండరింగ్ విధానం రద్దు..
- ఆబ్కారీ శాఖ పునర్ వ్యవస్థీకరణకు గ్రీన్ సిగ్నల్
- జగన్ ఫోటోలున్న పాస్ పుస్తకాలు రద్దు
- మున్సిపల్ శాఖలో 269 సూపర్ న్యూమరీ పోస్టుల భర్తీ
- 2,771 కొత్త రేషన్ షాపుల ఏర్పాటుకు ఆమోదం
- సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అంగీకారం
- 2014లో చివరిసారిగా సాగునీటి సంఘాలకు ఎన్నికలు
- పోలవరం ఎడమ కాలువ పనుల పునరుద్ధరణకు మంత్రివర్గం ఆమోదముద్ర
- ఏపీలో కొత్త మద్యం పాలసీ తెచ్చే అంశంపైనా క్యాబినెట్ ముందుకు ప్రతిపాదనలు
- ఎపి కేబినేట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు



# పాతపద్ధతిలోనే టెండర్ల విధానం

సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

**అమరావతి,ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):** సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. వైకాపా ప్రభుత్వం తీసుకొచ్చిన రివర్స్ టెండరింగ్ విధానాన్ని మంత్రివర్గం రద్దు చేసింది. పాత విధానంలోనే టెండర్లు పిలిచే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. ఆబ్కారీ శాఖ పునర్ వ్యవస్థీకరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ క్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) రద్దుకు ఆమోదం తెలిపింది. పట్టాదారు పాసు పుస్తకాలపై జగన్ ఫొటో తొలగింపు, సాగునీటి సంఘాల ఎన్నికల మిగతా 7లో

## సొంత పార్టీలోనే ట్రంప్‌కు భారీ షాక్

- ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌కు మద్దతు ఇస్తూ లేఖ..
- ట్రంప్‌ను వ్యతిరేకించడం ఇదేమీ తొలిసారి కాదు..
- కమలా హారిస్‌కు మద్దతిస్తూ జార్జ్ డబ్ల్యూ బుష్ మద్దతు దారులు
- బహిరంగ లేఖలో..ట్రంప్ తిరిగి రెండోసారి ఎన్నుకుంటే దేశానికి విపత్తు
- ప్రజాస్వామ్యాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీస్తారు అని ప్రతి ఒక్కరి అంచనా



**అమెరికా,ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):** అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలోకి దిగుతున్న డొనాల్డ్ ట్రంప్‌కు సొంత పార్టీ రిపబ్లికన్ పార్టీ నుంచి భారీ షాక్ తగిలింది. సుమారు 200 మంది రిపబ్లికన్లు, ఉపాధ్యక్షురాలు..డెమోక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్‌కు మద్దతు ఇస్తూ లేఖ రాశారు. వీళ్లం తా.. గతంలో జార్జ్ డబ్ల్యూ బుష్ హయాంలో ఆయనకు అనుకూలంగా పనిచేసినవాళ్లే కావడం గమనార్హం. ఫాక్స్ న్యూస్ కథనం ప్రకారం.. అయితే ఇలా సొంత మిగతా 7లో

## నూజివీడు ట్రిపుల్ ఐటీలో 800 మందికి అస్వస్థత






- ఈ ఘటనపై స్పందించిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్
- తక్షణమే మెరుగైన చికిత్స అందించాలని ఆదేశాలు

**నూజివీడు,ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):** ఏలూరు జిల్లాలోని నూజివీడు ట్రిపుల్ ఐటీలో మంగళవారం ఒక్కరోజే 342 మంది విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారు. గడిచిన 3 రోజులుగా సుమారు 800 మంది అస్వస్థతకు గురయ్యారు. వారు జ్వరం, కడుపునొప్పి, మిగతా 7లో

## అదో భయానక ఘటన



- ఇలాంటి ఘోరాలు జరగటం చాలా దారుణం
- ఇప్పటికైన సమాజం మేల్కొవాల్సిన అవసరముంది
- తొలిసారి సంచలన వ్యాఖ్యలు చేసిన రాష్ట్రపతి..

7 లో

## ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి వేడుకలు



**విజయవాడ,ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):** ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ఈయేడు ఘనంగా నిర్వహిం చాలని పాలక మండలి నిర్ణయించింది. పది రోజుల పాటు వేడుకలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరిగే మిగతా 7లో

- పదిరోజుల పాటు ఉత్సవాల నిర్వహణ..
- 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఉత్సవాలు
- భక్తులకు ఇబ్బంది లేకుండా దసరా ఉత్సవాల కోసం ఆలయంలో పటిష్ట ఏర్పాటు
- రోజుకో రూపంలో దర్శనమివ్వనున్న అమ్మవారు
- క్యూలైన్ల ఏర్పాటుతో పాటు భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు..

## ఎపికి భారీగా నిధులు



- పోలవరం,ఇండస్ట్రియల్ పార్కులకు కేటాయింపులు
- కేబినెట్ నిర్ణయాలతో ఎపి పురోభివృద్ధికి అడుగులు
- ఓర్వకల్లు, కొప్పర్తికి ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలు మంజూరు..
- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి

**న్యూఢిల్లీ,ఆగస్టు 28 :** ఓర్వకల్లు, కొప్పర్తికి ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలు మంజూరయ్యాయని కేంద్ర మంత్రి మిగతా 7లో

## ఇక వేగంగా పోలవరం పనులు..



- పోలవరానికి తొలగిన అడ్డంకులు
- నిధుల విడుదలతో ఇక పనుల్లో వేగం
- త్వరగా పూర్తి చేసే సంకల్పంతో ప్రభుత్వం
- పెండింగ్ నిధుల విడుదలకు కేంద్రం ఆమోదం

**అమరావతి,ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):** పోలవరం ప్రాజెక్టుకు ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోయినట్లుగా కనిపిస్తున్నాయి. చంద్రబాబు నాయుడు పలుమార్లు ఢిల్లీ వెళ్లి కేంద్రమంత్రులతో జరిపిన చర్చల ఫలితంగా.. పెండింగ్ నిధులతో పాటు రూ. 12500 కోట్లను కేంద్రం మిగతా 7లో

## వైసిపికి వరుస షాక్‌లు

- టిడిపిలో చేరనున్న మోపిదేవి
- చంద్రబాబుతో ఇప్పటికే మంతనాలు
- మోపిదేవి బాటలోనే మరో రాజ్యసభ ఎంపి
- ఎమ్మెల్సీ పోతుల సునీత రాజీనామా..



**అమరావతి,ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):** అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన వైసీపీకి గత రెండు రోజులుగా షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. కీలక నేతలు మిగతా 7లో

## సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం..!



- ఏర్పాటుకు సంబంధించి భూమిపూజ - డిసెంబర్ 9 నాటికి విగ్రహావిష్కరణ - పూజలో పాల్గొన్న సిఎం రేవంత్, మంత్రులు
-విగ్రహం తెలంగాణ సంస్కృతి చాటి చెప్పేలా ఉంటుంది..

**హైదరాబాద్,ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):** తెలంగాణ సచివాలయంలో డిసెంబర్ 9 నాటికి తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇప్పటికే స్థలపరిశీలన చేసిన చోట విగ్రహం ఏర్పాటుకు పూనుకుంది. ఈ మేరకు బుధవారం భూమి మిగతా 7లో

ఒరులేయని యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్

ఆంధ్రపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు

# గిడుగు గిడుగే

గిడుగు వెంకటరామమూర్తి జయంతిని (ఆగస్టు 29)ఆ మహనీయుని స్మృతిగాతెలుగు భాషా దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా సాగుతోంది.సరే! కొందరు మొక్కుబడిగా చేస్తారు.మరికొందరు భాషానురక్తితో మొక్కుగా భక్తితో చేస్తారు.ఈరోజు మనం రాసే భాష వెనకాల ఆయన స్వేదం ఉంది.నిత్యం తలచుకోవాల్సిన మాననీయుడు గిడుగు.ఆధునిక తెలుగు మానవుడు ఎలా చదవాలి,ఎలా రాయాలి,ఎలా అర్థం చేసుకోవాలి,భాషామయమైన ప్రయాణం ఎలా చెయ్యాలో దారి చూపిన తెలుగు వెలుగు గిడుగు.ఈరోజు మనం రాసే భాష,చదివే భాష,పుస్తకాల్లో, పత్రికల్లో,ఉపన్యాసాల్లో కనిపిస్తున్న, వినిపిస్తున్న భాష,మనల్ని కదిలిస్తున్న భాష గిడుగు చేసిన త్యాగాలు,వేసిన మూలాల ఫలమేనని విశ్వసించాలి.గిడుగు వెంకటరామమూర్తి ఎప్పుడో 160ఏళ్ళనాటి వాడు.ఎటు చూసినా పండితులు,కవులు, వారికి మాత్రమే అర్థమయ్యే గ్రాంథిక భాషామయమైన తెలుగు వాతావరణంలో పుట్టి పెరిగినవాడు.ఈ విధానం ఇదే రీతిలో సాగితే,సామాన్యుడికి ఆ జ్ఞాన ఫలాలు ఎప్పుడు అందాలి,భాష ఎప్పుడు వికాసం చెందాలి,జనబాహుళ్యం ఆ భాషకు ఎన్నడు దగ్గరవ్వాలని మదనపడి మన కోసం అలోచించిన దార్శనికుడు.ఆధునిక భాషా మహోద్యమంలో తొలి అడుగు వేసినవాడు గిడుగు.భాషాసాహిత్యాలు,చరిత్ర పుష్కలంగా,క్షుణ్ణంగా చదువుకొని,తాను జ్ఞాన స్వరూపుడిగా తయారై, సామాన్యుడి చెంతకు భాషను చేర్చాలని రంగంలోకి దిగిన చిచ్చర పిడుగు గిడుగు.ఇటు వ్యావహారిక భాష - అటు సవర భాష కోసం జీవితమంతా అంకితమయ్యాడు.ఆరోగ్యం కోల్పోయాడు.సొంత డబ్బులు ఖర్చు పెట్టాడు.గిరిజనులను ఇంట్లోనే ఉంచుకొని భోజనం పెట్టి పాఠాలు చెప్పాడు.కొండలు కోనలు తిరిగి భాషను సామాన్యుడికి చేర్చిన అసామాన్యుడు గిడుగు.అందరికీ అర్థమవ్వాలనే తపన తప్ప,గ్రాంథిక భాషను ఎన్నడూ వ్యతిరేకించలేదు.పద్యాలను, కావ్యాలను,వ్యాకరణాలను, ఛందస్సును పండితులను,కవులను ఎప్పుడూ తూలనాడలేదు. సంప్రదాయమైన సర్వ వ్యవస్థలనూ గౌరవించి,అధ్యయనం చేసి,భవ్య మార్గాన్ని పట్టినవవ్య ప్రయోగశీలి గిడుగు వెంకటరామమూర్తి.అడవుల్లో జీవించేవారు మాట్లాడుకునే 'సవర' భాషకు వ్యాకరణం రూపకల్పన చేసి,శాస్త్రీయత తీసుకువచ్చిన ఘనుడు.అధ్యాపకుడిగా, జ్ఞాన సముపార్జన కోసం విద్యార్థులు పడే కష్టాన్ని అర్థం చేసుకున్నాడు.తమ భావాలకు వాక్కుల రూపం ఇవ్వడానికి సామాన్యులు పడే తపనను తెలుసుకున్నాడు.గ్రాంథిక భాషా బంధనాల నుంచి విద్యా విధానాన్ని తెంచి,ప్రజల వాడుకభాషలోకి తెచ్చాడు. దాని వల్ల చదివేవారి సంఖ్య,చదువరుల సంఖ్య పెరిగింది.తద్వారా,తెలుగునేలపై అక్షరాస్యత పెరిగింది.ఆలోచన పెరిగింది.ఆలోచనను వ్యక్తీకరించే శక్తి పెరిగింది.వాడుకభాష అవసరాన్ని చెబుతూ వీధివీధులా తిరిగాడు.పండితులతో గొడవలు పడ్డాడు.ఇంటినే పాఠశాలగా మార్చాడు.సొంతంగా 'తెలుగు' అనే పేరుతో ఒక పత్రికను నడిపాడు.గురజాడ,కందుకూరి వీరేశలింగం, చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి,తల్లావజల శివశంకరశాస్త్రి,పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి,వజల చినసీతారామశాస్త్రి మొదలైనవారు గిడుగుకు అండగా నిలిచారు.ఆయనతోకలిసి,వాడుకభాషా ఉద్యమంలో నడిచారు.బావా ఎప్పుడు వచ్చితీవు,చెల్లియొ చెల్లకో,జండాపై కపిరాజు,అలుగుటయే ఎరుంగని మొదలైన వాడుక భాషా పదాలతో తిరుపతి వేంకటకవులు 'పాండవ ఉద్యోగ విజయాలు'పేరుతో పద్యనాటకాలు రాయడానికి ప్రేరకుడు గిడుగువేంకటరామమూర్తి.కారకుడు,పోషకుడు పోలవరం జమీందారు రాజా కొచ్చెర్లకోట వెంకటకృష్ణారావు.వాడుకభాష కోసం ఉద్యమించే గిడుగు వ్యాకరణానికి,ఛందస్సుకు ఎవరైనా గౌరవం ఇవ్వకపోయినా, వ్యాకరణపరమైన తప్పులు జరిగినా ఊరుకునేవాడు కాదు. ఎంతటి పండితుడినైనా చీల్చి చెండాడేవాడు.మీసాలపై తిరుపతి వేంకటకవులు చెప్పిన పద్యం తెలుగులోకంలో సుప్రసిద్ధం.మీసం పెంచడం సంగతి తర్వాత... ముందు..ఆ పద్యంలో ఉన్న దోషం సంగతి చూడు...అని చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రికి గిడుగు మొట్టికాయలు వేశాడు.గెల్చితిరేని అని ఉండాలి.నువ్వు గెల్చిరేని అని రాశావు,ఇది తప్పు,సరిదిద్దుకో...అంటూ తిరుపతి వేంకటకవులను నిలదీశాడు.ఆమ్మో! గిడుగు పిడుగే అంటూ చెళ్ళపిళ్ళ సర్దుకున్నాడు.అంతటితో ఆగక 'గిడుగు పిడుగే' అని ప్రత్యేక వ్యాసం కూడా రాశాడు. పాండవ ఉద్యోగవిజయాల వంటి పద్యకృతులతో పాటు,చెళ్ళపిళ్ళ ఎన్నో వచన రచనలు చేశారు.ఇవన్నీ వ్యావహారిక భాషలోనే రాశారు.ఇలా,తిరుపతి వేంకటకవుల వంటి సంప్రదాయ పద్యకవులను కూడా వాడుకభాషవైపు మళ్లించిన ఘనుడు,ఘటికుడు గిడుగు. స్వయంకృషితో శాసనాల భాషను అర్థం చేసుకోవడం నేర్చుకున్న పట్టుదల గిడుగు సొంతం.ఒరిస్సా రాష్ట్రం ఏర్పడినప్పుడు పర్లాకిమిడి వంటి తెలుగుప్రాంతాలు కూడా ఒరిస్సా రాష్ట్రంలోకి వెళ్లిపోయాయి.ఈ విధానాన్ని గిడుగు తీవ్రంగా వ్యతిరేకించడమేకాక, తెలుగునేలపైనే జీవించాలనే సంకల్పంతో,తన సొంతవూరు పర్లాకిమిడిని వదిలి రాజమండ్రికి తరలి వచ్చేశాడు.గిడుగు రామమూర్తికి తెలుగుభాష, గాలి,నేలపై ఉండే భక్తికి,ప్రేమకుఅది గొప్ప ఉదాహరణ.1937లో తాపీ ధర్మారావు సంపాదకుడిగా 'జనవాణి'అనే పత్రికను స్థాపించారు.కేవలం ఆధునిక ప్రమాణభాషలోనే వార్తలు, సంపాదకీయాలు రాయడం మొదలుపెట్టారు.అదంతా కూడా గిడుగు ప్రభావమే.గిడుగు,గురజాడ ఇద్దరూ విజయనగరంలో సహాధ్యాయులు.ఇద్దరూ వాడుకభాషకోసం ఉద్యమించినవారే కావడం విశేషం.సంస్కృతం, ఇంగ్లిష్, చరిత్ర ముఖ్య విషయాలుగా గిడుగు బి.ఏ పూర్తి చేశారు. సంస్కృతం,ఇంగ్లిష్,తెలుగు బాగా చదువుకున్నారు. సామాన్యులకు అర్థం కావడం కోసం తన భాషాపాండిత్యాన్ని కుదించుకొని,వాడుకభాషలో రచనలు చేశారు, ఉపన్యాసాలు ఇచ్చారు.ప్రజలను చైతన్య పరిచారు,జ్ఞానాన్ని సామాన్యుడి చెంతకు చేర్చారు. కావ్యాలను, ప్రబంధాలను,గ్రాంథికభాషను,అలంకారశాస్త్రాలను గౌరవిస్తూనే,ఆధునిక భాషాయానం చేసిన అత్యాధునికుడు,దార్శనికుడు,ఆదర్శప్రాయుడు గిడుగు.భాషను సామాన్యుడికి చేర్చమని చెప్పాడు కానీ, భాషాపాండిత్యాలు,అధ్యయనాల స్థాయిని దిగజార్చమని ఎప్పుడూ చెప్పలేదు.ఛందస్సు, వ్యాకరణం, పద్యాలు,ప్రబంధాలను వదిలివెయ్యమని గిడుగు ఏనాడూ అనలేదు.భాషకోసమే శ్రమించి,సామాన్యుడి కోసమే తపించి జీవించిన పుణ్యమూర్తి గిడుగు రామమూర్తి.విద్యార్థికి ప్రతి దశలో తెలుగు భాషను అందించాలి.కనీసం 10ఏళ్ళ వయస్సు వరకూ మాతృభాషలోనే విద్యాబోధన జరగాలి.తెలుగు భాషా, సాహిత్యాలు చదువుకున్నవారికి ప్రోత్సాహంలో, ఉపాధిలో,ఉద్యోగాలలలో పెద్దపీట వెయ్యాలి. తెలుగు చదువుకున్నవారు ఆత్మన్యూనతకు గురయ్యే పరిస్థితులు కల్పించరాదు.పద్యం మన ఆస్తి,అవధానం మన సంతకం.ఆధునికత పేరుతో వ్యాకరణం,ఛందస్సులను దూరం చేస్తే? కొన్నాళ్ళకు మనవైన పద్యాలు, అవధానాలు కానరాకుండా పోతాయి.మన భాషా భవనాల పునాదులు కదిలిపోతాయి. మెల్లగా మనదైన సంస్కృతి మృగ్యమైపోతుంది.తెలుగును వెలిగించడం,ఆ వెలుగులో జీవించడమే గిడుగు వంటి తెలు గువెలుగులకు మనమిచ్చే అచ్చమైన నివాళి.భాష,సంస్కృతి,సంప్రదాయాలను నిలబెట్టడమే నిజమైన వేడుకలు.

# వ్యావహారిక బాషకు పితామహుడు
# గిడుగు రామమూర్తి

## అచ్చ తెలుగు చిచ్చర పిడుగు గిడుగు
## నేడు తెలుగు భాషా దినోత్సవం

తెలుగు వ్యావహారిక బాషకు పితామహుడిగా, అభినవ వాగను శాసనునిగా పేరెన్నిక గన్న గిడుగు రామమూర్తి పంతులు జన్మదినమైన ఆగస్టు 29 ను 'తెలుగు భాషా దినోత్సవము'గా తెలుగు రాష్ట్రాలు పరిగణిస్తున్నాయి. గిడుగు వెంకట రామమూర్తి (1863–1940) తెలుగు ప్రజలు స్మరించదగ్గ ప్రథమ స్మరణీయుడు గిడుగు రామమూర్తి. ఆధునిక విజ్ఞాన వ్యాప్తికి, వచన రచనకు కావ్యభాష పనికి రాదనీ, సామాన్య జనానికి అర్థమయ్యే సమకాలీన "శిష్టవ్యావహారికం"లో ఉండాలనీ ఆనాటి సాంప్రదాయిక పండితులతో హొరాహొరీగా యుద్ధంచేసి ఆధునిక ప్రమాణ భాషను ప్రతిష్ఠించటానికి మార్గదర్శకుడైన వాడు గిడుగు రామమూర్తి. గిడుగు వారి వ్యవహారిక భాషోద్యమం వల్ల ఆధునిక సాహిత్యం కొత్త సొగసులు సంతరించుకుంది. రచనావైవిధ్యం, వైశిష్ట్యంతో పుష్టి చేకూరింది. విశ్వ విద్యాలయాలలో వాడుకభాష రాజ్య మేలుతోంది. పత్రికలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. అక్ష రాస్యత పెరిగింది. తెలుగు అధికార భాషగా, పరిపాలనా భాష గా కీర్తికెక్కింది. దీనికంతటికీ గిడుగు పిడుగే మూలకారకుడు. గ్రాంధికభాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకు వచ్చి, నిత్య వ్యవహారం లోని భాషలో ఉన్న అందాన్నీ, వీలునూ తెలియ జెప్పిన మహనీయుడు. ఆంధ్రదేశంలో వ్యావహారిక భాషోద్యమానికి మూల పురుషుడు. బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘసంస్కర్త, హేతువాది. శిష్టజన వ్యవహారిక భాషను గ్రంథరచనకు స్వీకరింప జేయడానికి చిత్తశుద్ధితో కృషిచేసిన అచ్చ తెలుగు చిచ్చర పిడుగు గిడుగు. గిడుగు ఉద్యమంవల్ల ఏ కొద్దిమందికో పరిమితమైన చదువు వ్యావహారిక భాషలో సాగి, అందరికీ అందుబాటు లోకి వచ్చింది. పండితులకే పరిమితమైన సాహిత్య సృష్టి, సృజనాత్మకశక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ వీలైంది. తెలుగు భాష గురించి ఆధునిక పద్ధతిలో ఆలోచించిన తొలి భాషా విజ్ఞాని గిడుగు రామమూర్తి. ఈ వాడుక భాషా వాదాన్ని చేపట్టినందుకు గిడుగువారు పండితులతో యుద్ధం చేయవలసి వచ్చింది. దీన్ని గ్రామ్య వాదమనీ, గిడుగు వారు గ్రామాచార్యులనీ గ్రాంధికవాదులు హేళన చేస్తూ పద్యాలూ, వ్యాసాలు రాశారు. జయంతి రామయ్య పంతులు, కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి, వేదం వెంకటరామ శాస్త్రి, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి మొదలైన వాళ్ళతో ఢీకొనవలసి వచ్చింది. ఆంధ్రసాహిత్య పరిషత్తు గ్రాంధిక భాషావాదానికి అండగ నిలిచింది. గిడుగువారు 'తెలుగు' పత్రిక ద్వారా గ్రాంధిక వాదాన్ని ఖండిస్తూ వ్యావహారిక వాదాన్ని బల పరిచారు. పండితులే తప్పులు లేకుండా రాయలేని గ్రాంధికం బలవంతాన రుద్దడం ఎందుకంటూ "ఆంధ్ర పండిత బిషక్కుల భాషా భేషజం" అనే పుస్తకం ప్రచురించారు. తెలుగు సాహిత్యంపై పండితుల గుత్తాధి కారాన్ని పోగొట్టాడు. ప్రజలలో ఒక్కరు కూడా నిరక్షరాస్యులు కాకూడదని, అందుకు వాడుక భాష సాధనం కానీ... గ్రాంధికమని తమకే రాని, తమకే తెలియని, భాషను పిల్లలు ఉపయోగించాలనీ అందులోనే పుస్తకాలు రాయాలనీ, దానిలోనే పాఠ్య పుస్తకాలుండాలని శాసించడం అవివేకమని ఉద్యమించారు. చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి, తాతా సుబ్బరాయుడు శాస్త్రి వంటి ఉద్దండ పండితులే ఆయన వాదంలోని సబబు గుర్తించారు. బల పరచారు. కుండలాల, శాలువాల పండితుల సాహిత్యాధికారం, అసంబద్ధమైన వ్యాకరణ, ఛందశ్శాస్త్ర దండనాధికారం చెల్లదన్నాడు. సాహిత్య ఫ్యూడల్ సంప్రదాయాన్ని ధిక్కరించి, నిరాకరించి నిర్మూలించి ప్రజాస్వామ్య పద్ధతిని తెలుగు సాహిత్యంలో ప్రతిష్ఠించాడు.తప్పు ఒప్పులు నిర్ణయించే అధికారం ఎవరికీ లేదన్నాడాయన.భాషకైనా, మనిషికైనా మార్పు కూర్పు చేర్పు సహజమని బోధించాడు, నచ్చచెప్పాడు.



### వ్యావహారిక భాషోద్యమం

తెలుగు భాషలో వచ్చిన చారిత్రాత్మకమైన మార్పుకు ప్రధాన కారణం గిడుగు రామమూర్తి సారథ్యంలో నడిచిన వ్యావహారిక భాష ఉద్యమం లేదా వ్యావహారిక భాషోద్యమం. ఇది 20వ శతాబ్దపు పూర్వార్ధంలో ప్రాచీనమైన గ్రాంథిక భాషకు మరియు వ్యావహారిక లేదా వాడుక భాషకు మధ్య జరిగిన భాషా ఉద్యమం. పూర్వం తెలుగులో పాఠ్యాంశాలు అన్నీ గ్రాంధిక బాషలోనే ఉండేవి. 1907లో ఉత్తర కోస్తా జిల్లాలకు పాఠశాలల ఇన్స్పెక్టర్‌గా వచ్చిన జె.ఎ.యేట్స్ అనే బ్రిటీష్ అధికారి ప్రజలు వ్యవహరించే భాష, పుస్తకాల భాష మధ్య ఉన్న తేడాలు చూసి ఆవేదన చెందారు. ఆయన అదే విషయాన్ని గిడుగుతో చర్చించారు. ఆ విధంగా గిడుగు జీవిత ఉత్తరార్థంలో ఈ విషయాన్ని గురించి గాఢంగా ఆలోచించి తెలుగు విద్యా విధానంలో అన్యాయం జరుగుతున్నదని గుర్తించాడు. గురజాడ, గిడుగులు, శ్రీనివాస అయ్యంగారు, యేట్సు ు ఈ నలుగురి ఆలోచనల వల్ల వ్యావహారిక భాషోద్యమం ఆరంభమైంది. 1919–20ల మధ్య వ్యావహారిక భాషోద్యమ ప్రచారం కొరకు 'తెలుగు' అనే మాసపత్రిక నడిపాడు. వ్యవహారిక భాషను ప్రతిఘటించిన ఆంధ్ర సాహిత్య పరిషత్తు సభలో (1925, తణుకులో) నాలుగు గంటలపాటు ప్రసంగించి గ్రంథాల్లోని ప్రయోగాల్ని ఎత్తి చూపి తన వాదానికి అనుకూలంగా సమితిని తీర్మానింప జేసాడు "గిడుగు". సాహితీ సమితి, నవ్య సాహిత్య పరిషత్తు మొదలైన సంస్థలు కూడా గిడుగు వాదాన్ని బలపరచాయి. స్కూలు కాలేజీ పుస్తకాల్లో గ్రాంథికభాషే పాతుకు పోయిందిబీ కొన్నిటిలో వీరేశలింగంగారు ప్రతిపాదించిన సరళ గ్రాంథికం కూడా వచ్చింది. గిడుగు రామమూర్తి ఊరూరా ఉపన్యాసాలిస్తూ గ్రాంథికంలో ఏ రచయితా నిర్దిష్టంగా రాయలేదని నిరూపించాడు. 1919లో గిడుగు "తెలుగు" అనే మాసపత్రికను స్థాపించి తన శాస్త్రీయ వ్యాసాలతో, ఉపన్యాస పాఠాలతో అవిశ్రాంతంగా పోరాటం సాగించాడు. కాని ఆ పత్రిక ఒక ఏడాది మాత్రమే నడిచింది. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి, తల్లావజుల శివశంకరశాస్త్రి, కందుకూరి వీరేశలింగం, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, వజల చిన సీతారామశాస్త్రి మొదలైన కవులు, పండితులు వ్యావహారిక భాషావాదం వైపు మొగ్గు చూపారు. 1919 ఫిబ్రవరి 28న రాజమహేంద్రవరంలో కందుకూరి వీరేశలింగం అధ్యక్షులుగా, గిడుగు కార్యదర్శిగా "వర్తమానాంధ్ర భాషా ప్రవర్తక సమాజం" స్థాపించారు. 1924లో కాకినాడలోని ఆంధ్ర సాహిత్య పరిషత్తు ఆధికారికంగా వ్యావహారిక భాషా నిషేధాన్ని ఎత్తివేసింది. 1933లో గిడుగు రామమూర్తి సప్తతి మహోత్సవం ఆయన అభిమానులు, శిష్యులు రాజమహేంద్ర వరంలో బ్రహ్మాండంగా జరిపారు. తెలికచెర్ల వెంకటరత్నం సంపాదకుడుగా ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన 46 పరిశోధక వ్యాసాలతో వ్యాస సంగ్రహం అనే ఉద్గ్రంథాన్ని ఆయనకు సమర్పించారు. 1936 లో నవ్యసాహిత్య పరిషత్తు అనే సంస్థను ఆధునికులు స్థాపించి సృజనాత్మక రచనల్లో శిష్ట వ్యావహారికాన్ని ప్రోత్సహించే "ప్రతిభ" అనే సాహిత్యపత్రికను ప్రచురించారు. 1937లో తాపీ ధర్మారావు సంపాదకులుగా "జనవాణి" అనే పత్రిక కేవలం ఆధునిక ప్రమాణ భాషలోనే వార్తలు, సంపాదకీయాలు రాయటం మొదలు పెట్టింది.

వాడుక భాష గ్రామ్యభాష కాదు. సజీవ భాష. తెలుగు భాష మారుతోంది. కాబట్టి కొత్త వ్యాకరణాలు, సవరణలు వెలువడ్డాయి. నన్నయ భాషకి, తిక్కన భాషకి, ప్రబంధ బాషకి, దక్షిణాంధ్ర యుగం నాటి భాషకి చాలా భేదాలున్నాయి. వ్యావహారిక భాషావాదం ప్రాచీన సాహిత్యానికి వ్యతిరేకంగా ఏర్పడలేదు. ప్రాచీన కావ్యాలను, వ్యాకరణాలను గౌరవిస్తూనే వాడుక భాషకి ప్రాచుర్యం కల్పించాలి.

వాడుక భాషలో కూడా ఉత్తమ సాహిత్యాన్ని సృష్టించవచ్చును. ఉదాహరణ: గురజాడ అప్పారావు గారి కన్యాశుల్కం. గ్రాంథిక భాష పండితులకే అర్థం కాదు. గొప్ప పండితులు కూడా తప్పులు లేకుండా రాయలేరు. మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్ర, సాంకేతిక రంగాలలో విజ్ఞానం పెంపొందించు కోవాలంటే పాఠ్య గ్రంథాలు వాడుక భాషలోనే ఉండాలి. వాడుక భాష ప్రజల భాష. గ్రాంథిక భాష పండితుల భాష. ఆ రోజుల్లోనే అతనికి దగ్గర అడవుల్లో ఉండే సవరల భాష నేర్చుకొని వాళ్ళకు చదువు చెప్పాలనే కోరిక కలిగి, తెలుగు, సవర భాషలు రెండూ వచ్చిన ఒక సవర వ్యవహర్తను ఇంట్లోనే పెట్టుకొని చాలా ఏళ్ళు సవర భాష నేర్చుకున్నాడు. సవర భాషలో పుస్తకాలు రాసి సొంతడబ్బుతో స్కూళ్ళు పెట్టి అధ్యాపకుల జీతాలు చెల్లించి సవరలకు వాళ్ళ భాషలోనే చదువు చెప్పే ఏర్పాట్లు చేశాడు. మద్రాసు ప్రభుత్వం వారు ఈ కృషికి మెచ్చి 1913లో "రావ్ బహదూర్" బిరుదు ఇచ్చారు. భాషాశాస్త్రంలో అప్పుడప్పుడే వస్తున్న పుస్తకాలు చదివి వ్యాకరణ నిర్మాణ విధానం నేర్చుకొన్నారు. ముప్పై అయిదేళ్ళ కృషితో 1931లో ఇంగ్లీషులో సవర భాషా వ్యాకరణాన్ని, 1936లో సవర–ఇంగ్లీషు కోశాన్ని నిర్మించారు.

మద్రాసు ప్రభుత్వం వారు గిడుగు ఆంగ్లంలో తయారుచేసిన సవరభాషా వ్యాకరణాన్ని 1931లోను, సవర–ఇంగ్లీషు కోశాన్ని 1938లోను అచ్చువేశారు. 1934లో ప్రభుత్వం అతనికి 'కైజర్–ఇ–హింద్ ' అనే స్వర్ణ పతకాన్నిచ్చి గౌరవించింది.

మనదేశంలో మొట్టమొదట ఆస్ట్రో–ఏషియాటిక్ భాషా కుటుంబంలో ఒక శాఖ అయిన ముండా భాషల ఉపకుటుంబ భాషను శాస్త్రీయంగా పరిశీలించిన వాడు గిడుగు రామమూర్తి. ఆర్యభాషా వ్యవహర్తలు మన దేశానికి రాకముందు (క్రీ.పూ. 15వ శతాబ్ది) నుంచి వీళ్ళు మనదేశంలో స్థిరపడ్డారు. వీరిని "శబరు"లనే ఆదిమ జాతిగా ఐతరేయ బ్రాహ్మణం (క్రీ.పూ. 7వ శతాబ్ది) లో పేర్కొన్నారు. హైస్కూల్లో చరిత్రపాఠం చెప్పేరోజుల్లోనే దేవాలయాల్లో ఉన్న శాసనాల లిపిని స్వతంత్రంగా నేర్చుకుని చదివాడు. విషయ పరిశోధన చేసి వాటి ఆధారంగా ఎన్నో చారిత్రకాంశాలు, ముఖ్యంగా గాంగ వంశీయులను గురించి రామమూర్తి ఇంగ్లీషులో ప్రామాణిక వ్యాసాలు రాసి ప్రచురించాడు. 1911లో గిడుగు 30 ఏళ్ళ సర్వీసుతో అధ్యాపక పదవి నుంచి స్వచ్ఛందంగా రిటైరయ్యాక, ఆధునికాంధ్ర భాషాసంస్కరణ వైపు దృష్టి మరల్చాడు. గిడుగు రామమూర్తి 1940 జనవరి 15వ తేదీన ప్రజామిత్ర కార్యాలయంలో పత్రికా సంపాదకులను సంబోధిస్తూ చేసిన తన తుది విన్నపంలో వ్యావహారిక భాషా వ్యాప్తికి చాలా సంతృప్తి పొందాడు. కాని, ప్రభుత్వ విద్యాశాఖ, విశ్వ విద్యాలయాలు గ్రాంథికాన్ని వదిలిపెట్టక పోవటానికి బాధపడ్డాడు. గిడుగు జన్మదినమైన ఆగస్టు 29 ను 'తెలుగు భాషా దినోత్సవము'గా తెలుగు రాష్ట్రాలు పరిగణిస్తున్నాయి. తెలుగు వ్యావహారిక బాషకు పితామహుడిగా పరిగణించ బడే, తెలుగు బాషకు ఎనలేని సేవ చేసిన గిడుగు 1940, జనవరి 22న కన్ను మూశారు.

రామకిష్టయ్య సంగనభట్ల...

# పట్టాభిషేకము



ధృవుడు తిరిగి అంతఃపురమునకు వెళ్ళిపోతుంటే కుబేరుని కి ఈ వార్త తెలిసింది. తాతగారు చెబితే ఇంత కోపమును కుబుసం వదిలినట్లు వదిలేసి ధ్రువుడు ఇంటికి వెళ్ళి పోతున్నాడని తెలుసుకున్నాడు. పెద్దల మాటలు విన్న పిల్లలు ఎటువంటి వరములు పొందుతారో చెపుతుంది ధృవోపాఖ్యానం. కుబేరుడు వచ్చి 'నీకు ఎంతో కోపం వచ్చిందట, కొన్ని వేలమంది యక్షులను సంహరించా వట. అంతకోపంతో ఉన్నా మావాళ్ళు నీమీద కలియ బడుతుండగా తాతగారు వచ్చి ఇంకా యుద్ధం చేయకు అనేసరికి ఆయన మాటవిని యుద్ధం మానివేశావు. నీలాంటి వానిని చూడడము నాకు మిక్కిలి సంతోషమును కలిగించింది. నీకు కావలసిన వరం కోరుకో ప్రసాదిస్తా ను' అన్నాడు. ధృవుడు ' నా బుద్ధిలో చిన్న వైక్లబ్యం వచ్చింది. నేను ఎంతో పాపపు పని చేశాను. అందుకని నీవు నాకు వరం ఇస్తే ఏ వరం ఇస్తావో తెలుసా! నా బుద్ధి రాత్రనక పగలనక ఏ కాలమునందు కూడా భగవంతుని పాదారవిందముల నుండి విస్మరణము లేని నామము చెపుతూ తరించి పోయేటటువంటి భక్తి నాకు నిర్హేతుకముగా నీవరము చేత కటాక్షింపబడుగాక' అని అడిగాడు. ఇదీ వ్యక్తి కోరుకోవలసింది. కుబేరుడు సంతోషముతో వరమును ధృవునకు అనుగ్రహించాడు. దానితో ధృవుడు అపారమయిన భక్తి సంపన్నుడు అయిపోయాడు. రాజ్యమును పరిపాలించాడు. కుమారుడ ి కి పట్టాభిషేకము చేశాడు. బదరికాశ్రమమునకు చేరి కూ ర్చుని తపస్సు చేశాడు. ఆ సమయంలో ఒక ఆశ్చర్యకర మయిన సంఘటన జరిగింది. ఒక చిత్రవిచిత్రమయిన విమానం ఒకటి వచ్చి ఆ పర్వత శిఖరం మీద దిగింది. వారు నీలమేఘము వంటి శరీరము కలిగి శంఖ చక్ర గద పద్మములను పట్టుకుని తాను అయిదవ ఏట చూసిన శ్రీమన్నారాయణుడు ఎలా ఉంటాడో అటువంటి స్వరూపములతో ఇద్దరు పురుషులు అందులోంచి నడిచి వచ్చారు. ధృవుడు వాళ్ళను చూసి ఆశ్చర్యపోతూ లేచి వాళ్లకి నమస్కరించి మీరు ఎవరు? ఎందుకు వచ్చారు?' అని అడిగాడు. వాళ్ళు 'మరచిపోయావా! ఐదేండ్ల వయసులో నీవు తపస్సు చేయగా స్వామి వరం ఇచ్చారు. నీ శరీరం పడిపోయే రోజు వచ్చింది. నిన్ను మేము ధ్రువ మండలమునకు తీసుకువెళ్ళాలి. స్వామి నీకోసం విమానం పంపారు. మేము విష్ణుపార్షదులము వచ్చి విమానం ఎక్కమ'ని అన్నారు. ధృవుడు జ్ఞానియై తనే శరీరమును వదిలిపెట్టాడు. మృత్యువు శిరస్సు మీద పాదము పెట్టి విమానంలోకి ఎక్కాడు. అది లోకములను దాటి వెళ్ళిపోతోంది. ఆశ్చర్యంగా ఆ లోకములన్నింటి వంక చూస్తున్నాడు. విమానంలో కూర్చుని అనుకున్నాడు 'ఓహోహో ఏమి లోకములు! ఇంతమంది ఇన్ని బాధలు పడి పుణ్యములు పొంది, పుణ్యములు అయిపోయిన తరువాత క్రింద పడిపోయి ఇంత అల్లర్లు పడిపోతున్నారు. అయిదు నెలలు తపస్సు చేస్తే నా స్వామి నాకు ఇటువంటి స్థితి ఇచ్చారు. పెద్దపదవి అంటే ఏమో అనుకున్నాను. సప్తర్షులు, కశ్యపుడు, ధర్మము, అగ్నిహోత్రము, జ్యోతిశ్చక్రము తిరుగుతున్న మండలమునకు నేను ధృవస్తంభమునై వెలుగొందబోతున్నాను. ఇంతమంది నా చుట్టూ తిరుగుతూ ప్రదక్షిణం జరుగుతూ ఉంటుంది. నేను నిరంతరం విష్ణులోకదర్శనం చేస్తూ ఉంటాను. ఎంత అదృష్టవంతుడిని' అనుకుని ఈ అదృష్టమునకు కారణము ఎవరని ఆలోచించాడు. 'మనసులో దీనికి కారణం మా అమ్మ. ఆనాడు మా అమ్మ నన్ను నారా యణుని గూర్చి తపస్సుకు వెళ్ళమని చెప్పింది. ఆమె మాట నన్ను ఈ స్థితికి తీసుకువెళ్ళింది. కానీ ఆ పిచ్చితల్లి ఎక్కడ ఉన్నదో' అనుకున్నాడు. అనుకునే సరికి ఈ విషయమును పార్షదులు గ్రహించారు. 'నిన్నీ స్థితికి తీసుకువచ్చింది కాబట్టే శ్రీ మహావిష్ణువు నీకన్నా ముందు ఆవిడ విమానం నడుపమని చెప్పారు. కిటికీలోంచి బయటకు చూడు' అన్నారు. ధృవుడు బయటకు చూశాడు. ముందు విమానంలో దివ్యమైన తేజోవిరాజి తయై సునీతి వెళ్ళిపోతున్నది. ఆవిడ శ్రీమన్నారాయణుడి లోకి వెళ్ళిపోయింది. ధృవుడు ధృవ మండలమునకు చేరుకొని తదనంతరము స్వామివారి లోనికి లీనమై పోయి పరబ్రహ్మము సాయుజ్య మోక్షమును పొందాడు. ఇంతటి అద్భుతమయిన ఈ ధృవోపాఖ్యానం ఎవరైతే పరమ భక్తితో వింటారో వారందరికీ కూడా ఉత్తరక్షణం అప్పుడే అక్కడే ఆ క్షణంలోనే పాపనాశనము జరిగి శ్రీమన్నారా యణుని అనుగ్రహం కటాక్షింపబడుతుంది. ఒకవేళ అల్పాయుర్దాయంతో మృత్యువు తరుముకు వస్తుంటే మృత్యువు ఆగి ఆయుర్దాయం కలుగుతుంది. గ్రహముల వలన ఉద్రిక్త ఫలితము రాబోతుంటే అటువంటి ఫలితములు ఆగిపోయి శుభమును పొందుతారు, కీర్తిని ఇస్తుంది.

**3. పృథు చరిత్ర:**

ఒకానొక సమయంలో ఈ దేశమును అంగరాజు పరిపాలిస్తూ ఉండేవాడు. ఆయన మహా ధార్మికుడు. కేవలము ధర్మానుష్టానము తప్ప ఎన్నడు అధర్మము చెయ్యని వాడు. అటువంటి అంగరాజు ఒకసారి అశ్వమేధయాగం చేస్తున్నాడు. ఆ సందర్భముగా దేవతలను అందరిని పిలిచి హవిస్సులు ఇస్తున్నాడు. ఆ రోజులలో స్వాహా అంటూ ఆ దేవతలను పిలిస్తే ఆ దేవత వచ్చి ఎదురుగా కూర్చుని హవిస్సును అగ్నిముఖంగా పుచ్చుకుని నోట్లో వేసుకుని వెళ్ళేవారు. అక్కడ ఉన్నటువంటి ఋషులు మంత్రములతో దేవతలను ఆవాహన చేస్తున్నారు. ఒక్క దేవత రాలేదు! ఏ దేవతా రాకపోతే అంగరాజు ఆశ్చర్యపోయాడు. 'ఎందుచేత ఇలా జరిగింది' అని ఋషులను అడిగాడు. పాయసపాత్ర తీసుకువెళ్ళి భార్యకి ఇచ్చాడు. ఆవిడ పేరు సునీథ. ఆవిడ భర్తృ సంగమము చేతనే సంతానమును పొందింది. తేజస్సు అంగరాజు తేజస్సే ఇప్పుడు అది ప్రజోత్పత్తిని చేసింది. కారణమేమి? ఇన్నాళ్ళు ఎందుకు చేయలేక పోయింది? అనగా ప్రజోత్పత్తిని చెయ్యడానికి వీలు లేనటువంటి స్థితి పాపము ఇన్నాళ్ళు సంతానము కలుగకుండా చేసింది. ఇపుడు ఆ విఘ్నం పోయి సంతానం కలగడానికి కావలసిన యోగ్యత సిద్ధించింది. కానీ క్షేత్రశుద్ధి జరుగలేదు. క్షేత్రమునందు దోషం ఉన్నది. ఆమె మృత్యువు పుత్రిక కావటం చేత యాగమునందు ఉద్భవించినటువంటి ప్రజాపత్య పురుషుడు ఇచ్చినటువం టి ప్రసాదము తిన్నప్పటికీ కుమారుడు వ్యగ్రస్వభావము కలిగినటువంటి వాడు జన్మించాడు. వానికి 'వేనుడు' అని పేరు వచ్చింది. జన్మతః వచ్చిన బుద్ధి బోధకు మారడం చాలాకష్టం. వేనుడు ప్రతిరోజూ నిష్కారణంగా వేటకు వెళ్ళి కుందేలు పిల్లల దగ్గరనుంచి లేళ్ళు జింకల వరకు చంపేసేవాడు. ఆ చంపడములో అర్థం లేదు. అతను వేటనుండి తిరిగి వస్తున్నప్పుడు క్రీడా మైదానంలో ఆడుకునే పిల్లలను చూసేవాడు. ఆడుకుంటున్న పిల్లలను బడిత పుచ్చుకుని వారు చచ్చిపోయేవరకు కొట్టేవాడు. వాడు సంతోషంగా వెళ్ళిపోయేవాడు. నాకు ఇంత దుష్టుడు పుట్టాడు. ఇలాంటి కొడుకు ఉన్న నాకు రాజ్యం ఉంటే ఎంత? సింహాసనం ఉంటే ఎంత? రోజూ వీడికి చెప్పుకునే కన్నా ఎక్కడికో పోయి ఈశ్వరారాధన చేసుకుని మట్టిలో కలిసిపోతే మంచిదనుకుని విరాగియై అన్ని భోగములు కలిగినటువంటి అంతఃపురమును, భార్యను, బిడ్డను విడిచి పెట్టి గురువులకు కూడా చెప్పకుండా తానొక్కడే కాలినడకన నడిచి అరణ్యములోకి వెళ్ళిపోయాడు. మరునాడు అంతఃపురంలో రాజు కనపడలేదు. వారు ఆయన తల్లిగాంయిన సునీథతో మాట్లాడి వేనుడికి పట్టాభిషేకము చేశారు.

సేనాధిపత్యం రమేష్

# దేశం కోసం జీవించు



ప్రతి వ్యక్తి నాకోసం కాదు మీకోసం అనే జీవన విధానంతో దేశం కోసం జీవించాలిదేశం బాగుంటే నేను బాగుంటాను దేశ వికాసమే నా వికాసం దేశ అభ్యున్నతే నా అభ్యున్నతి అని ఆలోచించేవారు దేశానికి కావాలి మన సామర్థ్యాలను దేశఅభ్యున్నతికి ఉపయోగించాలి దేశం కోసం ఏవిధంగా జీవించాలో ఆలోచించాలిదేశ రక్షణ ధర్మ రక్షణప్రకృతి రక్షణ ఆధునికీకరణ మోజులో పాశ్చాత్యీకరణ వద్దు మతాన్ని ఆధ్యాత్మీకరించడం మనిషిని జాతీయవాదం వైపు నడిపి ంచడం తక్షణ అవసరం జాతీయ వాదమే అన్ని సమస్యలకు పరిష్కార మంత్రం ఆధునిక విలువలు దేశ సంస్కృతి వారసత్వ రక్షణ సామాజిక బాధ్యత కావాలి అసమానతలు అవిద్య పేదరికం అవినీతి వివక్ష మహిళా సాధికారిత యువత సాధికారితడ్రగ్స్ మాదక ద్రవ్యరహిత భారత్ ఆవిర్భావం యువత ఆత్మహత్యలు నేరరాజకీయాలు సామాజిక సమస్యల పరిష్కారంలో క్రియాశీలక పాత్ర పోషిద్ధాం ధర్మాన్ని సంస్కృతిని ఆచరిద్దాం గౌరవిద్దాం దేశాన్ని రక్షిద్దాంవికసిత భారత్ లక్ష్యంగా భారత్ ను విశ్వ గురువుస్థాయికి చేర్చుదాం.

నేదునూరి కనకయ్య

# ప్రజలు ప్రాణాలు పోతున్న చోద్యం చూస్తున్న పాలకులు



**కొండపల్లి,ఇబ్రహీంపట్నం ప్రాంతాలలో పారిశ్రామిక కాలుష్యాన్ని నియంత్రించాలి-కిడ్నీ బాధితులకు న్యాయం చేయకుంటే అసెంబ్లీ ముట్టడి కైనా సిద్ధం-సిపిఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్**

**మైలవరం, ఆగస్టు 28: (ఆంధ్రపత్రిక):** పారిశ్రామిక కాలుష్యం వలన ప్రజల ప్రాణాలు పోతున్న పాలకులు చోద్యం చూస్తున్నారని కొండపల్లి, ఇబ్రహీంపట్నం ప్రాంతాలలో పారిశ్రామిక కాలుష్యాన్ని నియంత్రించాలనీ సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. తిరువూరు నియోజకవర్గాన్ని సిలికాన్ ఫ్లోరైడ్ రహిత నియోజకవర్గంగా మార్చాలని క్యాబినెట్ సమావేశంలో కృష్ణా జలాలు పంపిణి కి చర్యలు చేపట్టాలని కిడ్నీ బాధితులకు న్యాయం చేయకుంటే అసెంబ్లీ ముట్టడి కైనా సిద్ధం అని సిపిఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ లు హెచ్చరించారు.తిరువూరు నియోజకవర్గానికి కృష్ణాజ లాలు అంద జేయాలని, ఏ కొండూరు, గంపలగూడెం మండలాల్లో కిడ్నీ బాధి తులకు న్యాయం చేయాలని, ఫ్లోరైడ్ సిలికాన్ రహిత ప్రాంతంగా మార్చాలని, కొండపల్లి ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో పారిశ్రామిక కాలుష్యాన్ని నిలువరించాలని పాడెక్కుతున్న ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ఆధ్వర్యంలో ఏ కొండూరు డయాలసిస్ సెంటర్ వద్దనుండి విజయవాడ లెనిన్ సెంటర్ వరకు జరుగుతున్న ప్రజా ఆరోగ్య పరిరక్షణ పాదయాత్ర బుధవారం మైల వరం చేరిన సందర్భంగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు పాదయాత్రలో పాల్గొని సంఘీ భావం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయ కూడలి నందు సిపిఐ మండల కార్యదర్శి బుద్ధవరపు వెంకట్రావు అధ్యక్షతన జరిగినటు వంటి కార్యక్రమంలో మాట్లాడుతూ తిరు వూరు నియోజకవర్గం మరో ఉద్దానం లా మారకముందే కిడ్నీ బాధితులను ప్రభుత్వం కాపాడాలని, తిరువూరు, ఏ కొండూరు, గంపలగూడెం, విస్సన్నపేట మండలాలకు కృష్ణా జలాలను సరఫరా చేయాలని, కిడ్నీ రోగుల ప్రాణాలు పోతున్న అధికారులకు ప్రభుత్వాలకు కనిపించడం లేదా అని విమర్శించారు. వేలాదిమంది కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ప్రాణాలను కాపాడు కోవడానికి విజయవాడ ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారని, తాము త్రాగుతున్న మంచినీళ్లు తమ ఆరోగ్యాలను కబళిస్తున్నా ఊరు వదలలేక వూపిరి వదులుతున్నారని ఆవేదన చెందారు. 50 కోట్లతో కృష్ణా జలాలను పైపులైన్ల ద్వారా నాలుగు మండలాలకు సరఫరా చేస్తామని చెప్పిన నాటి ప్రభుత్వ వాగ్దానాలు అమలు కాలే దని విమర్శించారు. కిడ్నీ వ్యాధి భారిన పడి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ప్రభుత్వం ఏర్పాటు చేసిన తిరువూరు, ఏ కొం దూరు డయాలసిస్ కేంద్రాల్లో అర్హత కలిగిన డాక్టర్లు సరైన అంబు లెన్స్ లేకపోవడం వలన గిరిజనుల ప్రాణాలు గాలిలో కలిసిపో తున్నాయని ఆందోళన చెందారు. అధికార ప్రతిపక్ష పార్టీల నాయకులు ఒకరికి ఒకరు దూషించుకుంటున్నారు తప్ప ప్రజలను, ప్రజల ప్రాణాలను కాపాడాలనే ఆలోచన ఏమాత్రం లేదని అన్నారు అందుకే అధికార ప్రతిపక్షాలకు కనువిప్పు కలిగేలా గంపలగూడెం ఏ కొండూరు తండాల కిడ్నీ బాధితుల సమస్యలు పరిష్కరించాలని నియోజక వర్గానికి కృష్ణా జలాలను అన్ని గ్రామాలకు సరఫరా చేయాలని కిడ్నీ బారిన పడిన ప్రతి రోగికి పదివేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొండపల్లి, ఇబ్రహీంపట్నం ప్రాంతాలలో పారిశ్రామిక కాలుష్యాన్ని నివారించాలని, వీటీపీఎస్ నుండి వెలువడే బూడిదతో ప్రజలు సహజీవనం చేస్తున్న ప్రభుత్వాలకు చీమ కొట్టినట్లు కూడా లేదని అన్నారు. క్యాబినెట్ సమావేశంలో కిడ్నీ బాధితులుకు శాశ్వత పరిష్కారంగా కృష్ణా జలాలు పంపిణీ చేయడంతో పాటుగా డయా లసిస్ సెంటర్ లు ఏర్పాటు చేయాలని లేని పక్షంలో కిడ్నీ బాధి తుల అసెంబ్లీ ముట్టడికైనా సిద్ధమని హెచ్చరించారు. ఈ సంద ర్భంగా కిడ్ని బాధితులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర, జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్ , చుండూరు వెంకట సుబ్బారావు, డిహెచ్పిఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బుడ్డి రమేష్, సీపీఐ జిల్లా నాయకులు తాడి పైడియ్య, కొట్టు రమణా రావు, వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వర రావు. సిపిఐ తిరువూరు నియోజకవర్గ పార్టీ కార్యదర్శి షేక్ నాగుల మేరా, అఖిలభారత యువజన సమైక్య ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు లంక గోవిందరాజులు, జిల్లా నాయకులు సింగం శెట్టి మోహన్ ప్రసాద్, షేక్ శుభాని, ఎఐయస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కారేపు కార్తీక్, గంపలగూడెం సిపిఐ మండల కార్యదర్శి ఉన్నం రామకృష్ణ, విసన్నపేట కార్యదర్శి త్యాగరాజు, మాలపాటి ఉదయ్, ఆటో యూనియన్ నాయకులు గుడేల జనార్దన్, కోరే ఎంకాంచ్చి,తదితరులు పాల్గొన్నారు.

# 72 అడుగుల శ్రీ విజయ మహాగణపతి నమూనాను ఆవిష్కరించిన మంత్రి రామనారాయణరెడ్డి



**విజయవాడ పశ్చిమ, ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):** డూండీ గణేశా సేవా సమితి ఆధ్వర్యంలో 72 అడుగుల శ్రీ విజయ మహాగణపతి మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి రామనారాయణరెడ్డి ప్రశంసించారు. బుధవారం విజయవాడ విద్యాధరపురంలోని లేబర్ కాలనీ గ్రౌండ్లో నుండి డూండీ గణేశా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న 72 అడుగుల శ్రీ విజయ మహాగణపతి విగ్రహాన్ని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా సేవా సమితి ఆధ్వర్యంలో రూపొందించిన ఆహ్వాన పత్రికను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి రామనారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎనిమిది ప్రముఖ దేవాలయాల నుండి కల్యాణోత్సవ విగ్రహాలను ఇక్కడకు తీసుకువచ్చి ప్రతినిత్యం కళ్యాణాలను నిర్వహిస్తామని ప్రకటించారు. ప్రజల్లో భక్తి భావం పెంపొందించేలా ఇటువంటి సేవా కార్యక్రమాలను చేయాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలోనే దసరా ఉత్సవాల సందర్భంగా కృష్ణమ్మకు నదిహారతులను ఇచ్చే కార్యక్రమం పునః ప్రారంభిస్తామని చెప్పారు . ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ కమిషనర్ సత్యనారా యణ, డూండీ గణేశ సేవ సమితి నిర్వాహకులు డూండీ రాకేష్ , తెలుగుదేశం నాయకులు ఎం ఎస్ . బేగ్ ,రాజు సోలంకి, వివికె. నరసింహారావు, వక్కలగడ్డ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో విద్యుత్ ధరలపై ఉద్యమిద్దాం: సిపిఎం



**మైలవరం, ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):** విద్యుత్ ఉద్యమ అమరవీరుల స్ఫూర్తితో ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా, విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా ఉద్యమిద్దామని మైలవరం సిపిఎం నాయకులు ఆర్ రమేష్, సిహెచ్ సుధాకర్, పిలుపునిచ్చారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో విద్యుత్ అమరవీరులైన బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి ఫోటోలకు మంగళవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సంస్కరణలు అమలవుతున్న నేపథ్యంలో పేద ప్రజలపై విద్యుత్ బారాలు అధిక ధరల భారాలు పెరిగిపోయాయని ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని వారన్నారు, ప్రభుత్వాలు పేద ప్రజల అభివృద్ధిని మరిచి పెట్టుబడుదారులకు కొమ్ముగాసే విధంగా విధానాలు తీసుకొస్తున్నారని దీంతో పేద మధ్యతరగతి ప్రజలు దిగువ మధ్య తరగతి ప్రజలపై భారాలు మరణ సంకటంగా మారాయని అన్నారు. ప్రధానమైన ఆహార పదార్థాలపై ధరలు ఏమాత్రం తగ్గక పోగా వినియోగ ధరల సూచికలో సంబంధిత వస్తువులు పై 46శాతం గ్రామీణ ప్రాంతాలలో ఆహార పదార్థాలపై 54శాతం భారంగా మోపుతున్నారని ఫలితంగా నెలసరి ఆదాయంలో మూడు వంతులకు పైగా కుటుంబ ఆహార అవసరాలకే సరిపోతున్నాయని విద్యా ఆరోగ్యం లాంటి అవసరాలకు పేద ప్రజలు అవస్థలు పడాల్సిన పరిస్థితులు వస్తున్నాయని అన్నారు. ఇటువంటి విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం పార్టీ విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో మరిన్ని ఉద్యమాలకు సిద్ధమవుతుందని ప్రజలంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు సందీపాము ఇసాక్, రావుల సుబ్బారావు, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు చెన్నారావు, వెంకటేశ్వరరావు ,తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు





**ఆగిరిపల్లి,ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):** ఆగిరిపల్లి మండలంలో సగ్గూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఈదులగూడెం గ్రామంలో డాక్టర్ సంధ్యా ప్రియ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసి పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ, సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందు జాగ్రత్త లపై అవగాహన తెలియజేశారు. ఈ శిబిరాలలో సూపర్ వైజర్లు, ఆశ వర్కర్లు, మరియు సిబ్బంది పాల్గొన్నారు. సీజనల్ వ్యాధులు, చికెన్ గున్యా జ్వరాల నివారణకై సగ్గూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారిని డాక్టర్ మంజులాదేవిని సంప్రదించగా పరిసరాల పరిశుభ్రత ముఖ్యమని, చికెన్ గున్యా అనేది ఒక వైరల్ ఫీవర్ అని, దానికి స్పెషల్ ట్రీట్మెంట్ అనేది ఏమీ ఉండదని, దీనివల్ల మన శరీరంలో ఉన్న చిన్న చిన్న జాయింట్లు పార్టీలు కూడా ఇన్వాల్వ్ అవుతాయని, అందువల్ల నొప్పులు వాపులు ఎక్కువగా ఉం టాయని, శరీరం మీద చిన్నచిన్న దద్దులు వాటి వల్ల దురదలు వస్తాయని అవి వచ్చినవారు రెస్ట్ ఎక్కువగా తీసుకోవాలని, రోజుకు షుమారు "రాగి జావ, బార్లీ నీళ్లు, సగ్గుబియ్యం జావ, కొబ్బరి నీళ్లు వంటివి ఐదు లీటర్లు తీసుకోవాలని, మంచి ఆహారం తీసుకోవాలని, చికెన్ గునియా వైరల్ ఫీవర్ వచ్చినవారు ఇవి పాటించటం వల్ల తొందరగా రికవరీ అవుతారని తెలిపారు.

# జన సైనికుడు మీద దాడి అమానుషం

## కృష్ణా జిల్లా జనసేన కార్యదర్శి కూనసాని నాగబాబు



**బంటుమిల్లి ,ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):** వైసీపీ మూకలు జనసైనికుడి పై దాడిని తీవ్రంగా ఖండించిన, కృష్ణా జిల్లా జనసేన కార్యదర్శి కూనసాన్ని నాగబాబు. ఆయన బుధవారం నాడు మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో వైసిపి నాయకుల దాడిలో తీవ్రంగా గాయపడ్డ కంచడం గ్రామానికి చెందిన జనసైనికుడు రవిని, జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర జోన్ కో కన్వీనర్ కొరియర్ శీను మరియు 13వ డివిజన్ ఇంచార్జ్ చలమల శెట్టి జయంత్ కుమార్ తో కలిసి నాగబాబు పరామర్శించారు.
వారు రవి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉండగా జన సైనికులనే టార్గెట్ గా చేసి హింసించేవారు. వైసిపి అధికారం కోల్పోయిన తర్వాత కూడా జన సైనికులపై దాడికి తెగబడడంపై వారు తీవ్రంగా ఖండించారు. జన సైనికుడు రవి పై దాడి చేసిన వారిని వెంటనే పోలీసులు శిక్షించాలని, రాజకీయాల్లో దాడులు అనేది సరైన విధానం కాదని అన్నారు.

## రానున్న మార్చి నాటికి తాగునీటి సమస్యకు

# శాశ్వత పరిష్కారం...





**కుదప వద్ద శరవేగంగా జరుగుతున్న కృష్ణా జలాల ప్రాజెక్టు పనులు- ఎ.కొండూరుతో పాటు మరో మూడు మండలాలలో నీటి శాంపిళ్లను పరీక్షిస్తాం- అవసరమైన అన్ని ఆవాసాలకూ సురక్షిత కృష్ణా జలాలను సరఫరా చేస్తాం- వ్యాధి ప్రభావాన్ని తగ్గించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం- వ్యాధి బారిన పడిన వారికి పూర్తి వైద్య సహాయం అందిస్తాం- జిల్లా కలెక్టర్ డా. జి.సృజన వెల్లడి**

**ఎ. కొండూరు, ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):** ఎ.కొండూరు పరిసర ప్రాంతాల గ్రామాలకు సురక్షిత కృష్ణా జలాలను అందించేందుకు రూ.50 కోట్లతో వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని, రానున్న మార్చి నాటికి పూర్తి స్థాయిలో త్రాగునీటిని సరఫరా చేసి కిడ్నీ వ్యాధి నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.సృజన తెలిపారు.

ఎ. కొండూరు పరిసర ప్రాంతాలలో కిడ్నీ వ్యాధిని నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 50 కోట్ల రూపాయలతో రెడ్డిగూడెం మండలం కుదప వద్ద జరుగుతున్న రక్షిత త్రాగు నీటి రిజర్వాయర్ నిర్మాణ పనులను, బుధవారం జిల్లా కలెక్టర్ డా. జి. సృజన సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. రెడ్డిగూడెం మండలం కుదప గ్రామం వద్ద జరుగుతున్న రక్షిత తాగునీటి పథక నిర్మాణం పనులను పరిశీలించడంతోపాటు ఏ కొండూరు మండలంలోని డీప్లానగర్ తండాలో పర్యటించి తండావాసులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం ఏ కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను, మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా. జి. సృజన ఎ. కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ కుదప వద్ద నిర్మాణం జరుగుతున్న ఓవర్ హెడ్ రిజర్వాయర్ పనులను పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన గడువుకు ముందే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఓవర్ హెడ్ రిజర్వాయర్ పనులు తుది దశకు చేరుకోగా 200 కి లో మీటర్ల మేర పైపులైన్ల పనులలో ఇప్పటికే 30 కి.లో మీటర్లు పూర్తి కాగా మరో 70 కి.లో మీటర్ల పనులు చివరి దశలో ఉన్నాయని ఆర్డబ్ల్యుఎస్ ఎస్ ఇ డి.వి. రమణ కలెక్టర్‌కు వివరించారు. సంప్ నుంచి కృష్ణా జలాలను శుద్ధి చేసి ఓవర్ హెడ్ రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తామని అక్కడ నుండి ఎ. కొండూరు మండలంలోని 38 కిడ్ని ప్రభావిత గ్రామాలు, తండాలకు పైపులైన్లు, డిస్ట్రిబ్యూషన్ పైపులైన్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయడం జరుగుతుందని విల్కెనంత త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించిన్నట్లు కలెక్టర్ తెలిపారు. దశాబ్ద కాలం నుండి ఎ.కొండూరు మండలోని గ్రామలతో పాటు సమీప గ్రామలలో ప్రజలు కిడ్నీ వ్యాధితో బాదపడుతున్నట్లు తెలిపారు. దీనికి కారణం ఆయా ప్రాంతాలలో భూగర్భ జలాల్లో లోహ మూలకాల శాతం ఎక్కువగా ఉండటం వలనని, నీటి పరీక్షలలో వెల్లడైనదని అన్నారు. ఈ ప్రాంత ప్రజలు భూగర్భ జలాలను తాగడానికి ఆరోగ్యానికి హనికరమనే ఉద్దేశంతో ప్రభుత్వం సురక్షిత కృష్ణా జలాలను అందించడమే సమస్యకు శాశ్వత పరిష్కారంగా భావించి 50 కోట్ల రూపాయల నిధులతో త్రాగునీటి ప్రాజెక్టును చేపట్టడం జరిగిందన్నారు. ఎ.కొండూరు మండలంలోని 38 ఆవాసాలకు పైపు లైన్ ద్వారా రక్షిత మంచినీటిని అందించాలన్న బృహత్తర కార్యక్రమాని రానున్న మార్చి నాటికి పూర్తి చేసి నీటిని సరఫరా చేయనున్నట్లు ఆమె తెలిపారు. అప్పటి వరకు 38 ఆవాసాల పరిధిలో 56 పాయింట్ల లో ఏర్పాటు చేసిన తాత్కాలిక సింటెక్స్ ట్యాంకుల ఏర్పాటు చేయడం జరిగిందని, ట్యాంకర్ల ద్వారా గ్రామాలకు కృష్ణా జలాలను ట్యాంకులలో నింపి ప్రజలకు అందిస్తున్నామన్నారు. ట్యాంకులలో కృష్ణాజలాలు నింపడంలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి పాయింట్ వద్ద స్థానిక గ్రామస్థులతో కమిటీని ఏర్పాటు చేసి నీటి సరఫరాని పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**పరిసర మండలాల్లోనూ పరీక్షలు చేస్తాం..**

ఎ.కొండూరు మండలంతో పాటు సమీప రెడ్డిగూడెం, గంపలగూడెం, తిరువూరు మండలాలోని గ్రామాల్లో కూడా భూగర్భ జలాల నమూనాలను పరీక్షించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే గంపలగూడెం మండలంలోని రెండు ఆవాసాల్లో నీటిని పరీక్షించగా తాగేందుకు సురక్షితం కాదని తెలిందన్నారు. నాలుగు మండలాల పరిధిలో విస్తృతంగా పరీక్షలు నిర్వహించి, ఫలితాల ఆధారంగా ఏయే గ్రామాలకు సురక్షిత కృష్ణా జలాలను అందించాలో ఆ గ్రామాలన్నింటికీ కుళాయిల ద్వారా నీటిని అందించనున్నట్లు తెలిపారు. వచ్చే మే, జూన్ నాటికి ప్రాజెక్టు పూర్తవుతుందని, ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే సురక్షిత తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.

**కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు సమగ్ర సర్వే:**

కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వారిని పూర్తిస్థాయిలో గుర్తించేందుకు ఎ.కొండూరు, గంపలగూడెం, రెడ్డిగూడెం, తిరువూరు మండలాల్లో సమగ్ర సర్వే నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వ్యాధి ప్రమాదకరంగా మారకుండా అవసరమైన మందులతో పాటు వైద్య సేవల పరంగా అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎ.కొండూరు పీహెచ్‌సీ పరిధిలో దాదాపు 216 మంది క్రానిక్ కిడ్నీ డిసీజ్ (సీకేడీ)తో బాధప డుతున్నారని, వీరిలో 25 మందికి డయాలసిస్ సేవలు అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా అవసరమైన అన్ని వైద్య సేవలను అందించాలని వైద్య అధికారులను ఆదేశించామని కలెక్టర్ సృజన తెలిపారు.

**డీప్లా నగర్ తండా వాసులతో కలెక్టర్ ముఖాముఖి:**

ట్యాంకర్ల త్వారా సరఫరా చేస్తున్న సురక్షిత శుద్ధి చేసిన త్రాగు నీటిని మాత్రమే వినియోగించాలని, అవసరమైతే కాచిచల్లార్చిన నీటిని వినియోగించుకుని ఆనారోగ్య సమస్యలు తలెత్త కుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తండా వాసులకు సూచించారు. పర్యటనలో కలెక్టర్ వెంట తిరువూరు ఆర్‌డీవో కె.మాధవి, డీఎం హెచ్‌వో డా. ఎం.సుహాసిని, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ డీవీ రమణ, ఇన్‌చార్జ్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్, డ్వామా పిడి జె. సునీత డిపివో శ్రీనివాస్ యాదవ్ కృష్ణారావు పాలెం గ్రామ సర్పంచ్ పి. నాగమల్లేశ్వరి, ఇన్‌చార్జ్ యంపిడివో శ్రీ కృష్ణ పరమాత్మ, ఎ. కొండూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి సిపిఎం పార్టీ మండల అధ్యక్షుడు జెట్టి వెంకటేశ్వరావు పాలెం ఆనందరావు బి గోపిరాజు పర్వతనేని చంద్రమోహన్ రావు తదితరులు పాల్గొన్నారు అంతకుముందు వివిధ సమస్యలపై జిల్లా కలెక్టర్ జి సృజనకువినతి పత్రాలను అందజేశారు.

# మాతృ భాషభివృద్ధి కోసం అందరం కృషి చేద్దాం

## తూములూరి ప్రసాద బాబు



**జగ్గయ్యపేట, ఆగస్టు 28: (ఆంధ్రపత్రిక):** ప్రాథమిక విద్య లో అమ్మ భాష ప్రాముఖ్యత .తెలుగు భాష దినోత్సవం ఆగస్టు 29. సందర్భంగా... మనందరం ప్రాథమిక విద్యలో అమ్మ భాష ప్రాముఖ్యత.. అమ్మ భాష లో మాధుర్యం ఆస్వాదిస్తూ మరొక్కసారి నెమరు వేసుకుందాం.ప్రాథమిక దశ లో అమ్మ భాష ని ఆడుతూ, పాడుతూ, మాట్లాడుతూ పిల్లలు నేర్చుకునే విధంగా మనం నేర్పాలి.పిల్లన్ని స్వేచ్ఛగా మాట్లాడనివ్వాలి.పిల్లలచేత మాట్లాడించాలి, పాడించాలి, రంగులు వేయించాలి.వారికి అభినయ గేయాలు మనం అభినయస్తూ నేర్పాలి.ప్రాథమిక దశ లో తెలుగు నేర్పడం వల్ల మాట్లాడే శక్తి, అవగాహన శక్తి, సంభాషణ అర్థం చేసుకునే శక్తి పెరుగుతుంది.తెలుగు నేర్చుకోవడం వల్ల ఇతర భాషలలో కూడా సులభంగా పట్టు సాధిస్తారు.తెలుగు ప్రాథమిక విద్యలో నేర్పడం వల్ల సృజనత్మకత, ఊహ శక్తి పెరుగుతుంది.సరళపదాలు, సరళ మైన వాక్యాలను దారాళం గా, తప్పులలేకుండా చదువుతారు. తెలిసిన, చూసిన వాటి గురించి స్వేచ్ఛగా మాట్లాడతారు.
ప్రాథమిక దశలో నేర్చుకున్న తెలుగు భాషా నైపుణ్యం తో పెద్దవారైనా తరువాత గొప్ప వక్తలు గా... కవులుగా .. గాయకులుగా..మారతారు.తెలుగును తప్పులు లేకుండా, అందంగా రాయగలుగుతారు.బాలసాహిత్యం వలన పిల్లలో భాషా సామర్థ్యం పెరుగుతుంది.నైతిక విలువలు, సంస్కృతీ, సంప్రదాయాలు, దేశభక్తి, సృజనత్మకత కు పెద్ద పీట వేసి చక్కటి ఇంటివృత్తలతో పాఠాలు ప్రాథమిక విద్యలో పొందుపార్చడం వలన వీటిని తప్పనిసరిగా నేర్చుకుంటారు.ప్రాథమిక విద్య, పూర్వ ప్రాథమిక విద్య పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అత్యంత శ్రద్ధ వహించాలి.ప్రాథమిక దశ లో మాతృభాష నేర్చుకోవడం చాలా అవసరం.ప్రతి విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి మాతృభాషఅత్యంత కీలకం.మాతృ భాషభివృద్ధి కోసం అందరం కృషి చేద్దాం.తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపినటి. ప్రసాద బాబుమండల పరిషత్ ప్రాథమిక పాఠశాలతిరుమల గిరి.

# జగ్గయ్యపేట డిపోలో నూతన ఎక్స్ ప్రెస్ సర్వీసులు ప్రారంభం



**జగ్గయ్యపేట, ఆగస్టు 28: (ఆంధ్రపత్రిక):** జగ్గయ్య పేట శాసన సభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) చేతుల మీదగా జగ్గయ్య పేట - విజయవాడ ఎక్స్ప్రెస్ సర్వీస్ లు ప్రారంభం చేయడం జరిగినది. ఈ సందర్భంగా పేట ప్రజా ప్రతినిధులు, ఎంఎల్ఏ శ్రీరామ్ తాతయ్య డిపో అధికారులకు జాగ్గయ్యపేట బస్ స్టేషన్ ఆవర ణంలో ప్రయాణికులకు అవసరమైన మంచి నీరు, మరుగుదొడ్లు, మంచి నీరు బావి తదితరులు పరిశుభ్రంగా వుంచాలని ఆర్ ఓ వాటర్ సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకోవాలని మరియు ట్రాఫిక్ సిబ్బందికి అవసరమైన మధ్యాహ్న భోజన విరామ గది ఏర్పాటు చేయాలని సూచనలు ఇచ్చి ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు.
సదరు కార్యక్ర మంలో పేట ప్రజాప్రతినిధులు, హైర్ బస్ ఓనర్లు డిపో మేనేజర్ రఘురామ్. అసిస్టెంట్ మేనేజర్ రజని ,(ట్రాఫిక్), సేఫ్టీ డ్రైవింగ్ ఇన్స్ట్రక్టర్.చిలకా నాగేశ్వరరావు , డిపో మేనేజర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు మరియు డిపో యూనియన్ నాయకులు,గంటా. భాస్కర్ ఏ. ఆనంద్,కృష్ణారావు, పసుపులేటి. శ్రీనివాస్ సూపర్వైజర్ లు వాణి, పాషా , ఇతర సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# ఆవులు, పందుల సంచారం నిషేధం



**జగ్గయ్యపేట, ఆగస్టు 28: (ఆంధ్రపత్రిక):** జగ్గయ్యపేట పట్టణంలో ప్రధాన రహదారులు మరియు ప్రధాన కూడళ్ళలో పందులు, ఆవుల సంచారాన్ని నిషేధించినట్లు కమిష నర్ మల్లేశ్వరరావు తెలిపారు. ఆవులను తమ ఇంటి ఆవరణలో, పందులను పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంచుకో వాలని మున్సిపల్ కమిషనర్ సిహెచ్. మల్లేశ్వరరావు పేర్కొన్నా రు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి వర్యులు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 10వ తేదీ వరకు వీరికి సమయం కేటాయిస్తున్నామని, ఆలోగా వారి వారి సంరక్షణలో ఉన్న ఆవులను, పందులను నిర్ణీత ప్రదేశాలు ఏర్పాటు చేసుకుని ఆయా ప్రాంతాలలోనే వాటి ని సంరక్షిం చుకోవాలని తెలియజేశారు.
అలాకాకుండా ఆవులు గాని, పందులు గాని సెప్టెంబర్ 10వ తేదీ తరువాత పట్టణ ంలోని ప్రధాన రహదారులు, కూడళ్లలో ఎక్కడ కనిపించినా వాటిని పురపాలక సిబ్బంది స్వాధీనం చేసుకొని పట్టణానికి దూరంగా అడవులలో వదిలేస్తామని హెచ్చరించారు.

# ఘనంగా మండల టిడిపి అధ్యక్షుడు గడ్డి జన్మదిన వేడుకలు





**కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కొలికపూడి - కృష్ణారెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కొలికపూడి - గడ్డికి జన్మ దిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కొలికపూడి**

**ఎ.కొండూరు, ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):** ఎ.కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన మండల టిడిపి అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి 57వ జన్మదిన వేడుకలను బుధవారం అతని స్వగృహంలో కుటుంబ సభ్యులు,ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకుల సమక్షంలో ఘనంగా జరిపారు. ఈ వేడుకల్లో తిరు వూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పాల్గొని కృష్ణారెడ్డి దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించి పుట్టిన రోజు కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొలికపూడి మాట్లాడుతూ ఒక్క ఎ.కొండూరు మండల ంలోనే కాక తిరువూరు నియోజకవర్గంలో ప్రతి ఇంటికి కృష్ణాజలాల అందించే విధంగా డిపిఆర్వో ద్వారా ప్రాజెక్టు ప్రణాళిక ఏర్పాటు చేయటం జరుగుతుందని తెలిపారు.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని, ఎన్ని ఇబ్బందులనైనా అయినా పార్టీని పార్టీ నాయకులను సమన్వయం చేసుకుంటూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం మండలంలో టిడిపి పార్టీ యంత్రాంగాన్ని ఏకతాటిపై నడిపించి తిరువూరు నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగరవేయడంలో అత్యంత కీలక పాత్ర పోషించారని కొనియాడారు. గతంలో పార్టీ కోసం ఎలా అయితే కష్టపడ్డారో ఇప్పుడు కూడా కృష్ణారెడ్డి పార్టీ కోసం అలాగే కష్టపడాలని మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని, ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని దీవించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులందరినీ ఆప్యాయత అనురాగంతో పలకరించి కృష్ణారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డి రామ తులసమ్మ, కృష్ణారెడ్డి దంపతులు గడ్డి రోజా రాణి, కుమారుడు అజయ్ కుమార్ రెడ్డి, స్నేహ, అనుషా రెడ్డి, ఎస్.ఐ. చల్లా కృష్ణ, మాజీ ఎంపీపీ వాసం మునియ్య, మండల ప్రధాన కార్యదర్శి వనపర్ల డేవిడ్ రాజు, పాస్టర్ విజయరావు, మొక్కలకత్తి ఆనందరావు, ఏలియా బాబు, ఆళ్ల అమ్మిరెడ్డి, ఒంటేరు రామారావు, అలవాల సత్యనారాయణ రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొని కృష్ణారెడ్డి దంపతులకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## పెదకూరపాడు నియోజకవర్గంలో లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



**పెదకూరపాడు, ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):** రాజధాని అభివృద్ధిలో భాగంగా పల్నాడు జిల్లాలో లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేయడం శుభపరిణామం పెదకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ అన్నారు. పెదకూరపాడు నియోజకవర్గ అభివృద్ధికి లాజిస్టిక్ పార్క్ ఏర్పాటు అదృష్టంగా భావిస్తున్నాం. ఔటర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న పెదకూరపాడు, అమరావతి మండలాల్లో లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుతో నియోజకవర్గానికి మౌలిక వసతులు సమకూరుతాయి. లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుతో ఇతర రంగాల పరిశ్రమల స్థాపనకు అవకాశం ఉంటుంది.నూతన పరిశ్రమల స్థాపనతో నియోజకవర్గ యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయి అని అన్నారు.ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం పారిశ్రామికంగా తీర్చి దిద్దేలా కృషి చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేసేలా లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు అధికారులు వేగంగా పని చేయాలని కోరుతున్నాం.నియోజకవర్గంలో లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలుపుతున్నాం అన్నారు.

## తిరువూరు పట్టణ ముస్లిం ప్రజలకు శుభవార్త చెప్పిన ఎమ్మెల్యే కొలికపూడి



**తిరువూరు ఆగస్టు 28(ఆంధ్రపత్రిక):** తిరువూరు పట్టణ ప్రజలకు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు బుధవారం శుభవార్తను తెలిపా రు. తిరువూరు పట్టణంలో నిరుపేద ముస్లిం కుటుంబానికి చెంది న పెళ్లి కూడా చేయలేని స్థితిలో వున్ననిరుపేద చెల్లెమ్మల వివాహానికి ఎటువంటి ఫంక్షన్ హాల్ ఫీజు లేకుండా షాది ఖానా ఫంక్షన్ హాల్ ఉచితంగా మరియు ఈ వివాహ శుభకార్యానికి హాజరైన 200 మందికి భోజన సదుపాయం కూడా తన సొంత ఖర్చులతో చేస్తానని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలియజేశారు. దీంతో తిరువూరు పట్టణ ముస్లిం సోదరీమణులు హర్షం వ్యక్తం చేశారు.

## ఆధునిక చైతన్య శంఖారావం ప్రజా కవి దర్శి శేషారావు



**పెదకూరపాడు, ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):**నిరంతరం ప్రజా సమస్య లపై సామాజిక అంశాల పై ప్రజలను చైతన్య పరుస్తూ తన కలము నుండి పలు కవితలు జాలువారితాయి. అతనే పెదకూరపాడు గ్రామానికి చెందిన ఆధునిక కవి దర్శి శేషారా వు. ఉపాధ్యాయుడిగా 20 సంవత్సరాలు పైగా పని చేశారు. జర్న లిస్ట్ గా సుదీర్ఘ కాలం నుండి పనిచేస్తున్నారు. తెలుగు భాషాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ మాతృభాష ద్వా రా సమస్యలను కవిత రూపంలో అంది స్తున్నారు. కౌలు రైతుల కష్టాలు పై, అసంఘటిత కార్మి కుల హక్కుల కోసం, మహిళల కోసం, ప్రభుత్వ రంగమే అత్యంత ప్రాధాన్యత కలిగి ఉండాలని నిరంతరం రచనలు చేస్తూ ఉంటారు. ఇప్పటికే పెద్దకూ రపాడు ప్రాంతాలలో ప్రజాకవిగా గుర్తింపు పొందారు. కవి సమ్మేళ నాలలో పాల్గొంటూ భాషాభివృద్ధికి ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే పలు సమ్మేళనాల్లో పాల్గొని అవార్డులు, సన్మానాలు పొందారు. ప్రస్తుత దర్శి శేషారావు ఆదర్శప్రాయుడు.

# పంచలోహ విగ్రహాము చోరీ





**ఆగిరిపల్లి ,ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):**ఆగిరిపల్లి స్థానిక శ్రీ వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి వారి దివ్య క్షేత్రంలో కొండపైన స్వయంభు అయిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి సన్నిధిలో ఈనెల 27న షుమారు రెండు గంటల నుండి 5 గంటల మధ్య పంచలోహ విగ్రహం అపహరణకు గురైంది.

ఈ విషయమై ఆలయ కా ర్య నిర్వహణ అధికారి డి సురేష్ బాబును సంప్రదించగా వివర ములు తెలుపుతూ ఆలయ పూజారులు స్వయంభువునకు ఉద యము సాయంత్రం నైవేద్యం సమర్పించి వస్తారని ఈనెల 27న షుమారు ఉదయం 9 గంటలకు నైవేద్యం సమర్పించి తలుపులకు తాళాలు వేసి కిందకు వచ్చి మరల సాయంత్రం ఐదు గంటలకు నైవేద్యం సమర్పించుటకు వెళ్ళగా గేటు తాళాలు పగలగొట్టి 6 అంగుళాల అరకేజీ బరువు ఉండే స్వామివారి పంచలోహ విగ్రహం, ఒక గంట అపహరణకు గురైందని , సిసి టీవీ, కరెం టు వైర్లు రెండు కట్ చేసి సీసీ కెమెరాలు కొన్ని పారేసి కొన్ని తీ సు కెళ్లారని, ఆరోజు సాయంత్రం మే పోలీస్ వారికి రిపోర్ట్ ఇచ్చా మని, వారు వచ్చి దర్యాప్తు చేపట్టారని, ఈరోజు క్లూస్ టీమ్ వారు వచ్చి వేలిముద్రలు సేకరించారని, ఈ క్షేత్రముకు రెండు కిలోమీ టర్ల పరిధిలో సెల్ టవర్ సిగ్నల్ ద్వారా నిందితుల కదలికలను తెలుసుకోవడానికి జిల్లా ఎస్ పి ఆధ్వర్యంలో ఆగిరిపల్లి ఎస్ ఐ ఒక టీం ఏర్పాటు చేశారని, వారిని కచ్చితంగా గుర్తిస్తామని, స్వామివారి విగ్రహమును రికవరీ చేస్తామని, చోరీకి గురి అయిన విగ్రహము స్థానంలో ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం శేష బాబు ద్వారా ఒక దాత కొత్త పంచలోహ విగ్రహమును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, ఈరోజు సాయంత్రం ఆలయ సంప్రోక్షణ, హెూమము పూర్తి అయినదని దర్శనమునకు యధావిధిగా అనుమతిస్తున్నామని, విలువైన వస్తువులు ఏమీ పోలేదని, భక్తులు ఆందోళన పడవద్దని, గతంలో 8 సీసీ కెమెరాల స్థానంలో ఇప్పుడు ఎక్కువ స్టోరేజీ, ఐ హెచ్ డి పవర్ గల16 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, పోలీసు వారిని కూడా గస్తీ ఏర్పాటు చేయమని కోంమని అందువల్ల భక్తులకు దర్శనమునకు ఎటువంటి ఇబ్బంది ఉండదని తెలిపారు.

## మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సుభాష్ చంద్రబోస్



**వినుకొండ,ఆగస్టు 28 (ఆంధ్ర పత్రిక):** పురపాలక సంఘ కమిషనర్ గా సుభాష్ చంద్ర బోస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధా రణ బదిలీ ల్లో భాగంగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న టీ.కృష్ణవేణి నిడదవోలు బదిలీ కాగా... ఆమే స్థానంలో విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ లో శానిటరీ ఇన్స్పె క్టర్ గా విధులు నిర్వహిస్తున్న సుభాష్ చంద్రబోస్ ను విను కొండ మున్సిపల్ కమిషనర్ గా బదిలీ అయ్యారు... ఈ నేపథ్యంలో ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు... బాధ్యతలు చేపట్టిన కమిషనర్ ను కార్యాలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు.

## పెనుగంచిప్రోలు ఎస్ ఐ. గా అర్జున్



**పెనుగంచిప్రోలు,ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):**పెనుగంచిప్రోలు ఎస్ఐగా ఎంఎస్కె.అర్జున్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు, ముందు గా శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకొని అనంతరం పదవి బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ఎంతటి వారినైన క్షమించేదిలేదని హెచ్చరించారు .

## బంటుమిల్లిలో విద్యుత్ అమరవీరుల సంస్కరణ సభ



**బంటుమిల్లి ,ఆగస్టు28(ఆంధ్రపత్రిక):** బంటుమిల్లి అంబేద్కర్ సెంటర్లో విద్యుత్ అమరవీరుల సంస్కరణ సభ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సభకి అధ్యక్షులుగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మాజేటి శివ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 2000 సంవత్సరం ఆగస్టు 28వ తారీకు బషీర్బాగ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైదరాబాదులో విద్యుత్ సంస్కరణ వ్యతిరేకంగా జరిగిన ప్రదర్శనలో ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం విచక్షణ రహితంగా కాల్పులు జరిపి ముగ్గురు మరణానికి కారణమైన అయ్యింది ఆనాడు ప్రాణాలు ఇచ్చిన రామకృష్ణ విష్ణువర్ధన్ రావు బాలస్వామి లకు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నివాళి అర్పించడం జరిగింది

ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు లంకదాసుల అజయ్ గోష్ గౌరిశెట్టి నాగేశ్వరరావు బొడ్డు నాగరాజు నాగిశెట్టి కృష్ణ నాగిశెట్టి చంద్రశేఖర్ వంగల రాజు తదితరులు పాల్గొన్నారు

# ఎయిడ్స్‌ని అవగాహన ద్వారానే నిర్మూలించవచ్చు: ఎస్ఐ ప్రవీణ




**అద్దంకి,ఆగస్టు28(ఆంధ్రపత్రిక):** బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ మండలి హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు జరిగినది ఈ కార్యక్రమానికి హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సాగర్ అధ్యక్షత వహిం చారు ముఖ్యఅతిథిగా వచ్చిన ఎస్ఐ సిహెచ్ ప్రవీణ మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ ని అవగాహన ద్వారానే నిర్మూలించవచ్చు అన్నారు. హెచ్ఐవి సంక్రమించే ప్రమాదం రిస్క్ హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకు సేవలను అందిస్తున్న ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థలు గురించి విద్యార్థులకు తెలిపారు హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి సమూలన నిర్మూలన లక్ష్యంతో రూపొందించిన "మీకు తెలుసా? అవగాహన హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ ప్రజలకు సోకుండా నిర్మూలన నియంత్రణకు అందరు కృషి చేయాలని హెచ్ఐవి బాధితులకు అందిస్తున్న వైద్య సేవలు గురించి పూర్తి వివరాలు మీకు తెలియజేయాలని మంచి ఉద్దేశంతో ఈ సమా వేశం విద్యార్థులకు ఏర్పాటు చేయడం మంచి పరిణామంము అని హెచ్ఐవి ఎయిడ్స్ నిర్మూలన కొరకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఎనిమిది వారాల అవగాహన కార్యక్రమాల్లో భాగంగా మూడో వారం కార్యక్రమంలో భాగంగా హెచ్ఐవి సంక్రమించే ప్రమాదం రిస్క్ బాధితులకు ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న వైద్య సేవలు గురించి అవగాహన కలిగించాలని లక్ష్యంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం మంచిది అన్నారు.

కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ రాజే శ్వరి మాట్లాడుతూ ఈ అంశంపై మేము చెప్పే తగు సూచనలు సలహాలను మీరు మీ నివాస ప్రాంతంలోని ప్రతి ఇంటికి ఈ సమాచారం చేరవేయడం వల్ల హెచ్ఐవి ఎయిడ్స్‌ను నియంత్రణ నిర్మూలించటం సాధ్యమ వుతుందని మేము ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగినది.

ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ కే డేవిడ్ రాజు స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి వి సాగర్ ఓ ఆర్ డబ్ల్యులు కరుణ శ్రావణి పి ఈ మల్లేశ్వరి పార్వతి ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు .

## వెల్లలచెరువులో చేపల చెరువు వేలం పాట



**సంతమాగులూరు,ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):** మండలంలోని వెల్లల చెరువు గ్రామంలో ఊర చెరువు చేపల వేలంపాట బుధవారం జరిగింది. పంచాయతీ అధికారుల సమక్షంలో గ్రామ సచివాల యంలో నిర్వహించిన వేలంపాటలో గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ వేలం పాటలో అదుసుమల్లి మహేందర్ అనే రైతు 36,50,000 రూపాయలకు పాట పాడి స్వాధీనం చేసుకున్నాడు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారులతో పాటు గ్రామ టిడిపి నాయకులు ఆలూరు శీను, ఈవోపిఆర్డి రాంప్రసాద్, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

## పోలవరం ప్రాజెక్టు నిర్మాణంకు పూర్తి సహకారం అందిస్తున్న ప్రధాని, కేంద్ర మంత్రులకు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు కృతజ్ఞతలు



**పెదకూరపాడు ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):** జాతీయ ప్రాజెక్టు, ఆంధ్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో చెల్లించాల్సిన బకాయిలతో పాటుగా, అవసరమైన నిధులను సమకూర్చి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు.. కేంద్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసిన నేపథ్యంలో టిడిపి పార్లమెంటరీ పార్టీ నేత, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎంతో ముఖ్యమైన పోలవరం ప్రాజెక్టుకు మేలు చేస్తున్న నేపథ్యంలో.. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్, కేంద్ర జల శక్తి మంత్రి సి ఆర్ పాటిల్ కు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు కృతజ్ఞ తలు తెలిపారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేయాల్సిన ఆవశ్యకతపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనేకమార్లు కేంద్ర ప్రభుత్వ పెద్దలను విన్నవించడం జరిగిందని, కూటమి ఎంపీలు పార్లమెంట్లో ఈ ప్రాజెక్టు పూర్తి గురించి లేవనెత్తడం జరిగిందని ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేసి రాష్ట్రానికి జలసిరులు కురిపించడమే కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని అన్నారు.

# గంజాయి నివారణ పై ప్రత్యేక దృష్టి

**గంజాయికి బానిసలు అవుతున్న పెదకూరపాడు యూత్ - గంజాయి మత్తులో బాటసారిలకు ఇబ్బంది కలిగిస్తుంది యువత - గంజాయి వాడే వారికోసం ప్రత్యేకం నిగా పెట్టి పట్టుకొని కౌన్సిలింగ్ ఇస్తాం-ఎస్సై బాలు నాయక్**



**పెదకూరపాడు, ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):**పెదకూరపాడు పరిసర ప్రాంతాల్లో గంజాయి నివారణపై ప్రత్యేక దృష్టి సారించామని, అసాంఘిక కార్యక్రమాలు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని అన్నారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలు జరిగే ప్రాంతాలు, శాంతిభద్రతలు, సంఘ వ్యతిరేక కార్యకలాపాల జరిగే ప్రదేశాలు గుర్తించి రౌడీ షీటర్ల కదలికలు, కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని, పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రిళ్ళు గస్తీని ముమ్మరం చేస్తామని ఎస్సై బాలు నాయక్ తెలిపారు అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మట్కా, గంజాయి, పేకాట తదితర సాంఘిక కార్యక్రమాలు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. పెదకూరపాడు లో సిసి కెమెరాల ఏర్పాటు కు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే దొంగతనాలు జరగకుండా గస్తీ ముమ్మరం చేశామని చెప్పారు. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. క్రికెట్ బెట్టింగ్, పేకాట, మట్కా నిర్వహించే వ్యక్తులపై గట్టి నిఘా ఉంచి ప్రతినెల వారికి కౌన్సెలింగ్ కూడా ఇస్తామన్నారు. ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, ఏదైనా సమస్య వస్తే నిర్భయంగా తమకు సమాచారం అందించాలని సూచించారు.

## జాతీయ రహదారిలో స్పెషల్ డ్రైవ్



**వేటపాలెం, ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):** మండల కేంద్రంలోని ఎన్ హెచ్ 216 జంక్షన్ లో బుధవారం ఎస్ఐ ఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లా డుతూ వారంలో ఒక రోజు స్పెషల్ డ్రైవ్ లో భాగంగా వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహనాలను ఆపి డ్రైవింగ్ లైసెన్సులు, ఫిట్ నెస్ సర్టిఫికెట్లు, వాహనాలకు సంబంధిత ధ్రువపత్రాలు పరిశీలించడం జరిగింది అన్నారు. ఈ విధమైన ప్రత్యేక డ్రైవ్ లు జాతీయ రహదారిపై నిర్వహించడం వల్ల అక్రమ రవాణాలను అరికట్టవచ్చునని తెలిపారు. టూ వీలర్స్ నడిపేవారు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. ఎవరైనా వాహనదారులు మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానికి భారీగా జరిమానా విధిస్తారని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లు సంఖ్యకు మించి వ్యక్తులను అధికంగా ఎక్కించరాదన్నారు. రవాణా వాహనాల్లో అధిక బరువు వేయరాదని తెలిపారు. సుమారు 40 కి పైగా వాహనాలను తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఈ డ్రైవ్ లో ఏఎస్ఐ శామ్యూల్, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ నగరేశ్వర స్వామి ఆలయ ధ్వజ స్థంభానికి ఇత్తడి తొడుగు



**వేటపాలెం, ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):** వేటపాలెం గ్రామంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వేంచేసి ఉన్న శ్రీ నగరేశ్వర స్వామి ఆలయ ధ్వజస్తంభానికి బుధవారం ఇత్తడి తొడుగును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు రావూరి కృష్ణ బాబు ఆగమ శాస్త్ర ప్రకారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఇత్తడి తొడుగులకు ఆర్థిక సహాయం అందించిన పూర్ణ చైతన్య ధర్మపత్ని జ్యోతిక వెంకట మనస్విని చేతుల మీదగా సంప్రోక్షణ, పాలాభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వాసవి మహిళా సంఘం సభ్యులు 9 పర్యాయాల మణిదీప వర్ణన, శివ స్తోత్రములు, లలిత సహస్రనామాల పారాయణం జరిపించారు. కార్యక్రమంలో వైశ్య సంఘం అధ్యక్షులు పత్తి ముత్తుకమరన్, కార్యదర్శి శ్రీరామ్ గోవర్ధన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపయోగంగా ఉన్న చేప పిల్లల పెంపకం కేంద్రం

**గత మూడు సంవత్సరాల నుండి నిరుపయోగం ఉన్న చేప పిల్లల కేంద్రం -ఈ కేంద్రం 50 సంవత్సరాల చరిత్ర కలిగినది -శిథిల వ్యవస్థ చేరిన బావి ఆందోళనలో పశువుల పెంపకం దారులు - పట్టించుకోని మత్స్య శాఖ అధికారులు**





**అద్దంకి ఆగస్టు 28(ఆంధ్రపత్రిక):** మండలంలోని చక్రాయపాలెం గ్రామం నందు చేప పిల్లల పెం పకం కేంద్రం నిరుపయోగంగా ఉన్నది ఈ కేంద్రం మత్స్య శాఖ ద్వారా ఏర్పాటు చేయబడి వారే నడపబడుతున్న ఈ కేంద్రం యొక్క ఉద్దేశం చేప పి ల్లలను పునరుత్పత్తి చేసి పెంచి భవనాసి చెరువులో గుండ్లకమ్మ నదిలోని ఈ చేప పిల్లలను వదులుతారు తద్వారా భవనాసి గుండ్లకమ్మ నదిలో ఆ చేప పిల్లలు కొన్ని రోజులకు చేపల గా పెద్ద అవుతాయి జాలర్లు వారి సొసైటీల ద్వారా ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెల నుండి చేపలు పట్టుకొని సుమారు రెండు వేల మంది కుటుంబాలు వీటి మీద ఆధారపడి జీవిస్తున్నారు గత మూడు సంవత్సరాల నుండి చేప పిల్లలు లేని కారణం చేత భవనాసి గుల్లకమ్మలో చేపల లేక మత్స్యకారులు వలసల పోవాల్సిన పరిస్థితి వచ్చింది ఈ కేంద్రం వద్ద నేల బావి చుట్టూ రాయి కట్టడం శిథిలం అవడంతో పశువులు ఎప్పుడు పడతాయని గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ఈ కేంద్రానికి బావనాసి అలుగు నుంచి వచ్చే నీరు మోటర్లు చెడిపోవడంతో నీరు కూడా రావడం లేదు చేప పిల్లలు సమృద్ధిగా ఆరోగ్యంగా పెరగాలంటే అలుగు నీరు కాకుండా భవనాసినీరు లేదా గుండ్లకమ్మ నీరు తీసుకు రాగలిగితే చేప పిల్లలను సమృద్ధిగా పెంచవచ్చని మత్స్య శాఖ అధికారులు తెలుపుతున్నారు 2016- 17 సంవత్సరములో అప్పటి ప్రభుత్వం కోటి రూపాయల పైకి వెచ్చించి కొన్ని నిర్మాణాలు చేపట్టడం జరిగినది కావున ఇప్పటికైనా ఈ చేప పిల్లల కేంద్రాన్ని ఉపయోగం లోకి తెచ్చి మా జీవనోపాధికి తోడ్పాటు అందించాలని మత్స్యకారులు ప్రజలు కోరుకుంటున్నారు.

# వలసలు నివారిస్తు ఉపాధి కల్పించాలి

**బాపట్ల ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక) :** వలసలు నివారిస్తూ ఉపాధి హామీ పథకం ద్వారా నిరుపేదలకు అధికారులు ఉపాధి కల్పించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. ఉపాధి హామీ పథకం అమలు తీరుపై ఎంపీడీవోలు, డ్వామా అధికారులతో బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని విసి హాల్ లో ఆయన సమీక్ష నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో దొంగ మస్టర్లకు అవకాశం లేకుండా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. దొంగ మస్టర్లతో తప్పులు చేయడం, ఇష్టానుసారంగా పనిచేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఇలాంటి పరిస్థితులు మండలాలలో ఏర్పడకుండా ప్రక్షాళన చేపట్టాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధన దిశగా అధికారులు పనిచేయాలన్నారు. నిరుపేదలైన ఎస్టీలు, ఎస్సీలు ఉపాధి లేక ఇతర ప్రాంతాలకు వలసలు వెళుతుంటే అధికారులు నిర్లిప్తంగా వ్యవహరించడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. ప్రస్తుతం 33 రోజులు పని దినాలు కల్పిస్తుండగా, కనీసం వందరోజులు పని దినాలు కల్పించడమే అధికారులకు లక్ష్యం కావాలన్నారు. గ్రామాలలో ఉపాధి హామీ పథకం పనులు గుర్తింపు ప్రక్రియ శరవేగంగా




చేపట్టాలన్నారు. గ్రామ సభలు నిర్వహించి అర్హులైన నిరుపేదలను గుర్తించాలన్నారు. జిల్లాలో 84 వేల మందికి జాబ్ కార్డులు ఇవ్వడానికి అవసరత ఉందన్నారు. జాబ్ కార్డులు ఇచ్చే ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా 15 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. తీర ప్రాంతాలలో బీచ్ ల వద్ద విస్తృతంగా పండ్ల మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ వెంకట మురళి చెప్పారు. జిల్లాలో 4,440 ఎకరాలలో ఉద్యాన పంటలు వేయాలని లక్ష్యంగా ఉందన్నారు. రహదారి వెంట 50 కిలోమీటర్ల మేర మొక్కలు నాటాలని, పంట కాల్వల వెంట 60 కిలోమీటర్ల మేర మొక్కలు నాటాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం 13.5 కిలోమీటర్ల వరకు మాత్రమే మొక్కలు నాటడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలలో కనీసం 25 ఎకరాలలో మొక్కలు నాటాలని లక్ష్యం కాగా ఒక్క మొక్క నాటకపోవడంపై ఆరా తీశారు. 775 మినీ గోకులాల షెడ్లు నిర్మించాలని లక్ష్యం సాధించకపోవడంపై అధికారులను ఆయన ప్రశ్నించారు. 5,700 ఇంకుడు గుంతలు తీయాలని లక్ష్యాలు నిర్దేశించగా పురోగతి సాధించాలని తెలిపారు.

ఈ పనులన్నిటిని ఉపాధి హామీ పథకం కింద నిర్వహించడానికి అధికారులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో బాపట్ల జిల్లాలో 54 లక్షల పని దినాలు కల్పించాలని లక్ష్యాలు నిర్దేశించినట్లు తెలిపారు. ఇందుకుగాను రూ.222.81 కోట్ల నిధులు వెచ్చించాలని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రస్తుతం జిల్లాలో 4.68 లక్షల మందికి జాబ్ కార్డులు ఉన్నాయని, మరో 84 వేల మందికి జాబ్ కార్డులు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ఎస్టీలు ఉన్న ప్రాంతాలలో ఉపాధి పనులు గుర్తించి తక్షణం ప్రారంభించాలని ఆయన ఆదేశించారు. ఉపాధి హామీ పనుల పురోగతి సాధనకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని మార్గ నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ రాజేష్, నిర్మాణ శాఖ పిడి ప్రసాద్, డి ఆర్ డి ఎ పీడీ వై పిచ్చిరెడ్డి, ఎంపీడీవోలు, ఏపీఓలు, తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞాన్స్ యూనివర్సిటీ అధ్యాపకురాలికి పీహెచ్‌డీ



**గుంటూరు ,ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక) :** చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ బయోటెక్, ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ అన్నం నాగలక్ష్మికు తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టాను అందజేసిందని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ "స్క్రీనింగ్ అండ్ ఎవాల్యూయేషన్ ఆఫ్ బయోయాక్టివ్ మెటబోలైట్స్ ఫ్రమ్ కుర్కుమ లోంగ అండ్ టినోస్పోర కార్డిఫోలియో అగెనెస్ట్ పల్మనరీ ఫిబ్రోసిస్ ఇన్ మైస్" అనే అంశంపై ఆమె పరిశోధన చేశారని తెలియజేశారు. ఈమెకు విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని బయోటెక్నాలజీ డిపార్ట్‌మెంట్ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్.కృపానిధి గైడ్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. డాక్టరేట్ పట్టా పొందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ అన్నం నాగలక్ష్మిను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

# ఆర్. వి. ఆర్. అండ్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ కు డాక్టరేట్



**గుంటూరు ,ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక) :** స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్న శ్రీమతి టి.సునీత కు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు డాక్టరేట్ ప్రదానం చేసింది. అధ్యాపక వృత్తిలో 16 సంవత్సరాలు అనుభవం గడించిన సునీత డిజైన్ అండ్ ఇంప్లి మెంటేషన్ ఆఫ్ మల్టీ బాండ్ మైక్రో స్ట్రిప్ పాచ్ యాంటెనాస్ యూజింగ్ గ్రౌండ్ మోడిఫికేషన్ టెక్నిక్స్ ఫర్ వైర్ లెస్ అప్లికేషన్స్ " అనే అంశంపై ఆచార్య నాగార్జున విద్యాలయానికి చెందిన డా. ఎస్.నాగ ˆకిషోర్, భవనం పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు పి.హెచ్.డి. పొందారు..ఈ సందర్భంగా కళాశాల లో పి.హెచ్.డి కలిగిన స్టాఫ్ మొత్తము 147 మంది వున్నారని, పరిశోధనలను కళాశాల ప్రోత్సహి స్తుందని కళాశాల అధ్యక్షులు డా.రాయపాటి శ్రీనివాస్ తెలిపారు. టి.సునీత పి.హెచ్.డి., పొందిన సందర్భంగా కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డా.కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్, అకడమిక్స్ అండ్ ఆర్%డ%డి డా.కొమ్మినేని రవీంద్ర, డైరెక్టర్, ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డా యన్.వి.శ్రీనివాసరావు, విభాగాధిపతి డా.టి.రంగబాబు తదితరులు ఆమెను అభినందించారు.

# ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థుల్లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి



**బాపట్ల ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక) :** ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులలో ఉత్తమ ఫలితాలు సాధనకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖల పనితీరుపై సంబంధిత అధికారులతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహిం చారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభా నైపుణ్యాలకు అధికారులు మెరుగులు దిద్దాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో వసతి పొందుతూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల సంక్షేమంపై దృష్టి సారించాలన్నారు. మెనూ పక్కాగా అమలు కావాలని, నాణ్యమైన భోజనం పెట్టాలని ఆదేశించారు. పొర పాట్లు చేసినా, మెనూ సక్రమంగా అమలు చేయకపోయినా వారిపై క్రమశిక్షణ చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరిం చారు. అధికారులు గ్రామాలలో పర్యటించి నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీలను గుర్తించి వసతి గృహాలలో చేర్చాలన్నారు. ప్రభుత్వ వసతి గృహాలలో విద్యార్థులు ఆసక్తిగా చేరేలా మంచి వాతా వరణం కల్పించాలన్నారు. వసతి గృహ సంక్షేమ అధికారులు తాను విధులు నిర్వహించే ప్రాంతాలలోనే నివాసం ఉండాలని ఆయన స్పష్టం చేశారు. క్రమం తప్పకుండా సహాయ సంక్షేమ అధికారులు వసతి గృహాలను తనిఖీలు చేయాలన్నారు. విద్యార్థులను బాగా చదివించాలని కలెక్టర్ తెలిపారు. వారంలో ఒక వసతి గృహాన్ని తనిఖీ చేస్తాను. మెనూ అమలులో ఏదైనా తేడాలు ఉంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సీ సంక్షేమ శాఖ వసతిగృహాలు జిల్లాలో 27 ఉండగా 1,581 మంది విద్యార్థులు మాత్రమే వసతి పొందుతున్నారని చెప్పారు. 1,319 సీట్లు ఖాళీగా ఉండడం ఏమిటని అధికారులను నిలదీశారు. అలాగే బిసి సంక్షేమ వసతి గృహాలు జిల్లాలో 42 నడుస్తుండగా కేవలం 1,176 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారన్నారు. ఇక్కడ 3,284 సీట్లు ఖాళీగా ఉండడం ఏమిటని అసహనం వ్యక్తం చేశారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 9 వసతి గృహాలు, ఒక గిరిజన ఆశ్రమ పాఠశాల ఉండగా 412 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. బధిరుల పాఠశాలలో 100 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని వివరించారు. ప్రతి నెలలో వసతి గృహాలలోని విద్యార్థులకు విధిగా వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. విద్యార్థుల బయోమెట్రిక్ విధానాన్ని అధికారులు తప్పనిసరిగా పర్యవేక్షించాలని ఆదేశించారు. వసతి గృహాలలో విద్యార్థుల సంఖ్య పెరగడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వసతి గృహాలలో తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు.

అధికారులు నిర్లక్ష్యాన్ని విడిచిపెట్టి చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. వసతి గృహాలలో విద్యార్థులకు ప్రతిరోజు పరీక్షలు నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారిని జె రాజాదిబోర, బిసి సంక్షేమ శాఖ అధికారిని శివలీల, గిరిజన సంక్షేమశాఖ అధికారి దూర్జటి, విభిన్న ప్రతిభావంతులశాఖ అధికారి అర్చన, తదితరులు పాల్గొన్నారు.

## బల్లికురవ లైబ్రరీని తనిఖీ చేసిన కార్యదర్శి ఆదిలక్ష్మి



**బల్లికురవ, ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక) :**బల్లికురవ మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి అకాస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని రికార్డులు ఆమె పరిశీలించారు అలాగే గ్రంథాలయం నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం లైబ్రేరియన్ కు ఆమె పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ సుగుణ రావు, తదితరులు పాల్గొన్నారు. ఇంకా సంతమాగులూరు లోని బుక్ డిపాజిట్ సెంటర్ లను లైబ్రరీలు అన్ని తనిఖీ చేయడం జరిగింది.

## రోడ్డు ప్రమాదంలో కొణిదెన గామానికి చెందిన వ్యక్తి మృతి



**బల్లికురవ, ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక) :**బల్లికురవ మండలం కొనిదేన గ్రామానికి చెందిన మ రియదాస్ మంగళవారం రాత్రి ఒంగోలు వెళ్లి వస్తుండగా జై పం గులూరు రేణింగవరం హైవే రోడ్డు వద్ద ప్రమాదం జరిగింది. మరియ దాస్ కు తీవ్ర గాయాలు కాగా.. వెంటనే స్థానికులు గుర్తించి అతని ఒంగోలు రిమ్స్ హాస్పటల్ కు తరలించి కుటుంబ సభ్యులకు తెలియ పరిచారు. అయితే హాస్పటల్లో చికిత్స పొందుతూ బుధవారం తెల్ల వారుజామున మృతి చెందినట్లుగా వారి కుటుంబ సభ్యులు తెలిపారు.

## భారతీయ జనతా పార్టీరాష్ట్ర అధ్యక్షురాలు శ్రీమతి దగ్గుపాటి పురందేశ్వరి



**బొల్లాపల్లి , ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక) :** యొక్క ఆదేశానుసారం సభ్యత్వ నమోదు కార్యశాల కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఉదయం 10 గంటలకు బొల్లాపల్లి మండల పార్టీ అధ్యక్షుడు కాసా లక్ష్మయ్య నేతృత్వంలో జరిగింది భారతీయ జనతా పార్టీ సమావేశం వినుకొండ పట్టణంలోని వెల్లటూరు రోడ్లో గల ఎంపీసీ కళ్యాణమండపం లో జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పల్నాడు జిల్లా బిజెపి జనరల్సెక్రటరీ మేడం రమేష్ గెస్ట్ గా ఈ కార్యక్రమానికి కిసాన్ మోర్చా రాష్ట్ర వర్గ సభ్యుడు యాదాల అనిల్ హాజరయ్యారు ఈ సమావేశంలో సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి జరుగును బిజెపి సభ్యత్వ కార్యక్రమాల్లో అందరూ చురుగ్గా పాల్గొని ఎ మండలం మొత్తం మీద 10,000 నుంచి 15 వేల వరకు సభ్యత్వాలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు ముఖ్యంగాతండాల్లో ఎక్కువమంది చేర్చాలని నిర్ణయించారు ఈ కార్యక్రమానికి అతిథులుగా జిల్లా బిజెపి కార్యదర్శి గొడవర్తి సుజాత జిల్లా మహిళా మోర్చా హాజరయ్యారు ఇక ఈ సమావేశానికి మండల సభ్యత్వాల ప్రముఖు మేన వత్తు రవ కో ప్రముఖ్ రాజవరపు శ్రీనివాసరావు మరో కో ప్రముఖ ఎలిసెట్టి నాగేశ్వరరావు మండలంలోని బూతు కన్వీనర్లు గండి గణములనుంచి రామకృష్ణ నాయక్ ఎర్రకోటయ్య వెంకటేశ్వర్లు యాదవ్ మీనుగా ఏడుకొండలు ఇంకా కొంతమంది బూత్ కన్వీనర్లు హాజరయ్యారు.

## జిల్లాస్థాయి పోటీలలో విద్యార్థుల ప్రతిభ



**బాపట్ల, ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక) :** వారధి ఫౌండేషన్ రూపొందించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలు బాపట్ల జిల్లా స్థాయిలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు బుధవారం బాపట్ల జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ పోటీలలో వక్తృత్వ పోటీ నందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం అద్దంకి, విద్యార్థులు ప్రథమ స్థానాన్ని, జడ్.పి.హెచ్.ఎస్ దేశాయిపేట విద్యార్థులు ద్వితీయ స్థానాన్ని, జడ్.పి.హెచ్.ఎస్, చందలూరు విద్యార్థులు తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు.

వ్యాసరచన పోటీలలో జడ్పీహెచ్ఎస్ చినగంజాం జడ్.పి.హెచ్.ఎస్ దేశాయిపేట జడ్.పి.హెచ్.ఎస్ ఇంకొల్లు విద్యార్థులు ప్రథమ, ద్వితీయ,తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు.జిల్లాలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో ప్రథమ స్థానాన్ని పొందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొం టారు. ఈ పోటీలను సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి బి. మోజెస్ జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్ నిర్వహించినారు. ఈ పోటీలకు జి సి డి ఓ ఎం. చారులత , ఐఈడి కోఆర్డినేటర్ ఏం.జ్యోత్స్న లు న్యాయనిర్ణేతలు గా వ్యవహరించారు. విజేతలుగా నిలిచి న విద్యార్థులను సమగ్ర శిక్ష బాపట్ల జిల్లా ఏపీసి , డిప్యూటీ కలెక్టర్ సిహెచ్. లక్ష్మీ కుమారి విద్యాశాఖ అధికారి జి వెంకటేశ్వర్లు అభినందించినారు.

# బిజెపిలో చేరిన జాగర్లమూడివారిపాలెం సర్పంచి, మాజీ జెడ్పిటిసి మాతయ్య





**జె. పంగులూరు, ఆగస్టు 28(ఆంధ్రపత్రిక):** దేశంలో బిజెపి ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై బిజెపిలో జె పంగులూరు మండలం జాగర్లమూడివారిపాలెం సర్పంచ్ జాగర్లమూడి వెంకటరత్నం, మాజీ పిడిసిసి బ్యాంక్ డైరెక్టర్ జాగర్లమూడి యల్లమందరావు, బల్లికురవ మండలం మాజీ జెడ్పిటిసి జంగ్రాజుపల్లి మాతయ్య రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సమక్షంలో బిజెపి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షులు పురందేశ్వరి మాట్లాడుతూ గడిచిన 10 సంవత్సరాల కాలంగా భారతీయ జనతా పార్టీ దేశానికి అందిస్తున్న సుపరిపాలన అదేవిధంగా నరేంద్ర మోడీ దేశానికి అందిస్తున్న సేవ అవినీతి రహిత పాలన దేశానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. దీనికి ఆకర్షితులైన నాయకులు అద్దంకి నియోజకవర్గంలో పెద్ద మొత్తంలో పార్టీలో చేరి పార్టీని బలోపేతం చేస్తారని పురందేశ్వరి తెలిపారు. పార్టీలో చేరిన వారందరూ పార్టీ కోసం పనిచేయాలని సూచించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం నియోజకవర్గంలో భారీ ఎత్తు చేపట్టాలని. నాయకులకు కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ, జాగర్లమూడివారి పాలెం సర్పంచి వెంకటరత్నం పిడిసిస్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ జాగర్లమూడి యల్లమందరావు మాజీ జడ్పిటిసి జంగ్రాజుపల్లి మాతయ్య మోదేపల్లి మాజీ ఎంపీటీసీ వెంకటాపురం శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు .

# తెలంగాణ రాష్ట్రానికి సంగం డైరీ వ్యాపార కార్యకలాపాలు విస్తరణ



**గుంటూరు,ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక) :** సంగం డైరీ వ్యాపార కార్యకలాపాలు తెలంగాణ రాష్ట్రానికి విస్తరించే లక్ష్యంతో నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం శ్రీనివాస్ నగర్ గ్రామం నందు లక్షన్నర లీటర్ల కెపాసిటీతో అత్యాధునికమైన యంత్రసామగ్రితో కూడిన డైరీని ఏర్పాటు చేసారు. బుధవారం ట్రైయిల్ రన్ ప్రారంభించుటకు చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మరియు వారి సతీమణి జ్యోతిర్మయిచే పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. సదరు కార్యక్రమంలో పాలకవర్గసభ్యులు, మేనేజింగ్ డైరెక్టర్ మరియు ఉన్నతాధికారులు పాల్గొనుట జరిగినది.. సదరు కార్యక్రమంలో పాలకవర్గసభ్యులు, మేనేజింగ్ డైరెక్టర్ మరియు ఉన్నతాధికారులు పాల్గొనుట జరిగినది. ఈ డైరీ నుండి తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాదు, మహబూబ్నగర్ తదితర జిల్లాలకు డైరీ ఉత్పత్తులను వినియోగదారులకు అందించే లక్ష్యంతో ఉన్నాము. ఈ డైరీ ప్లాంట్ కు అనుబంధంగా తెలంగాణ రాష్ట్రంలోని ఆయా ప్రాంతాలలో ఆరు చిల్లింగ్ సెంటర్లను త్వరలో ఏర్పాటు చేయ బోవుతున్నాము అని నరేంద్రకుమార్ తెలియచేసారు భవిష్యత్తులో మూడు లక్షల లీటర్ల కెపాసిటీ కి విస్తరించు విధముగా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకొనటమైనది సంగం డెయిరీ మిర్యాలగూడ ప్లాంటు నందు కంపెనీ పాలకవర్గ సమావేశము జరిగినది.

# వివిఐటి అధ్యాపకునికి డాక్టరేట్ ప్రదానం



**గుంటూరు,ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక) :**వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాలలోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన సుధాకిషోర్ రేఖా సోషల్ నెట్వర్కింగ్, సైబర్ క్రైమ్స్ పై చేసిన పరిశోధనలకుగాను ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టా పొందినట్లు కళాశాల చైర్మన్ శ్రీ వాసి రెడ్డి విద్యాసాగర్ తెలిపారు. వివిఐటి కళాశాలకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ సుధాకిషోర్ రేఖా " ఏ హైబ్రీడ్ అప్రోచ్ టు ట్రేస్ అండ్ మిటిగేట్ ఎటాక్స్ ఆన్ సైబర్ కేస్డ్ ఆబ్జెక్ట్స్ ఇన్ సోషల్ నెట్వర్స్ యూజింగ్ ఎస్.వి.ఎమ్ అండ్ ఎస్.ఎమ్.ఓ.టీ.ఈ " పై చేసిన పరిశోధనా పత్రాలను ప్రొఫెసర్ డా. డి. లలితా భాస్కరి పర్యవేక్షణలో అందించడం ద్వారా ఈ డాక్టరేట్ పొంది నట్లుగా తెలిపారు. అనంతరం సుధాకిషోర్ ను చైర్మన్ శ్రీ వాసిరెండ్డి విద్యాసాగర్, వైస్చర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపల్ డా. వై. మల్లికార్జున రెడ్డి, డీన్ అఫ్ అకడమిక్ డా. కె.గిరిబాబు, ఐటి విభాగాధిపతి డా. ఎ. కళావతి అభినందించారు.

## మఠం శివాలయమునకు విరాళం



**జగ్గయ్యపేట,ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక) :** ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణము పాలేటివొడ్డున వెంచేసియున్న శివ పంచాయతన క్షేత్రం మఠం శివాలయం పునరనిర్మాణమునకు భక్తులు పేరూరి వెంకట లక్ష్మీ నరసింహారావు దంపతులు ఆలయ కమిటీ సభ్యులకు 1,00,116/- (1లక్షనూటపదహార్లు) బుధవారం విరాళముగా అందచేశారు.

## జిల్లా స్థాయి పోటీలలో గురుకుల విద్యార్థుల ప్రతిభ





**అద్దంకి ,ఆగస్టు 28(ఆంధ్రపత్రిక):** బుధవారం బాపట్లలోని బాపట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు జిల్లా స్థాయిలో స'మగ్ర శిక్ష వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు వ్యాస రచన వకృత్వ పోటీలు నిర్వహించారు ఈ పోటీలలో వక్తృత్వ పోటీ నందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం అద్దంకి 10వ తరగతి విద్యార్థినీలు అయిన వి. లక్ష్మి యం. లావణ్య టి.ఖ్యాతి లు ప్రథమ స్థానాన్ని పొందినారు. జిల్లాలో వ్యాసరచన వక్తృత్వ పోటీలలో ప్రథమ స్థానాన్ని పొందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత పొందినారని మోజేష్ తెలిపారు సమగ్ర శిక్ష అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీ బి. మోజెస్ జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు ఈ పోటీలకు జి సి డి ఓ ఎం. చారులత ఐఈడి కోఆర్డినేటర్ ఏం.జ్యోత్స్న లు న్యాయ నిర్ణీతలు గా వ్యవహరించినారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను సమగ్ర శిక్ష జిల్లా ఏపీసి డిప్యూటీ కలెక్టర్ సిహెచ్. లక్ష్మీ కుమారి విద్యాశాఖ అధికారి జి వెంకటేశ్వర్లు అభినందించినారు.

### 23 రోజులు గడుస్తున్న మృతి చెందిన

# పార్వతీకి న్యాయం చేయలేని అధికారులు

పార్వతి మృతికి సంబంధించి ఇంకా రాని పోస్టుమార్టం, పోరెన్సీ రిపోట్లు...ఎదో జరుగుతుంది అన్న అనుమానం

విద్యార్థి తల్లిదండ్రులు ఇచ్చిన కంప్లైంట్‌పై చర్యలు తీసుకోలేని పోలీస్ అధికారులు

మృతి చెందిన పార్వతి కేసు పక్కదోవ పట్టిస్తే సంబంధిత అధికారులపై ఎస్పీ, జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయిస్తాం




**మంత్రాలయం, ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక) :** అఖిలభారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక మంత్రాలయం ఎమ్మార్వో ఆఫీస్ నందు ఎమ్మార్వో రవి సార్ గారికి వినతిపత్రం ఇచ్చిన అనంతరం విలేకరుల సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి తామస్ మాట్లాడుతూ రచ్చ మారి ఏపీ మోడల్ స్కూల్ 10 వ తరగతి విద్యార్థి పార్వతి మృతి చెంది 23 రోజులు గడుస్తున్న విద్యార్థి ఎలా మరణం గల కారణాలు ఇప్పటివరకు అధికారులు తెలియజేయకుండా పోలీస్ అధికారులు తమ సీట్లకు పరిమితం అయ్యిరు అన్నారు తల్లిదండ్రులు మా పాప మరణానికి కారణము హాస్టల్ వార్డెన్ ను మరియు కళాశాల ప్రిన్సిపాల్ అనే కంప్లైంట్ చేస్తే ఇప్పటివరకు వారిపైన ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఏంటని మండిపడ్డారు అలాగే విద్యార్థి చనిపోయిన రోజునా పోస్టుమార్టం జరిపించడానికి ఆదోని ప్రభుత్వ హాస్పిటల్ కి సాయంత్రం 5:04%జూఎ% గంటల నాలుగు నిమిషాలకు ఏపీ మోడల్ స్కూల్ నుండి ఆటోలో ఆదోని ప్రభుత్వ హాస్పిటల్ పోస్టుమార్టానికి తీసుకెళ్లరు హాస్పిటల్ వెళ్లడానికి దాదాపు గంట ముప్పై నిమిషాలు పడుతుందని కానీ మెడికల్ డాక్టర్స్ ఇచ్చిన రిపోర్ట్ లో 5:15 నిమిషాలకు హాస్పిటల్లో పోస్టుమార్టం ప్రారంభించినట్టు తప్పుడు రిపోర్ట్ చూపిస్తున్నారు అలాగే విద్యార్థి పోస్టుమార్టం చేసి 6 గంటల 30 నిమిషాలకు పోస్టుమార్టం పూర్తి చేసినట్టు చూపిస్తున్నారు,తల్లిదండ్రులకు మృతదేహాన్ని 8:55 నిమిషాలకు మృతదేహాన్ని అప్పగిస్తే రిపోర్ట్ లో 6:30 నిమిషాలకు ఇచ్చినట్టు రిపోర్ట్ చూపిస్తున్నారని అన్నారు, ఏ కేసైనా సరే రెండు మూడు రోజుల్లో టేకప్ చేసే పోలీస్ అధికారులు 23 రోజులు గడుస్తున్న విద్యార్థి మృతికి గల కారణాలు వెలకతీయ పోవడానికి అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి అన్నారు వెంటనే విద్యార్థి మృతికి గల కారణాలు వెలికి తీసేందుకు ప్రత్యేకంగా అధికారులను కేటాయించి విచారణ వేగవంతం చేసి నిజానిజాలు బయటికి తీయాలని అలాగే హాస్టల్ వార్డెన్ మరియు ప్రిన్సిపాల్ పై కేసు నమోదు చేసి కస్టడీలోకి తీసుకొని విచారణ చేసి విద్యార్థి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు, అలాగే మృతి చెందిన విద్యార్థి కుటుంబంలో చదువుకున్న విద్యార్థికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి మరియు కుటుంబానికి ప్రభుత్వం తరపున 30 లక్షలు ఎక్స్గ్రేషియా ప్రకటించి విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని వారు కోరారు అలాగే ఇలాంటి సంఘటనలను పునవృత్తం కాకుండా అధికారులు హాస్టల్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని వారన్నారు అధికారులు విద్యార్థికి న్యాయం చేయలేనిపక్షంలో పెద్ద ఎత్తున జిల్లా వ్యాప్తంగా ఆందోళనకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో మండల నాయకులు తిరుమలేష్,వీరేశ్,దివాకర్,రవి,వినోద్ తదితరులు పాల్గొన్నారు

### మూడుసార్లు అవార్డులు తీసుకోవడం

# అభినందనీయం

– సన్మాన సభలో రీలర్స్ అసోసియేషన్ నాయకులు ముస్తఫా



**హిందూపురం, ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక) :** పట్టణానికి చెందిన ప్రజాశక్తి విలేఖరి షబ్బీర్ రాష్ట్రస్థాయిలో మూడుసార్లు బొమ్మరెడ్డి స్మారక అవార్డులు తీసుకోవడం అభినందనీయమని పట్టు రీలర్ల అసోసియేషన్ నాయకులు ముస్తఫా అన్నారు. బుధవారం పట్టుగుళ్ల మార్కెట్ లో అసోసియేషన్ ఆధ్వర్యంలో షబ్బీర్ కు, నూతనంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా ఎంపికైన రామాంజనేయులకు ఘనంగా సన్మానించి మెమొంటోను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, ఆ సమస్యలను పరిష్కరించే సత్తా ఒక్క పాత్రికేయులకే ఉందన్నారు. 2008వ సంవత్సరంలో పట్టు రీలర్లకు, రైతులకు ప్రోత్సాహకం ఇవ్వాలని ఆందోళన చేస్తే ఆ సమస్యను ప్రత్యేక కథనల రూపంలో వెలుగులోకి తీసుకువచ్చారు. దీంతో అప్పటి ప్రభుత్వం పట్టు రైతులు, రీలర్ల సమస్యలను అర్థం చేసుకుని ప్రోత్సాహకాన్ని అందించడానికి ముందుకు వచ్చింది. అప్పటి నుంచి పట్టును విక్రయించిన రైతుకు, కొనుగోలు చేసిన రీలర్ కు ఇన్సెంటివ్ రూపంలో ప్రభుత్వం ఆదుకుంది అన్నారు. అయితే 2019 తర్వాత ప్రభుత్వం ఇస్తున్న ఇన్సెంటివ్ పూర్తిస్థాయిలో అందలేదన్నారు. దీంతో పట్టు రైతులు, రీలర్లు ఆందోళన కార్యక్రమాలను చేపడితే పాత్రికేయులు సంపూర్ణ సహకారాన్ని అందించి సమస్యను వెలుగులోకి తీసుకువచ్చారన్నారు. ఇలా ప్రతి సమస్యను వెలుగులోకి తీసుకువచ్చి ఆ సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ఖాజా, ప్రధాన కార్యదర్శి ముస్తఫా, ఉపాధ్యక్షులు భాష, సహాయ కార్యదర్శి దాదాపీర్, క్యాషియర్ లు ఖలీల్, రహీమ్ బేగ్, సలావుద్దీన్, ఆదినారాయణ, అల్లాబకాష్ తో పాటు రీలర్లు, పాత్రికేయులు పాల్గొన్నారు.

### మహాకవిసృష్టి కర్తగా

# వాల్మీకి మహర్షి

– కడివెళ్లలో వాల్మీకి విగ్రహ ఆవిష్కరణ



**ఎమ్మిగనూరు. ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక) :** ఆదికవి ప్రపంచ ప్రసిద్ధి గాంచిన రామాయణ మహాకవి సృష్టి కర్త వాల్మీకి మహర్షి అని ఎంపిపి గొల్ల కేశన్న. గ్రామ సర్పంచి రంగస్వామిలు కొనియాడారు. బుధవారం మండల పరిధిలోని కడివెళ్ళ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఎంపిపి గొల్ల కేశన్న. గ్రామ సర్పంచి రంగస్వామి లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రామాయణాన్ని రచించిన మహా గొప్ప వ్యక్తి అన్నారు. వాల్మీకి జంతువులను పక్షులను వేటాడేవారు. దారిదోపిడి. దొంగగా జీవించే వారు. పరమ కిరాతుకుడైన వాల్మీకి అవతార పురుషుడైన శ్రీ రాముని చరిత్ర ను నాటి నుంచి నేటి కి ఏనాటికి నిలిచిపోయే రచించి కావ్యాన్ని మానవుల కోసం ముందు చూపుగా వాల్మీకి ఆనాటి ఇనాటికి మహానీయుడుగా నిలిచి పోయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### గ్రామ సమస్యలపై

# రాష్ట్ర పర్యటనకు కదిలిన బిఎస్ఎస్ రథం




**మంత్రాలయం, ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక) :** బిఎస్ఎస్ చేపట్టిన గ్రామ చైతన్య యాత్రకు ఉమ్మడి కర్నూలు జిల్లా, అనంతపురం జిల్లాలో భాగంగా సుమారుగా రెండు నెలల పర్యటనలో భాగంగా రాఘవేంద్ర స్వామి సన్నిధానంలో వేద పాండితోత్తములు వెంకన్న స్వామి గారి ఆశీస్సులతో రాష్ట్ర అధ్యక్షులు రామతీర్థం అమ్రేష్ గారు ఆశీర్వాదం తీసుకొని రాష్ట్ర చైతన్య యాత్రకు తన వర్గంతో కదిలారు. ఈ సందర్భంగా అమ్రేష్ మాట్లాడుతూ.. లిబి ఎస్ ఎస్ అంటే బీసీలు,ఎస్సీ, ఎస్టీలు, మైనారిటీలు అన్నారు దేశంలో సుమారు 80% పైబడి ఉన్న ఎస్సీ ,ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల్లో అభివృద్ధి శూన్యం. కానీ ఈరోజు దేశంలోని సంపద అంతా కేవలం ఒకటి రెండు శాతం బడా బాబుల చేతుల్లోనే ఉంది. మన ఆంధ్రప్రదేశ్లో 961 కిలోమీటర్ల తీర ప్రాంతంలో అతిపెద్ద మత్స్య సంపద, దేశంలోనే పేరు ఉండే మానవ వనరుల సంపద మన ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకం. లినేటికీ సుమారు 92 శాతం మండలాల్లో గ్రామాల్లో రైతు సమస్యలు, నీటి సమస్యలు ,రోడ్డు సమస్యలు , సాగునీటి త్రాగునీటి సమస్యలు అనేకం పేరుకుపోబడ్డాయి. పల్లెలు పట్టుగమ్మలు, పల్లెల దేశ ప్రగతి అని రాజ్యాంగంలో లిఖించబడ్డా.. పల్లెలు పురోగతిలేక అధోగతి వైపు నడుస్తున్న విషయం మా బి ఎస్ ఎస్ ప్రత్యేకంగా గుర్తించింది. అందుకే బి ఎస్ ఎస్ తరఫున గ్రామ చైతన్య యాత్రలు వివిధ ఫేజుల్లో చేపట్టబోతున్నాము. మొదటి విడతల్లో భాగంగా ఉమ్మడి కర్నూలు అనంతపురం జిల్లాలో గ్రామచైతన్య యాత్రను చేపట్టబోతున్నాము. విద్యా, వైద్యం, ఉపాధి, కరువు మరియు సాగునీటి అంశాలపై గ్రామాల వారీగా సమస్యలు తెలుసుకుంటాం ఆ సమస్యలపై నిరంతర పోరాటం చేసి రాజ్యాంగ స్ఫూర్తిగా పల్లెలను ప్రగతి బాట పట్టించడమే మా బిఎస్ఎస్ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ కిషోర్,బిఎస్ఎస్ నాయకులు విజయుడు, దేవేంద్ర, ప్రసన్న, నరసింహస్వామి, లోకేష్, వీరేష్, విజయ్, బాబు తదితరులు పాల్గొన్నారు

### గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటుకి

# స్థలం కేటాయించండి



**నూజివీడు, ఆగస్టు 28, (ఆంధ్రపత్రిక) :** అమరావతి సచివాలయంలో రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ని కలిసి నూజివీడు పట్టణంలో గౌతులచ్చన్న విగ్రహ ఏర్పాటుకు మరియు కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు స్థలం కేటాయించవలసిందిగా వినతి పత్రం ద్వారా కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణా జిల్లా అధికార ప్రతినిధి, నూజివీడు నియోజవర్గ గౌడ సంఘ నాయకులు మరీదు శివరామకృష్ణ , కృష్ణాజిల్లా గౌడ్ సంఘం అధ్యక్షులు వీరంకి గురుమూర్తిగారు, నూజివీడు, కృష్ణా, గుంటూరు జిల్లాల గౌడ సంఘం యువజన విభాగం నాయకులు పరిసా శివరామకృష్ణ, పరిసా.జెస్సీ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆశయాల సాధనకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలి

- సిపిఐ జిల్లా కార్యదర్శి
- కామ్రేడ్ క్రీ.శే. జి మాదన్న 7 వ వర్ధంతి
- స్తూపానికి నివాళ్ళులు




**ఎమ్మిగనూరు, ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక) :** కీర్తిశేషులు. కామ్రేడ్ బిజి మాదన్న ఆశయాల సాధనకు భారత కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయం నందు కీర్తిశేషులు కామ్రేడ్ బిజి మాదన్న 7వ వర్ధంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండల పరిధిలోని కె. తిమ్మాపురం గ్రామం లో ఆయన స్తూపానికి సిపిఐ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య,నియోజకవర్గ సిపిఐ నాయకులు నివాళులర్పించారు. అనంతరం ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ ఎమ్మిగనూరు,మంత్రాలయం, నియోజకవర్గాలలో కమ్యూనిస్టు పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు.నిత్యం బడుగు, బలహీన వర్గాల ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తూ మరో పక్క భూమి లేని నిరుపేదలకు భూ పోరాటాల ద్వారా పేదలకు భూములు పంచిన ఘనత బిజీ మాదన్న కే దక్కిందన్నారు.ముఖ్యంగా ఈ నియోజకవర్గాలలో పెత్తందారుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా గ్రామాలను కాపాడి ప్రజలను చైతన్య పరచడంలో తీవ్రంగా కృషి వ్యక్తి అన్నారు. ముఖ్యంగా ఈ ప్రాంత రైతాంగానికి సాగునీరును అందించాలని పోరాటాలు ద్వారా కొండమ్మ చెరువు సాధించడంలో అగ్ర భాగానగా బీజీ మాదన్న ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపురం సిపిఐ సర్పంచ్ మహేశ్వరమ్మ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన గౌడ్, భాస్కర్ యాదవ్, రంగన్న, సిపిఐ ప్రజాసంఘాల నాయకులు వీటి చిన్నన్న,మద్దిలేటి నాయుడు, విరుపాక్షి నాయుడు,రాజీవ్,జబ్బర్, నాగప్ప, బీపీ.వెంకటేష్,విజయేంద్ర, తిమ్మ గురుడు,శాంతప్ప వీరేష్,కాజా,మల్లికార్జున గౌడ్,రవి, ఎల్లప్ప, రామాంజనేయులు, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు

# ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం



**నూజివీడు, ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక) :** నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణములో ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డిఓ వై భవాని శంకరి మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ కుటుంబాలపై జరిగే ఆకృత్యాలను నిరోధించేందుకు విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు సకాలంలో స్పందించి విధులు నిర్వర్తించాలన్నారు. ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీతో సమన్వయం ఏర్పాటు చేసుకుని ముందడుగు వేయాలని సూచించారు. విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు అయ్యంకి సురేష్ బాబు మాట్లాడుతూ రెవిన్యూ డివిజన్ పరిధిలోని గ్రామాలలో ప్రతినెల సివిల్ రైట్స్ డే పురస్కరించుకొని సమావేశాలు నిర్వహించాలన్నారు. ఎస్సీ ఎస్టీలకు చెందిన వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులకు ప్రత్యేకమైన న్యాయపరమైన అంశాలు, భారతీయ సంవిధానం 1950, వినియోగదారుల రక్షణ చట్టం 1986, సమాచార హక్కు చట్టం 2005, భారతీయ న్యాయ సంహిత 2023 లపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి నెల అవగాహన సదస్సులు నిర్వహించి విద్యార్థులకు చట్టాలపై అవగాహన పెంపొందించేలా కృషి చేయాలన్నారు. ఎస్సీ ఎస్టీలకు చెందిన కుటుంబాలపై ఆకృత్యాలు జరిగితే తక్షణమే కమిటీ సభ్యులకు సంబంధిత పోలీసు శాఖ అధికారులు సమాచారం అందించాలన్నారు. ఇలాంటి సంఘటనలలో బాధితులకు రక్షణగా నిలిచే విధంగా కేసులు నీరు కారకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్పందించిన ఆర్డిఓ భవాని శంకరి మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు మానిటరింగ్ కమిటీ తో పాటు సంబంధిత శాఖలకు చెందిన అధికారులు అండగా నిలుస్తారని,నిలవాలని అన్నారు.ఈ సమావేశంలో వివిధ శాఖలకు అధికారులు పాల్గొన్నారు.

### అటవీ బంజర

# భూములకు పట్టాలు వెంటనే ఇవ్వాలి

– సిపిఐ సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు డిమాండ్





**నూజివీడు, ఆగస్టు 28, (ఆంధ్రపత్రిక) :** గత 50 సంవత్సరాల నుండి అటవీ బంజర భూముల్లో సాగులో ఉంటున్న పేద, బలహీన వర్గాలకు పట్టాలు ఇవ్వాలని నూజివీడు అమరభవన్లో సమావేశం వేసి, సమావేశం అనంతరం నూజివీడు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌కు ఏవిక్షన్ నోటీసులకు రిప్లై ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి భారత కమ్యూనిస్టు పార్టీ( సిపిఐ) సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వర రావు మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గం పరిధిలో ఉన్న అటవీ బంజర భూమిలో గత 50 ఏండ్లు పేదలు సాగులో వున్నారు, వీరికి పట్టాలు వెంటనే మంజూరు చేయాలి, ఈ సాగుదారులు ఎక్కువమంది ఎస్సీ ఎస్టీ లు ఉన్నారు, మూడు తరాలు సాగులో ఉన్న భూములకు మాత్రమే పట్టాలు ఇవ్వాలి అనే చట్టాన్ని సవరించాలి, గతంలో ఎందరో కమ్యూనిస్ట్ నాయకులు పేదల పక్షాన నిలబడి భూ పోరాటాల ఫలితంగా భూములను పేదలకు పంపిణి చేయడం జరిగింది. ఈ భూములు మూడు తరాలు సాగులోనే వున్నాయి, ప్రభుత్వం వెంటనే స్పందించి పట్టాలు ఇవ్వాలి,, ఈ కార్యక్రమం లో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు, సిపిఐ నాయకులు చాట్ల. పుల్లారావు, అటవీ బంజర భూముల సాగుదారులు అబ్బురి. రంగారావు, తదితరులు పాల్గొన్నారు

### దర్గా ఉరుసు ఉత్సవాలుకు రావాలంటూ

## ప్రముఖ సినీ నటుడు డాక్టర్ సుమన్‌కు ఆహ్వానం



**శ్రీకాళహస్తి ,ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక) :** శ్రీకాళహస్తి పట్టణంలో అతి త్వరలో జరగనున్న దర్గా ఉరుసు ఉత్సవాలుకు తప్పకుండా రావాలంటూ ప్రముఖ సినీ నటుడు డాక్టర్ సుమన్ కు ఉరుసు ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం ఆహ్వానం పలికారు. శ్రీకాళహస్తి దర్గా హాజరత్ జూమ్లే షాపీర్ దర్గా పీఠాధిపతి సయ్యద్ అహ్మద్ దర్గా నిర్వాహకులు సయ్యద్ బాబా ఫరీద్ వారి ఆధ్వర్యంలో ప్రముఖ సినీ నటుడు డాక్టర్ సుమన్ తల్వార్ ని కలవడం జరిగింది. మర్యాదపూర్వకంగా ఆయనను కలిసి త్వరలో దర్గా ఉరుసు ఉత్సవాలకు మీరు రావాలని ఉరుసు కమిటీ సభ్యులు ద్వారా ఆహ్వానించడంతో ఆయన సానుకూలంగా స్పందిస్తూ నేను ఆ దర్గాకి భక్తున్ని కాబట్టి కచ్చితంగా నేను గంధోత్సవం రోజు పాల్గొంటాను అని హామీ ఇచ్చినట్టు తెలిపారు. బుధవారం సుమన్ పుట్టినరోజు సందర్భంగా స్వామివారి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించినాము. దర్గా అంటే సుమన్కి ప్రత్యేకమైన ఒక భక్తి భావన ఉంది అందుకుగాను దర్గా లో ఏ ఏ కార్యక్రమాలు జరుగుతాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఉరుసు కమిటీ ప్రెసిడెంట్ ఓరుగంటి నాగేశ్వరరావు ,ఆర్గనైజర్స్ న్యాయవాది గుమ్మలా రాజేశ్వరరావు ,ఎంఎస్ జమురు బాదుషా ఆటో యూనియన్ ప్రెసిడెంట్ జూమ్లేష రహీమ్ ఖాన్ మహమ్మద్ యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎవరికి తెలియకుండా మొగిలి గుడి హుండీ లెక్కింపు



**బంగారుపాళ్యం, ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక) ;** చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండల పరిధిలోని మొగిలీశ్వర స్వామి ఆలయంలో ఆచారాలకు విరుద్ధంగా గ్రామస్తులకు తెలియపరచకుండా హుండీ లెక్కింపు నిర్వహించడం సబబు కాదని స్థానిక టిడిపి నేత మంజునాథ్ ఆరోపించారు.సాధారణంగా గ్రామపెద్దల సమక్షంలో ఆలయ అధికారులు హుండీ లెక్కింపు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని కానీ బుధవారం నిర్వహించిన హుండీ లెక్కింపు కార్యక్రమంలో గ్రామ పెద్దలకు సమాచారం లేకుండా నిర్వహించడంలో మతలబు ఏంటని ప్రశ్నించారు.ఇకనైనా మొగిలిశ్వరుడి ఆదాయానికి గండి పడకుండా అధికారులు మరియు గ్రామ పెద్దల సమక్షంలో హుండీ లెక్కింపు నిర్వహించాలని కోరారు.

### తొట్టంబేడు ఎస్సైగా నూతనంగా బాధ్యతలు

## స్వీకరిస్తున్న కే.ఈశ్వరయ్య



**తొట్టంబేడు, ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక) :** తొట్టంబేడు నూతన ఎస్సై గా ఈశ్వరయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఎర్ర వా రి పాలెం పోలీస్ స్టేషన్ నుండి ఇక్కడకు బదిలీపై వచ్చారు. తొట్టం బేడు మండలంలో సమర్థవంతంగా విధులు నిర్వహించిన ఎస్సై రా ఘవేంద్ర భాకరాపేట పోలీస్ స్టేషన్ కి బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తొట్టంబేడు ఎస్సై ఈశ్వరయ్య ముందుగా సి బ్బందిని పరిచయం చేసుకున్నారు. మండలంలో ఎవరైనా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు.

### వరికూటి వారి ఓణీ ల వేడుకలలో పాల్గొన్న

## ఎమ్మెల్యేలు ఉగ్ర, కందుల, ఇన్చార్జి గొట్టిపాటి



**దర్శి ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక) ;** దర్శి నియోజకవర్గ జనసేన నాయకులు, కనిగిరి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి లాయర్ వరికూటి నాగరాజు సోదరులు వరికూటి సుధాకర్ బాబు గారి కుమార్తె దీప్య శ్రీ ఓణీ ల వేడుకలు పొదిలిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహ రెడ్డి, దర్శి టిడిపి ఇన్చార్జ్ గొట్టిపాటి లక్ష్మి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కుమారుడు విష్ణున్ష్ రెడ్డి లు పాల్గొని చిరంజీవి దీప్య శ్రీ లను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో వరికూటి నాగరాజు కుటుంబ సభ్యులు, బందువులు తదితరులు పాల్గొన్నారు.

# ఎపికి భారీగా నిధులు

(మొదటిపేజీ తరువాయి)

రామ్మోహన్‌నాయుడు తెలిపారు. బుధవారం న్యూఢిల్లీలో రామ్మోహన్ నాయుడు మీడియాతో మాటా్లడుతూ ఓర్వకల్లు, కొప్పర్తికి ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలు మంజూరు అయి నట్లు వెల్లడిం చారు. హైదరాబాద్–బెంగళూరు, విశాఖ–చెన్నై కారిడార్లు అభివృద్ధి చేస్తామన్నారు. పోలవరానికి రూ.12 వేల కోట్లు ఇవ్వడానికి త్వరలో ఒప్పందం జరగనుందని, ఏపీకి వివిధ రకాల పరిశ్రమలు రావడానికి కేంద్రం సాయం చేస్తోందని వివరించారు.

# వైసిపికి వరుస షాక్‌లు

(మొదటిపేజీ తరువాయి)

పార్టీని వీడుతున్నట్లు ప్రకటిస్తున్నారు. ఏళ్లుగా ఆ పార్టీని అంటిపెట్టుకున్న నేతలు సైతం ఇప్పుడు ఆ పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొందరు ముఖ్య నేతలు పార్టీ వీడగా.. మరికొందరు పార్టీకి దూరంగా ఉంటూ వస్తున్నారు. ఈ క్రమంలో ఎంపీ మోపిదేవి వెంకటరమణ ఊహించని రీతిలో తన రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించారు. రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో పాటు.. పార్టీకి కూడా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ ఘటన ఇలా ఉండగానే.. మరో కీలక పరిణామం వైసీపీని భారీగా కుదిపేసింది. వైసీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత సంచలన ప్రకటన చేశారు. పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అంతేకాదు.. ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు వైసీపీ అధినేత జగన్‌కు సునీత ఓ లేఖ రాశారు. గతంలో టీడీపీలోంచి వైసీపీలో చేరిన సునీత.. ఇప్పుడు వైసీపీని వీడేందుకు సిద్ధమయ్యారు. ఏపీలో వైసీపీకి భవిష్యత్ లేదనే నిర్ణయానికి వచ్చే ఆ పార్టీ నేతలు ఇలా వరుసగా పార్టీని వీడుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. వైసీపీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన పోతుల సునీత.. ఏ పార్టీలో చేరబోతున్నారనే అంశం ఆసక్తికరంగా మారింది. గతంలో టీడీపీ నుంచి వైసీపీలోకి చేరిన సునీత.. మళ్లీ సొంత గూటికి వెళ్తారా? లేక వేరే పార్టీలో జాయిన్ అవుతారా? అని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అయితే, సునీత అనుచరుల్లో జరుగుతున్న చర్చ ప్రకారం చూసుకుంటే.. ఆమె త్వరలోనే బీజేపీలో చేరుతారని తెలుస్తోంది. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉండడం, రాష్ట్ర ప్రభుత్వంలోనూ బీజేపీ భాగస్వామ్యం కావడంతో ప్రయోజనం ఉంటుందని ఆమె భావిస్తున్నారని తెలుస్తోంది. ఈ కారణంగా ఆమె బీజేపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలుస్తోంది. ఇప్పటికే చాలా మంది ముఖ్య నేతలు వైసీపీని వీడగా.. మరికొందరు అదే ఆలోచనలో ఉన్నారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి వంటి వారు బాహాటంగానే తాము పార్టీకి దూరంగా ఉంటూ వస్తున్నామని ప్రకటించారు. ఇలా ఎందరో నేతలు ఎన్నికల తరువాత వైసీపీకి దూరంగా ఉంటున్నారు.

# నూజివీడు ట్రిపుల్ ఐటీలో 800 మందికి అస్వస్థత

(మొదటిపేజీ తరువాయి)

వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. ముందస్తు చర్యలు తీసుకోవడంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహించిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు ఈ అంశంపై కమిటీ వేశామని ట్రిపుల్ ఐటీ యాజమాన్యం తెలిపింది. దీనిపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూడా స్పందించి తక్షణమే మెరుగైన చికిత్సల కోసం చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# అదో భయానక ఘటన

**న్యూఢిల్లీ,ఆగస్టు 28 :** కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ ఘటన దేశంలో పెనుదుమారంగా మారింది. దీనిపై అన్ని వర్గాల ప్రజల నుంచి తీవ్ర స్థాయిలో నిరసనలు వస్తున్నాయి. ఈ కేసులో ఇప్పటికే సుప్రీమ్ కోర్టు సుమోటోగా తీసుకుని విచారణ జరుపుతుంది. ఈ క్రమంలో వెస్ట్ బెంగాల్‌లో ప్రస్తుతం బీజేపీ పిలుపునిచ్చిన.. పన్నెండు గంటల పాటు బంద్ నడుస్తోంది. అది కూడా పూర్తిగా హింసాత్మకంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. పలు చోట్ల విద్యార్థులపై పోలీసులు దాడులు చేస్తున్నారు. అంతేకాకుండా.. కొంత మంది దుండగులు బీజేపీ నేతలపై బాంబులతో విరుచుకుపడుతున్నారు. దీనికి సంబంధించిన వీడియోలను వెస్ట్ బెంగాల్ కు చెందిన బీజేపీ నేత.. సువేందు అధికారి తన ఎక్స్ ఖాతాలో సైతం పోస్టు చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ ఘటనపై ఇప్పటికే పలువులు నిందితులకు సీబీఐ కోల్ కతా కోర్టు ఆదేశాలమేరకు పాలీగ్రాఫ్ టెస్టులు సైతం చేసింది. అంతేకాకుండా.. ఈ ఘటనకు కారణమైన వారిని కఠినంగా పనిష్మెంట్ చేయాలని కూడా ప్రజలంతా డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో..ప్రస్తుతం కోల్ కతా ఘటనపై తాజాగా, భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పందించారు. ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వార్తలలో నిలిచాయి. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తొలిసారి కోల్ కతా ఘటనపై మాట్లాడారు. ఈ ఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతికి గురైనట్లు తెలిపారు. అంతేకాకుండా.. ఏ నాగరిక సమాజం కూడా మహిళలపై దాడులు జరగటాన్ని అంగీకరించబోదన్నారు. కానీ సమాజంలో మాత్రం ప్రస్తుతం చోటు చేసుకుంటున్న ఘటనలు మాత్రం ఆందోళనకరంగా మారాయన్నారు. పదేళ్ల క్రితం నిర్భయ ఘటన జరిగిన తర్వాత కూడా సమాజంలో అనేక ఘటనలు జరిగాయన్నారు. ఇప్పటికైన సమాజం మేల్కొవాల్సిన అవసరముందని రాష్ట్రపతి ముర్ము అన్నారు. అంతేకాకుండా.. మహిళలు అన్నిరంగాలలో రాణిస్తున్నఈ తరుణంలో.. ఇలాంటి ఘోరాలు జరగటం దారుణమన్నారు. నాలుగైదు ఏళ్ల చిన్నారులపై కూడా దారుణాలు జరగటం ఘోరమన్నారు. ఈ ఘటనల పట్ల ఇప్పటికైన మేల్కొనాల్సిన అవసరముందని ముర్ము అన్నారు.

# ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి వేడుకలు

(మొదటిపేజీ తరువాయి)

వేడుకల్లో అమ్మవారిని రోజుకో రూపంలో అలంకరిస్తారు. ఈ మేరకు ఏర్పాట్లు చేసేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో శరన్నవరాత్రి ఉత్సవాల ముహూర్తం ఖరారు చేశారు. మొదటిరోజైన అక్టోబర్ 3వ తేదీన అమ్మవారు బాలా త్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. 4వ తేదీన గాయత్రీదేవిగా, 5వ తేదీన అన్నపూర్ణ దేవిగా అమ్మవారు దర్శనమిస్తారు. 6వ తేదీన లలితా త్రిపుర సుందరీదేవిగా, 7వ తేదీన మహాచండీ అలంకారంలో, 8వ తేదీన మహాలక్ష్మి దేవి గా దర్శనమిస్తారు. 9వ తేదీన సరస్వతి దేవిగా దర్శనమిస్తారు. 10వ తేదీన దుర్గాదేవిగా, 11వ తేదీన న మహిషాసురమర్దినిగా, 12వ తేదీన రాజరాజేశ్వరీ దేవిగా అమ్మవారు దర్శన మిస్తారు. భక్తులకు ఇబ్బంది లేకుండా దసరా ఉత్సవాల కోసం ఆలయంలో పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో రామారావు తెలిపారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరిగే దేవీ శరన్నవరాత్రులకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలి రానున్నారు. సగటున ప్రతి రోజు లక్షమంది భక్తులు అమ్మవారి దర్శనం చేసుకుంటారు. అమ్మవారి జన్మనక్షత్రమైన మూలనక్షత్రం రోజు సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనం ఇస్తారు. అక్టోబర్ 9వ తేదీన సరస్వతీ దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. ఈ ఏడాది ఉత్సవాల నిర్వహణ కోసం ఇప్పటికే అధికారులు ఏర్పాట్లు ప్రారంభించారు. క్యూ లైన్ల ఏర్పాటుతో పాటు భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. దసరా ఉత్సవాల నేపథ్యంలో 10 రోజుల పాటు ప్రత్యేక దర్శనాలను రద్దు చేస్తారు. గర్భగుడి దర్శనానికి అనుమ తించరు. కేవలం ప్రోటోకాల్ కలిగిన వ్యక్తులకు మాత్రమే ప్రత్యేక దర్శనం కల్పిస్తారు. సామాన్య భక్తులకు లిఫ్ట్ సౌకర్యం అందుబాటులో ఉండదు. కేవలం వృద్ధులు, ఆలయ సిబ్బందికి లిఫ్ట్ సౌకర్యం అందుబాటులో ఉంటుంది. కొండకింద నుంచి పైకి క్యూలైన్‌లో వెళ్లాల్సి ఉంటుంది. బస్సు మార్గంలో కొండపైకి సగం వరకు చేరుకోవచ్చు. అక్కడి నుంచి నడక ద్వారా క్యూలైన్‌లోకి ప్రవేశించాలి. వీఐపీ వాహనాలను సైతం కొంతవరకు అనుమతిస్తారు. ప్రసాదం కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లను చేయనున్నారు.

# జన్‌ధన్‌కు పదేళ్లు..

(మొదటిపేజీ తరువాయి)

సందర్భంగా ప్రధాని 'ఎక్స్' (ట్విటర్) వేదికగా హర్షం వ్యక్తం చేశారు. ఈ పథకం విజయవంతం చేసిన లబ్ధిదారులకు అభినందనలు తెలిపారు. "సమ్మిళిత ఆర్థికాభివృద్ధిని పెంపొందించడంతో పాటు కోట్లాది మందికి.. ముఖ్యంగా మహిళలు, యువత, అణగారిన వర్గాలకు గౌరవాన్ని అందించడంలో ఈ పథకం అత్యంత ముఖ్యమైంది. ఇది దేశ ప్రజల గౌరవం, సాధికారత, దేశ ఆర్థిక వ్యవస్థను వృద్ధి బాటలో నడిపేందుకు ఎంతో ఉపయోగపడింది" అని ప్రత్యేక పోస్టులో ప్రధాని పేర్కొన్నారు. దేశంలో ప్రతి కుటుంబానికి కనీసం ఒక్క బ్యాంకు ఖాతా అయినా ఉండేటట్లు చూడటం జన్‌ధన్ పథకం ప్రధాన లక్ష్యం. "మీలో చాలా మంది ముఖ్యంగా యువత.. ఈ పథకం ఎందుకు అంత ముఖ్యమైందని ఆలోచిస్తారు..? ప్రస్తుత పరిస్థితుల్లో అన్నింటే ముఖ్యంగా ప్రతి ఒక్కరికి బ్యాంకు ఖాతా ఉండడం ఎంతో ముఖ్యం. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాకముందు వరకు దాదాపు ఎన్నో సామాన్య కుటుంబాలకు బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేవు. దీని వల్ల సామాన్యుల సొత్తు చోరీ గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉండేవి. ఆర్థిక భద్రత లేకపోవడంతో ప్రజల ఆశలు కలలుగా మిగిలేవి" అని అన్నారు. "జన్‌ధన్ యోజన ప్రారంభించినప్పుడు.. దాని చుట్టూ ఉండే సమస్యలు, సందేహాలు నాకు ఇంకా గుర్తున్నాయి. ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలను బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురావడం సాధ్యమవుతుందా..? అనే ప్రశ్నలు ఎదురయ్యాయి. కానీ, ఈ ప్రయత్నం మంచి మార్పుకు దారి తీస్తుందని నమ్మాను. 53 కోట్ల మందికి పైగా ప్రజలు బ్యాంకు ఖాతాలను కలిగి ఉన్నారు. ఇది ఊహించని పరిణామం. ప్రస్తుతం ఈ ఖాతాల్లో డిపాజిట్ల బ్యాలెన్సు రూ. 2. 3 లక్షల కోట్లు. వీటిలో 65 శాతానికి పైగా గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల వారు ఉండడం విశేషం. అంతేకాకుండా ఈ పథకం ద్వారా మహిళా సాధికారతను సాధించాం. దాదాపు 30 కోట్ల మందికి పైగా మహిళలను బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురాగలిగాం" అని ప్రధాని పేర్కొన్నారు.

# మమత వ్యాఖ్యలపై హిమంత్ బిశ్వశర్మ ఆగ్రహం

**గౌహతి,ఆగస్టు 28 :**'బెంగాల్ తగలబడితే అసోం కూడా తగులబడుతుందని అంటూ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలపై అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వ శర్మ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అసోంను బెదిరించడానికి మీకెంత ధైర్యం అంటూ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో దీదీని నిలదీశారు. 'దీదీ..అసోంను బెదిరించడానికి మీకెంత ధైర్యం? మా మీద కళ్లు ఎర్ర చేయకండి. మీ రాజకీయ వైఫల్యాలకు ఇండియాను తగులపెట్టే ప్రయత్నం కూడా చేయొద్దు.

# పాతపద్ధతిలోనే టెండర్ల విధానం

(మొదటిపేజీ తరువాయి)





నిర్వహణకు అంగీకారం తెలిపింది. పోలవరం ఎడమ కాలువ పనుల పునరుద్ధరణకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఈ పనుల్లో ప్రస్తుత గుత్తేదారు సంస్థనే కొనసాగించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వివాదాల్లోని భూముల రిజిస్ట్రేషన్ నిలిపివేతకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఆంధ్రప్రదేశ్ సర్కార్ నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. రాష్ట్ర మున్సిపల్ శాఖలో 269 సూపర్ న్యూమరీ పోస్టుల భర్తీకి ఏపీ క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. అలాగే పౌరసరఫరాల శాఖకు సంబంధించి 2,771 కొత్త రేషన్ షాపుల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఈ మేరకు బుధవారం ఉదయం 11గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఏర్పాటైన క్యాబినెట్ ఈ నిర్ణయం తీసుకుంది. ఏపీ క్యాబినెట్ సమావేశంలో మరికొన్ని కీలక అంశాలపై చర్చ జరిగింది. గత ప్రభుత్వం తెచ్చిన రివర్స్ టెండరింగ్ విధానం రద్దు చేస్తూ ఏపీ క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. దీన్ని ఒక నిరుపయోగమైన విధానంగా మంత్రులు వ్యాఖ్యానించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ విధానం సరికాదని, అందుకే రద్దు చేయాలంటూ తీర్మానించారు. అలాగే సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహణపై క్యాబినెట్‌లో చర్చ సాగింది. 2014లో చివరిసారిగా సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరిగాయి. మాజీ ముఖ్యమంత్రి జగన్ ఫొటోలతో కూడిన పాసు పుస్తకాల స్థానంలో కొత్తగా 21లక్షల పుస్తకాలను రైతులకు ఇచ్చేందుకు క్యాబినెట్ నిర్ణయించింది. అలాగే గత ప్రభుత్వం 77లక్షల సర్వేరాళ్లపై ముద్రించిన ఫొటోలను చెరిపి వాటిని వినియోగించుకునే విషయం పైనా చర్చసాగింది. విజన్ 2047 రూపకల్పనపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ఏపీలో కొత్త మద్యం పాలసీ తెచ్చే అంశంపైనా క్యాబినెట్ ముందుకు ప్రతిపాదనలు వచ్చాయి. ఉచిత ఇసుక విధానాన్ని సులభతరం చేసేందుకు తీసుకునే నిర్ణయాలపైనా క్యాబినెట్‌లో మంత్రులు, ముఖ్యమంత్రి చర్చించారు.

# నేరుగా ఇంటికి చేరుకున్న కవిత

- తల్లిని ఆలింగనం చేసుకుని కన్నీటి పర్యంతం
- ఓదార్చిన బంధువులు.. సన్నిహితులు
- అన్న కెటిఆర్‌కు రాఖీ కట్టిన కవిత
- ఫామ్‌హౌజ్‌లో తండ్రి కెసిఆర్‌ను కలవనున్న కవిత



**హైదరాబాద్,ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):** ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో తీహార్ జైలు నుంచి విడుదలై హైదరాబాద్ చేరుకున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత నేరుగా హైదరాబాద్‌లోని తన నివాసానికి చేరుకున్నారు. ఇంటి వద్ద కవితకు దిష్టి తీసి అభిమానులు ఇంట్లోకి ఆహ్వానం పలికారు. ఇక బంధువులు, కుటుంబ సభ్యులు పూల వర్షం కురిపించి కవితకు ఘన స్వాగతం పలికారు. ఇంట్లోకి వెళ్లిన తర్వాత నేరుగా పూజ గదికి వెళ్లి దేవుళ్లకు దండం పెట్టుకున్నారు. కవితను కలిసిన వెంటనే తల్లి శోభ, ఇతర కుటుంబ సభ్యులు ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. తల్లి శోభమ్మ పాదాలకు నమస్కరించి కవిత ఆశీర్వాదం తీసుకున్నారు. కూతురిని ఆప్యాయంగా హత్తుకున్నాక తల్లి శోభ కన్నీటి పర్యంతమ య్యారు. తల్లిని పట్టుకుని కవిత కూడా ఏడ్చారు. కుటుంబ సభ్యులు ఓదార్చారు. ఇక తన సోదరుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు ఆమె రాఖీ కట్టారు. ఢిల్లీ నుంచి శంషాబాద్‌కు చేరుకున్న కవితకు గులాబీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. ఈ సందర్భంగా గులాబీ నేతలు, కార్య కర్తలు కవితపై పూలవర్షం కురిపించగా.. పార్టీ శ్రేణులకు కవిత అభివాదం చేశారు. పడికిలి బిగించి జై తెలంగాణ అంటూ నినదించారు. కార్యకర్తల జై తెలంగాణ నినాదాలతో ఎయిర్‌పోర్ట్ దద్దరిల్లింది. ఐదునెలల తర్వాత కవిత హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, భర్త అనిల్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నేతలు ఉన్నారు. కవిత ఎయిర్‌పోర్ట్ నుంచి ర్యాలీగా బంజారాహిల్స్‌లోని తన నివాసానికి చేరుకున్నారు. గురువారం ఎర్రవెల్లిలోని ఫామ్ హౌస్ చేరుకొని తండ్రి, కేసీఆర్‌ను కలుసుకోనున్నారు.

# బెంగాల్ తగలబడితే..మీకూ నష్టమే

## అసోం తదితర రాష్ట్రాలను హెచ్చరించిన మమత

**కోల్‌కతా,ఆగస్టు 28:** కోల్‌కతాలో 31 ఏళ్ల వైద్యురాలి అత్యాచారం, హత్య ఘటన పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీని, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) సర్కార్‌ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర పోలీసుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని సాక్ష్యాత్తు కలకత్తా హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇదిలా ఉంటే ప్రతిపక్ష పార్టీ బీజేపీ మమతా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తోంది. న్యాయం చేయాలని అక్కడి ప్రజలు చేస్తున్న ఆందోళనల్ని పోలీసులతో అణిచివేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుండటంపై బెంగాల్ ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. ఇదిలా ఉంటే, తృణమూల్ విద్యార్థి విభాగం స్థాపించిన రోజుని పురస్కరించుకుని జరిగిన కార్యక్రమంలో మమతా బెనర్జీ ప్రతిపక్షాలకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. బెంగాల్‌లో అశాంతి ఇతర రాష్ట్రాలకు కూడా తీవ్ర పరిణామాలు కలిగిస్తుందని హెచ్చరించారు. 'గుర్తుంచుకోండి బెంగాల్ తగలబడితే, అస్సాం, బీహార్, జార్ఖండ్, ఒడిశా, ఢిల్లీ కూడా తగలబడుతాయి' అని హెచ్చరించారు. శాంతి భద్రతల రక్షణలో మమతా బెనర్జీ విఫలమైందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్న తరుణంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేసింది. భారతదేశం, బంగ్లాదేశ్ మధ్య వ్యత్యాసాన్ని చూపుతూ రాష్ట్రాన్ని అస్థిరపరిచేందుకు ప్రయత్నిస్తున్నారని ఆమె ఆరోపించారు. 'కొందరు ఇది బంగ్లాదేశ్ అని అనుకుంటున్నారు, దయచేసి గుర్తుంచుకోండి, నేను బంగ్లాదేశ్‌ను ప్రేమిస్తున్నాను, వారు మనలాగే మాట్లాడతారు, మరియు వారి సంస్కృతి మనది వలె ఉంటుంది, కానీ బంగ్లాదేశ్ ఒక ప్రత్యేక దేశం, మరియు భారతదేశం ప్రత్యేక దేశం' అని ఆమె చెప్పింది. పశ్చిమబెంగాల్‌లో ప్రశాంతతను తాము కోరుకుంటున్నామని మమతా బెనర్జీ అన్నారు. అత్యాచారాలకు పాల్పడే వారికి ఉరిశిక్ష పడాల్సిందేనన్నారు. వచ్చే వారంలోనే అసెంబ్లీ సమావేశాలను ఏర్పాటు చేసి, రేపిస్టులకు మరణశిక్ష పడేలా 10 రోజుల్లో బిల్లును ఆమోదిస్తామని తెలిపారు. బిల్లును గవర్నర్‌కు పంపిస్తామని, ఆయన ఆమోదించకుంటే రాజ్‌భవన్ ఎదుట బైఠాయింపు చేపడతామని చెప్పారు. 'బిల్లు ఆమోదించాల్సిందే. ఈసారి గవర్నర్ జవాబుదారీతనం నుంచి తప్పించుకోలేరు' అని మమత స్పష్టం చేశారు. 'టీఎంసీ ఈవెంట్‌ను ఆర్‌జీ కర్ డాక్టర్‌కు అంకితం చేస్తున్నాం. మేము న్యాయం కోరుకుంటున్నాం. కానీ బీజేపీ ఈరోజు బంద్‌కు పిలుపునిచ్చింది. వాళ్లు న్యాయం కోరుకోవడం లేదు.

# ఉడాయ్‌కి కేంద్రం ఆదేశాలు

(మొదటిపేజీ తరువాయి)

వివరాలను అన్‌బ్లాక్ చేయాలని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఉడాయ్‌ని ఆదేశించింది. ఈ మేరకు రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా కార్యాలయం బుధవారం దీనిపై ఉత్తర్వులు జారీ చేసింది. జాతీయ పౌర నమోదు అప్‌డేషన్ ప్రక్రియలో భాగంగా 2019 ఫిబ్రవరి–ఆగస్టు మధ్యలో ఈ 9.35లక్షల మంది బయోమెట్రిక్ వివరాలను ఉడాయ్ లాక్ చేసింది. ఆధార్ కార్డు జారీకి వీరు అర్హులేనా కాదా? అనేది తెలుసుకునేందుకు అప్పట్లో ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, వీరి వివరాలను అన్‌బ్లాక్ చేయాలని గత కొంతకాలంగా అస్సాం ప్రభుత్వం, సీఎం హిమంత బిశ్వ శర్మ కేంద్రాన్ని కోరుతున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల సొలిసిటర్ జనరల్ ఈ అంశాన్ని అధ్యయనం చేసి న్యాయశాఖకు పలు సూచనలు చేశారు. వీరికి ఆధార్ కార్డు జారీలో ఎలాంటి చట్టపరమైన అడ్డంకి లేదని ఎస్‌జీ గుర్తించారు. ఆ సూచనల మేరకు వారి బయోమెట్రిక్ వివరాలను వెంటనే అన్‌బ్లాక్ చేయాలని ఉడాయ్‌కి సూచించినట్లు రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా తమ ఉత్తర్వులో వెల్లడించింది. "ఆధార్ చట్టం ఉద్దేశాన్ని దృష్టిలో ఉంచుకుని బాధిత అస్సాం పౌరులకు విశిష్ట ప్రాధికార గుర్తింపు కార్డులు జారీ చేయాలి" అని పేర్కొంది.

# సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం..!

(మొదటిపేజీ తరువాయి)

పూజ నిర్వహించింది. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పక్రియ చేపట్టారు. వేదమంత్రాలుగా సాక్షింగా 11 గంటలకు రేవంత్ రెడ్డి భూమి పూజ నిర్వహించారు. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, అధికారులు పలుమార్లు చర్చించి సచివాలయంలో పోర్టికోకు ఎదురుగా విగ్రహం ఏర్పాటుకు నిర్ణయించారు. మెయిన్ గేట్ నుంచి భవనం లోపలకు వెళ్ళే క్రమంలో అందరికీ కనిపించేలా దాన్ని రూపొందిస్తున్నారు. అక్కడే ఇవాళ భూమి పూజ జరిగింది. దీన్ని శరవేగంగా డిసెంబర్ 9 నాటికి పూర్తి చేయాలి ప్రభుత్వం సంకల్పించింది. 2009లో డిసెంబర్ 9న అప్పటి కేంద్ర హోంమంత్రి చిదంబరం తెలంగాణ ఇస్తున్నట్టు ప్రకటించారు. అందుకే ఆ తేదీన విగ్రహావిష్కరణ చేయాలని నిర్ణయించారు. జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఆర్టిస్టులు, తెలంగాణకు చెందిన కళాకారులు రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహాలను పరిశీలించిన తర్వాత ఫైనల్ విగ్రహాన్ని ఖరారు చేయనున్నారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే ఉంటుందంటున్నారు. విగ్రహం తెలంగాణ సంస్కృతి చాటి చెప్పేలా ఉంటుందని చెబుతున్నారు. తెలంగాణ ప్రజల దయాగుణం, త్యాగనిరత, మహిళల రూపం అన్నీ కలిసేలా రూపొందించనున్నారు. దసరా వరకు మంచిరోజులు లేవని వేదపండితులు చెప్పడంతోనే ఇప్పుడు హడావుడిగా భూమిపూజ కార్యక్రమం నిర్వహించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సంకల్పం, పట్టుదల ఉంటే సాధ్యం కానిది ఉండదని తెలంగాణ ఉద్యమకారులు నిరూపించారన్నారు. సోనియమ్మ మాట ఇస్తే అది శిలాశాసనమని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నిరూపిచిందని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసి ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చారని గుర్తు చేశారు. పదేళ్లు పరిపాలన చేసిన వారు తెలంగాణ తల్లిని తెరమరుగు చేశారని విమర్శించారు. నేనే తెలంగాణ.. తెలంగాణనే నేను అనే విధంగా గత పాలకులు వ్యవహరించారని ధ్వజమెత్తారు.

# ఇక వేగంగా పోలవరం పనులు..

(మొదటిపేజీ తరువాయి)

విడుదల చేయనుంది. ఈ మేరకు కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. పోలవరానికి సంబంధించి ఇది పెద్ద విజయంగా భావించాలి. దీంతో ఇక ప్రాజెక్ట్ పనుల్లో వేగం పుంజుకోనుంది. 2014 –19 మధ్య పరుగులు పెట్టిన పోలవరం ప్రాజెక్టు తర్వాత ఆగిపోయింది. ఐదేళ్ల సమయం వృధా అయింది. రివర్స్ టెండర్లకు వెళ్లి కాంట్రాక్టర్లను మార్చడంతో పనులు ఆగిపోయాయి. గైడ్ బండ్ కుంగిపోయింది. డయాఫ్రంవాల్ కూడా దెబ్బతిన్నది. చంద్రబాబు మళ్లీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పోలవరాన్ని ఎలా గట్టెక్కించాలా అన్నదనిపై విస్తృతంగా చర్చలు జరిపారు. ఉన్నతాధికారులతో అంచనాలు వేశారు. తర్వాత పలుమార్లు కేంద్రాన్ని కలిసి ప్రాజెక్టు స్థితిగతులపై వివరించారు. డీపీఆర్‌ను ఆమోదించాలని.. తక్షణం పనుల కొనసాగింపులకు రూ. 12500 కోట్లను విడుదల చేయడంతో పాటు పాత బిల్లులు రీఎంబర్స్ చేయాలని కోరారు. కేంద్రం తాజా కేబినెట్ భేటీలో ఆ మేరకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విభజన చట్టంలో భాగంగా పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం జాతీయ హోదా ఇచ్చింది. సాధారణంగా జాతీయ హోదా ప్రాజెక్టుల్లో 90 శాతం కేంద్రం.. పది శాతం రాష్ట్రం పెట్టుకుంటాయి. అయితే తర్వాత ప్రత్యేక ప్యాకేజీలో భాగంగా ఆ పది శాతం కూడా తామే పెట్టుకుంటామని కేంద్రం హామీ ఇచ్చింది. ఈ మేరకు ముందుగా ప్రభుత్వం పనులు చేయించి బిల్లులు పెడితే.. కేంద్రం మంజూరు చేస్తూ వస్తోంది. గత ఐదేళ్లుగా ఈ బిల్లింగ్ సైకిల్ గాడి తప్పింది. పనులేమీ చేయకపోవడంతో పెద్దగా బిల్లులు రావాల్సిన అవసరం లేకపో యింది. అయితే ఇప్పుడు ప్రాజెక్టును గాడిన పెట్టాలనుకున్న చంద్రబాబు.. పలుమార్లు కేంద్ర మంత్రులని కలిసి విజ్ఞప్తి చేశారు. దీంతో ప్రధాన మంత్రి కార్యాయం ఆదేశాల మేరకు ఆర్థికశాఖ పోలవరం నిధుల విషయాన్ని మంత్రిమండలి ముందు ఉంచింది. పోలవరం తొలి దశకు అవసరమయ్యే పూర్తి నిధులను అంచనా వేసి పోలవరం డీపీఆర్‌ను రూపొందించడంతో.. అవసరమయ్యే పూర్తి నిధులకు పలు స్థాయిలలో ఆమోదముద్ర వేశారు. ఇప్పుడు కేంద్ర మంత్రిమండలి ఆమోదిస్ంచినందున వెంటనే నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది. పోలవరం ప్రాజెక్టుకు ప్రత్యేకంగా బడ్జెట్లో నిధులు కేటాయించడం లేదు. 2016 తర్వాత నాబార్డుతో కేంద్రం ఒప్పందం కుదుర్చుకుంది. పోలవ రంకు అయ్యే ఖర్చు నాబార్డు ఇస్తుంది. అయితే కేంద్రానికి రుణం రూపంలో ఇస్తుంది.. అది ఏపీరాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తోంది. దీంతో పోలవరం ప్రాజెక్టుకు ఇవ్వబోయే 12 వేల కోట్ల రూపాయలకు పైగా నిధులను అడ్వాన్స్‌గా ఇవ్వాలని కోరుతున్నారు. ఆ నిధులు వస్తే ఆర్థికంగా వెసులుబాటు ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

# ఆందోళనకరంగా రోడ్డు ప్రమాదాలు

## కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆందోళన

**న్యూఢిల్లీ,ఆగస్టు 28 :** పెద్ద సంఖ్యలో రోడ్డు ప్రమాద మరణాలపై కేంద్రమంత్రి గడ్కరీ ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. యుద్ధాలు, ఉగ్రవాదం, నక్సలిజం ఘటనల్లో మరణాల కంటే రోడ్డు ప్రమాదాల్లోనే మృతుల సంఖ్య ఎక్కువగా ఉందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. దేశంలో ఏటా లక్షల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటు న్నాయన్న ఆయన.. రోడ్డు ఇంజినీరింగ్‌లో లోపాల కారణంగానూ అనేక యాక్సిడెంట్లు జరుగుతున్నాయన్నారు. ఫిక్కీ రోడ్ సేఫ్టీ అవార్డ్స్, కాంక్లేవ్ 2024లో పాల్గొన్న గడ్కరీ ఈ విధంగా వ్యాఖ్యానించారు. 'యుద్ధాలు, ఉగ్రవాదం, నక్సలిజం ఘటనల్లో కంటే రోడ్డు ప్రమాదాల్లోనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారు. దేశంలో ఏటా 5 లక్షల రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటు న్నాయి. 1.5 లక్షల మంది మరణిస్తున్నారు. మూడు లక్షల మంది గాయపడుతున్నారు. తద్వారా దేశ జీడీపీకి 3శాతం నష్టం వాటిల్లుతోంది. రోడ్డు ప్రమాదాలకు డ్రైవర్లను బలిపశువులను చేస్తారు.. కానీ, రోడ్డు ఇంజినీరింగ్‌లోనూ (డీపీఆర్) లోపాలున్నాయి' అని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. దేశంలోని అన్ని హైవేలకు సేఫ్టీ ఆడిట్ నిర్వహించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే.. లైనులో వెళ్లే క్రమశిక్షణ పాటించాలన్నారు. అంబులెన్సులు, వాటి డ్రైవర్లకు ప్రత్యేక కోడ్‌లను ఇచ్చేందుకు తమ మంత్రిత్వశాఖ సిద్ధమవుతోందని అన్నారు. కట్టర్ల వంటి అధునాతన పనిముట్లను వాడకంలో వారికి శిక్షణ ఇస్తామన్నారు.

# సొంత పార్టీలోనే ట్రంప్‌కు భారీ షాక్

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ మద్దతు దారులే ట్రంప్‌ను వ్యతిరేకించడం ఇదేమీ తొలిసారి కాదు. అంతకు ముందు 2020 నాటి అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ పోటీ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. జార్జ్ డబ్ల్యు బుష్‌తో పాటు ఆయన మద్దతు దారులు డొనాల్డ్ ట్రంప్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేశారు. తాజాగా మరోసారి ట్రంప్‌కు వ్యతిరేకంగా తీర్మానించారు. కమలా హారిస్‌కు మద్దతిస్తూ జార్జ్ డబ్ల్యూ బుష్ మద్దతు దారులు, రిపబ్లికన్ పార్టీ నేతలు రాసిన బహిరంగ లేఖలో..ట్రంప్ తిరిగి రెండోసారి ఎన్నుకుంటే దేశానికి విపత్తు అని తోటి రిపబ్లికన్‌లను హెచ్చరించారు. నిజమే, ట్రంప్ అధ్యక్షుడిగా ఉంటే ప్రజాస్వామ్యాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీస్తారు ప్రతి ఒక్కరూ అంచనా వేస్తున్నారు' అని లేఖలో పేర్కొన్నారు. అంతేకాదు రాష్ట్రాలను బలోపేతం చేసేందుకు జార్జ్ హెచ్‌డబ్ల్యూ బుష్ మద్దతుదాలందరం ఒక్కటవుతాం. ఈ ఏడాది నవంబర్‌లో అధ్యక్ష ఎన్నికల్లో బరిలో ఉన్న డెమోక్రాట్ల అభ్యర్థి కమలా హారిస్ ఓట్లు వేస్తున్నామని లేఖలో తెలిపారు. కమలా హారిస్‌తో మాకు విధాన పరమైన విభేదాలు ఉన్నాయని అంగీకరిస్తూనే.. ఆమెకు ప్రత్యామ్నాయంగా, ఆ స్థాయిలో దేశానికి సేవ చేసే నేతలు లేరని స్పష్టం చేస్తున్నారు రిపబ్లికన్ పార్టీ నేతలు..

# కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

కల్పించనున్నట్లు తెలిపారు. ఈ పారిశ్రామిక నగరాలు ఉత్తరాఖండ్‌లోని ఖుర్పియా, మహారాష్ట్రలోని డిఘీ, పంజాబ్ లోని రాజ్పుర– పటియాల, కేరళలోని పాలక్కాడ్, ఉత్తరప్రదేశ్ లోని ఆగ్రా , తెలంగాణలోని జహీరాబాద్, ఆంధ్రప్రదేశ్లోని ఓర్వకల్– కొప్పర్తి, బీహార్ లోని గయ, రాజస్థాన్ లోని జోధ్పూర్ సిటీలను స్మార్ట్ సిటీలుగా ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టు కోసం ప్రభు త్వం 28, 602 కోట్లు పెట్టుబడి పెడుతుందని తెలిపారు. దీంతోపాటు 6,456 కోట్ల అంచనా వ్యయంతో 296 కిలోమీటర్ల పొడవు ఉన్న మూడు ప్రధాన రైల్వే మౌలిక సదుపాయాల ప్రాజెక్టుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇక కడప జిల్లా కొప్పర్తి, ఓర్వకల్లులో భారీ పారిశ్రామిక హబ్ లు వస్తున్నాయని వెల్లడించారు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్. కొప్పర్తి హబ్ లో 54 వేల మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. అలాగే ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ ద్వారా 45 వేల మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు.

# 100 రోజుల్లో 70 వేల గృహాలు పూర్తి చేయాలి

**అన్ని లేఅవుట్లలో గృహ నిర్మాణ పనులు జరగాలి**
**కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్**



**విశాఖపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):**జిల్లాలోని అన్ని లేఅవుట్లలో గృహ నిర్మాణ పనులు జరగాలని, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సంబంధిత గుత్తేదారులు, అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో గృహ నిర్మాణాల ప్రగతిపై గుత్తేదారులు, ఈఈలు, డి ఇఇ, సహాయ ఇంజినీర్లతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా గుత్తేదారులు, అధికారుల వారీగా సాధించిన ప్రగతిని కలెక్టర్ అడిగి తెలుసు కున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 100 రోజుల్లో 70 వేల గృహాలు పూర్తిచేసేలా ప్రణాళికలు రచించడం జరిగిందని అన్నారు. ఇందుకు ప్రతి వారం 10 వేల ఇళ్లు పూర్తికావాల్సి ఉండగా, ఆశించిన మేర పనులు జరగడం లేదన్నారు. జిల్లాలో ఇసుక కొరత లేదని, సిమెంట్ సమస్య కూడా తీరబోతుందని అన్నారు. పూర్తి చేసిన పనులకు సంబంధించిన నిధులు కూడా మంజూరు అవుతున్నాయని కలెక్టర్ గుత్తేదారులకు వివరించారు. కావున గుత్తేదారులు ఇళ్ల నిర్మాణపు పనులు మరింత వేగవంతం చేయాలని, అందుకు తగిన విధంగా లేబర్ ను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ నిర్దేశిత లక్ష్యాలను నిర్దేశించుకొని, ప్రణాళికబద్ధంగా గృహాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ హితవు పలికారు.వచ్చే సమావేశానికి జిల్లాలో ఘననీయంగా ప్రగతి కనిపించాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ కార్య నిర్వాహక ఇంజినీర్ జి.సత్యనారాయణ, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లు సీతారామ్,కె.వి.సూర్యరావు,వి.రామకృష్ణ, సహాయక ఇంజినీర్లు, వర్క్ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖలో నేడు జాతీయ స్థాయి ఆర్థిక సదస్సు

**ఇంప్లిమెంటేషన్ పేరుతో వర్క్‌షాప్‌లో**
**కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**



**విశాఖపట్టణం, ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):** విశాఖపట్టణం వేదికగా గురువారం 29న సర్క్యులర్ ఎకానమీ - పాలసీ టు ఇంప్లిమెంటేషన్ పేరుతో జాతీయ స్థాయి వర్క్ షాప్ జరుగుతుందని, ఈ మేరకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. సెమినార్‌లో వివిధ రంగాల నిపుణులు, సంస్థల ప్రతినిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు సుమారు 150 మంది భాగస్వామ్యం అవుతారని వెల్లడించారు. సదస్సు స్థానిక నోవాటెల్ హోటల్‌లో ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు జరుగుతుందని తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్, క్లైమేట్ చేంజ్ కార్యదర్శి లీనా నందన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్, మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్, క్లైమేట్ చేంజ్ అదనపు కార్యదర్శి నరేష్ పాల్ గాంగ్వార్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(పర్యావరణం, అటవీ, సైన్స్, టెక్నాలజీ) అనంత రాము తదితరుల అధ్యక్షతన సదస్సు కొనసాగుతుందని వివరించారు. ఎక్కడా ఎలాంటి లోపాలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బుధవారం స్థానిక నోవాటెల్ వి-ఫంక్షన్ హాలులో జేసీ కె. మయూర్ అశోక్‌తో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశంలో సెమినార్ నిర్వహణ, ఇతర కార్యకలాపా లపై అధికారులకు జిల్లా కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన సెమినార్ కావున అందరూ అప్రమత్తంగా ఉంటూ సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. దేశం నలుమూలల నుంచి వచ్చే అతిథులకు, వివిధ రంగాల నిపుణులకు సంప్రదాయ బద్ధంగా ఆహ్వానం తెలపాలన్నారు. ఈ క్రమంలో అక్కడకు చేరుకున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(పర్యావరణం, అటవీ, సైన్స్, టెక్నాలజీ) అనంత రాము అధికారులకు కొన్ని సూచనలు చేశారు. అందరూ సమన్వయంతో వ్యవహరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**చనిపోయిన తర్వాత**

# ప్రపంచాన్ని చూడొచ్చు



**విశాఖపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):**నేత్రదానం చేయడం ద్వారా చనిపోయిన తర్వాత కూడా ప్రపంచాన్ని చూడొచ్చుని, నేత్ర వైద్య నిపుణులు అంటున్నారు. 9వ జాతీయ నేత్ర దాన పక్షోత్స వాలలో భాగంగా జిల్లా అంధత్వ నివారణా సంస్థ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ వీ.మీనాక్షి ఆధ్వర్యంలో బుధవారం నాడు ద్వారక బస్ స్టాండ్లో ప్రయాణీకులకు నేత్ర దానం ఆవశ్యకత అవగాహన పెంచేలా కర పత్రాలు పంపిణీ చేశారు. నేత్ర దానం ఎవరు చెయ్యాలి ఎలా చైయ్యలో వివరిస్తూ వారికి నేత్ర దానంపై ఉన్న అపోహలను తొలగించేలా ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్య శాల సిబ్బంది ఐ డొనేషన్ కౌన్సిలర్‌లుచే ప్రయాణికులకికి అవగాహన కల్పించారు నేత్ర దానం ఆవశ్యకత గురించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐ డొనేషన్ కౌన్సిలర్‌లు పూర్ణిమ సుజాత, ఇతర టీచర్స్ పాల్గొన్నారు.

# ప్రజా సేవల్లో అధికారులు నిర్లక్ష్యం

**సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మత్స్య లింగం ఆగ్రహం**

**సమావేశానికి హాజరుకాని అధికారులకు మెమోలు జారీ చేయాలని ఎంపీడీవోకు ఆదేశాలు**



**డుంబ్రిగుడ, ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):**స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బి.ఈశ్వరి అధ్యక్షతన ఎంపీడీవో ఉషారాణి పర్యవేక్షణలో జడ్పిటిసి, ఎంపిటిసి సర్పంచ్లకు సంబంధిత ప్రభుత్వ అధికారుల సమన్వయంతో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా అరకు నియోజకవర్గం శాసనసభ్యులు రేగం. మత్యలింగం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు ప్రభుత్వ అధికారులు ప్రజలకు అందించే సేవలను నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.

ప్రతి ఒక్క ఉద్యో గి బాధ్యతగా పనిచేస్తూ ప్రజల నుంచి మన్నాలు పొందాలని సూచించారు.ముఖ్యంగా గిరిజన ప్రాంతంలో విద్య,ఆరోగ్యంపై సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్య రంగంలో చూసుకుంటే ఈ ఏడాది మరింత దిగజారిందని అసహనం వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి 23 శాఖలకు సమాచారం అందించగా 13 శాఖల అధికారులు మాత్రమే హాజరు కావడం నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు.

హాజరైన అధికారుల నుంచి వివరణ తీసుకుని, అనంతరం హాజరుకాని అధికారులకు తక్షణమే మెమోలు జారీ చేయాలని ఎంపీడీవోకు ఆదేశాలిచ్చారు. సమావేశానికి హాజరైన అధికారులు ఒక్కొక్కరు పరిచయమవుతూ జరుగుతున్న పనుల గురించి ప్రజా ప్రతినిధులకు ప్రజెంటేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి జానకమ్మ, తహసిల్దార్ నాగమ్మ ,వైస్ ఎంపీపీ ఆనంద్, 18 పంచాయతీల సర్పంచులు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

**గిరిజన సంఘం ఆధ్వర్యంలో**

# మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



**డుంబ్రిగుడ,ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):** మండలంలో గల రంగిలిసింగి పంచాయితీ పరిధిగల కింజేరు, కుజ బంగి, బెడ్డగూడ, కూడబీరు, గ్రామంలో గిరిజను లకు గిరిజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం మెగా వైద్య శిబిరం నిర్వ హించారు. ఈ శిబిరానికి సుమారు 150 మందినీ డాక్టర్ పి. రాంబాబు దగ్గు, జలుబు,జ్వరంతో బాధపడుతున్న రోగుల కు వైద్య పరీక్ష నిర్వహించి ఇంజక్షన్, షిల్లన్ బాటిల్ ఎక్కించి మందులు అందజేశారు.అనంతరం రోగులకు ఆరోగ్య సలహా సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గిరిజన సంఘం నాయకులు పి.మోహన్ దాస్, డుంబు, దాసు, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.



**నేడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు**

# 161వ జయంతి

**జగ్గయ్యపేట,ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):**తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా రసమయి సాహితీ సమితి జగ్గయ్యపేట వారి ఆధ్వర్యంలో జగ్గయ్యపేట పట్టణస్థాయివ్యాసరచన వక్తృత్వం శతక పద్యాల పోటీలు నిర్వహించబడినాయి. పట్టణానికి చెందిన వివిధ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. **వ్యాసరచన పోటీ విజేతలు:** పీ.కీర్తి 10వ తరగతి విజేత స్కూల్. బి.తరుణ్ కుమార్ 9వవిజ్ఞాన్ స్కూల్. సాత్విక 9వ తరగతి శ్రీ మేధా స్కూల్. వ్యాసరచన జూనియర్స్. షేక్ జోయా 7వతరగతి. శ్రీ మేధాస్కూల్. బి.వర్షిత్ 8వ తరగతి విజ్ఞాన్ స్కూల్. టీ.ధృతిక 7వ తరగతి నారాయణ స్కూల్. కే కీర్తి 7వ తరగతి విజేత స్కూల్, వక్తృత్వ పోటీ విజేతలు సీనియర్స్ వై.భవ్య సత్య శ్రీ 9వ తరగతి విజ్ఞాన్ స్కూల్. సాత్విక 9వ తరగతి శ్రీ మేధాస్కూల్ మేని మేఘ్నా 10వ తరగతి నారాయణ స్కూల్. జూనియర్ విజేతలు మనోజ్ఞ 6వ తరగతి శ్రీ మేధాస్కూల్ వై.కీర్తన 7వ తరగతి విజ్ఞాన్ శ్రీరామ్ ధనుంజయ్ 8వ తరగతి విజేత స్కూల్ శతక పద్యాల పోటీ లు సీనియర్స్ పి పావని 9వ తరగతి విజ్ఞాన్ ఎస్.కె నసీమా 10వతరగతి విజ్ఞాన్ జూనియర్ విజేతలు పి.మల్లేశ్వరి 6వ తరగతి కే అగ్రహారంపి.శ్రావణి 6వ తరగతి కేగ్రహారం ఐశ్వర్య 6వతరగతి విజ్ఞాన్ స్కూల్ శ్రీలత 6వ తరగతి అగ్రహారం స్కూల్ ఈ కార్యక్రమంలో రసమయి సాహితి సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రముఖ కవి రచయిత దోసపాటి నాగేశ్వరరావు ఉపాధ్యాయునులు ఏలూరి ఆశ, సురుగుల త్రివేణి, ప్రకాష్ రామయ్య పాల్గొన్నారు. గ్రంథాలయ సిబ్బంది ఆలేటి ప్రభ శ్యామల రమేష్ సత్యవతి రాము తదితరులు పాల్గొన్నారు. విజేతలకు నేడు ఉదయం 10:30 గంటలకు స్థానిక శాసనసభ్యులు రాం రాజగోపాల్ చేతులమీదుగా ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయం జగ్గయ్యపేట నందు బహుమతి ప్రధానోత్సవం చేయబడును.

**జగన్మోహన్ రెడ్డి కరెంటు కష్టాలు,**

# లక్షల కోట్ల భారం




**అనకాపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):**జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల్లో ఓడిపోతూ కూడా ప్రజలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారని మెగావాట్లు సౌర విద్యుత్ కొనుగోలుకు లక్ష కోట్లకు పైగా భారం ప్రజలు కట్టే విధంగా నిర్ణయాలు చేశారని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు జగన్ చర్యలపై విరుచుకుపడ్డారు. జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర ముఖ్య మంత్రి హోదాలో విద్యుత్ రంగంపై తీసుకున్న నిర్ణయాల పర్యవసాలను రాష్ట్ర ప్రజలపై ఈ ఏడాది నుంచి చెవి చూడబోతున్నారని, జగన్ రెడ్డి ప్రజలపై ఒకటి రెండేళ్ళు కాదు పదేళ్లు కాదు ఏకంగా పాతికేళ్ళ భారం మోపి ప్రజలు చిత్కారంతో వెళ్లిపోయారని వెంకటరావు ఎద్దేవా చేశారు. యాట 7000 మెగావాట్లు విద్యుత్తు కొనడానికి సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, రాష్ట్ర డిస్కంలు, రాష్ట్ర ప్రభుత్వం 2021లో త్రైపాక్షిక విద్యుత్ కొనుగోలు ఒప్పందం పిపిఏ కుదుర్చుకున్నారని, యూనిట్ 2.49 రూపాయల చొప్పున అతి చౌక ఒప్పందం చేసుకున్నామని ఆనాడు గొప్పలు చెప్పారని, సెకీతో యూనిట్ రూ.2.49 చొప్పున ఒప్పందం చేసుకున్న కొద్ది నెలలకే యూనిట్ రూ 1.99 చొప్పున కొనేందుకు గుజరాత్ వంటి రాష్ట్రాలు ఒప్పందం చేసుకున్నాయని, ట్రాన్స్మిషన్ ఛార్జీలు ఉండవని జగన్ చెప్పిన మాట పచ్చి అబద్ధమని తేలిపోయిందని వెంకటరావు అన్నారు. తెలుగుదేశం పార్టీ అనుబంధ సంస్థ నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ మాట్లాడుతూ సెకీతో ఒప్పందం వల్ల యూనిట్‌కు రూ.2.49తో పాటు రదనంగా 80 పైసలు వీలింగ్ చార్జీలు కలుపుకుంటే యూనిట్ ధర రూ 3.49కు చేరుతుందని, ఈ భారం ఏటా రూ 4350 కోట్లు అని సీఎం చంద్రబాబు నాయుడు గత నెలలో విద్యుత్ రంగంపై విడుదల చేసిన శ్వేత పత్రంలో పేర్కొన్నారని, అదనంగా మెగావాట్‌కు రూ.50 లక్షల చొప్పున నెట్ వర్క్ చార్జీ కూడా పడుతుంన్నారు. మొత్తంగా ఒప్పందం కుదుర్చుకున్న 25 సంవత్సరాలకు రాష్ట్ర ప్రజలపై పడే మొత్తం భారం రూ.1,08,750 కోట్లకు చేరుతుందని సత్యనారాయణ పేర్కొన్నారు. ఇదే కాకుండా 5,287 మెగావాట్ల పవన్ విద్యుత్ 12,075 మెగావాట్ల సౌర విద్యుత్తు, 17,859 మెగావాట్ల పంపు స్టోరేస్ జల విద్యుత్ ఉత్పత్తి జగన్ తన అస్మదీయులకు అప్పగించారని, వారికి లక్షల కోట్ల విలువైన భూములు కట్టబెట్టారన్నారు.

**రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 90 సంవత్సరాలు పూర్తి అయిన సంధర్బంగా**

# దేశ వ్యాప్తంగా క్విజ్ పోటీలు



**మునగపాక, ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపించి 90 సంవత్సరములు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా ఆన్ లైన్‌లో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నారని, అందులో భాగంగా మన జిల్లాలో కూడా డిగ్రీ చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు అందరూ దరఖాస్తు చేసుకోవచ్చుని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్ ను బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఒక కళాశాల నుండి ఎంతమంది విద్యార్థులైనా ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చుని తెలిపారు. అదే విధంగా ఏ కళాశాల నుండైనా విద్యార్థులు పాల్గొనవచ్చుని అన్నారు. ముందుగా కళాశాల పేరు https://www.rbi90quiz.in/ నందు రిజిస్టర్ కాబడినది, లేనిది చూసుకోవాలని, లేని యెడల రిజిస్టర్ చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఒక టీమ్‌గా ఏర్పడి క్విజ్ పోటీలలో రిజిస్టర్ చేసుకోవాలని, టీమ్ నందు కనీసం ఇద్దరు విద్యార్థులు ఉండేలా చూసుకోవాలన్నారు. స్టేట్ రౌండ్ లో మొదటి ప్రైజ్ 2 లక్షలు, రెండవ ప్రైజ్ లక్షా యాభై వేలు, మూడవ ప్రైజ్ లక్ష రూపాయలు మరియు జోనల్ రౌండ్ లో మొదటి ప్రైజ్ 5 లక్షలు, రెండవ ప్రైజ్ 4 లక్షలు, మూడవ ప్రైజ్ 3 లక్షలు మరియు నేషనల్ ఫైనల్ రౌండ్ లో మొదటి ప్రైజ్ 10 లక్షలు, రెండవ ప్రైజ్ 8 లక్షలు, మూడవ ప్రైజ్ 6 లక్షలు ఉంటాయని తెలిపారు. అనకాపల్లి జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ లను సెప్టెంబర్ 17వ తేదీ లోపు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. దరఖాస్తు రిజిస్ట్రేషన్ కొరకు ఎటువంటి రుసుమును చెల్లించిన అవసరం లేదని పూర్తి ఉచితమని తెలుపుతూ, ఈ అవకాశాన్ని డిగ్రీ చదివే విద్యార్థిని విద్యార్థులు వినియోగించుకోవాలని ఆకాంక్షించారు.




ఆటోనగర్ టెక్నీషియన్ అసోషియోషన్ అధ్యక్షులుగా 872 ఎన్నికల్లో వరుసగా నాలుగవసారి ఘనవిజయం సాధించిన రాజనాల(బాబ్జీ),ని సన్మానించిన వెంకటరామారావు, బేతు రామమోహనరావు

**ఖరీఫ్ 2024-25 ధాన్యం సేకరణకు**

# ముందస్తు కార్యాచరణ

**మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం**

**అక్టోబర్ ఒకటికి ఈ క్రాప్, ఈ పంట నమోదు పూర్తి కావాలి**

**కొనుగోలు కేంద్రాలలో మౌలిక సదుపాయాలు సిద్ధం చేసుకోవాలి**

**కలెక్టర్ పి.ప్రశాంతి**



**రాజమహేంద్రవరం,ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):**రైతులకు కనీస మద్దతు ధరను అందించడమే లక్ష్యంగా వారి తరపున ఆలోచన చేసి వారి అభీష్టంను అనుసరించి మిల్లులకు పంపడం, అదే క్రమంలో మిల్లు యొక్క సామర్థ్యం మేరకు మిల్లర్లకు లక్ష్యాలు ఇవ్వడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలియ చేశారు. బుధవారం కలక్టరేట్ సమావేశ మందిరంలో ఖరీఫ్ ధాన్యం సేకరణపై సమన్వయ శాఖల, మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులతో కలెక్టరు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించి మిల్లుల వారీగా నిర్దేశించిన ధాన్యం సేకరణ వివరాలు అసోసియేషన్ ప్రతినిధులకు ముందస్తుగా తెలియచెయ్యడం జరుగుతుందన్నారు. ఆయా మిల్లుల సామర్థ్యం అనుసరించి లక్ష్యాలను ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ధాన్యం సేకరణ సంబంధించి పౌర సరఫరాల శాఖతో పాటు రెవిన్యూ యంత్రాంగం కూడా భాగస్వామ్యం కావాలని ఆదేశించారు. మండల అభివృద్ధి అధికారులు కూడా బాధ్యతలు చేపట్టాలని, మండల ప్రత్యేక అధికారులు కూడా క్షేత్ర స్థాయిలో పరిశీలించి, వాస్తవంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో గన్ని బ్యాగులను గుర్తించి నిర్ధారణ చేసుకోవాలని ఆదేశించారు. రైతులకి కనీస మద్దతు ధర కల్పించడమే ప్రభుత్వం యొక్క ప్రాథమిక బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. మిల్లర్లు బ్యాంక్ గ్యారెంటీలను అందజేయాలని పేర్కొన్నారు. ధాన్యం సేకరణ కోసం వినియోగించే వాహనాలకు జిపిఎస్ ట్రాకింగ్ సౌకర్యం ఉండేలాగా రవాణా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైస్ మిల్లు వద్ద ఎక్కువ సమయం వాహనాలు వేచి ఉండే అవకాశం లేకుండా ఆయా మిల్లర్లు తగిన ఏర్పాట్లను చేసుకోవాలని, హమాలీలను తగినంతగా సిద్ధం చేసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు మాట్లాడుతూ, ఈక్రాప్ బుకింగ్, ఈ పంట నమోదులను అక్టోబర్ ఒకటవ తేదీ లోగా పూర్తి చేయాలని అధికారులకు సూచనలు చేశారు. సమన్వయ శాఖలు ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు పరిశీలన చేయాలన్నారు. వాటిని ఆ మేరకు నిర్ధారణ చేసి నివేదిక అందజేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఆర్డీవో కేఎల్.శివ జ్యోతి, జిల్లా మేనేజర్ (పౌర సరఫరాల) టి.రాధిక, డిఎస్‌వో పి.విజయ భాస్కర్, డిసివో శ్రీరాములు నాయుడు, మార్కెటింగు ఏడిఎమ్ సునీల్ వినయ్, జిల్లా తూనికలు కొలతలు అధికారి కే.శ్యాముల్ రాజు, ఎఫ్‌సిఐ అధికారులు కేఎస్ఎన్.మూర్తి, జి.రంజి త్, తూర్పు గోదావరి జిల్లా మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు గారపాటి బాబురావు, కర్రీ వెంకట రెడ్డి, కొవ్వూరు నుంచి సుంకవల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర కేబినెట్ నిర్ణయాలతో ఏపీకి ఊరట

- ఇక రాష్ట్ర అభివృద్ధి పట్టాలెక్కుతుంది
- అభివృద్ధి దిశగా పరుగెత్తగలమన్న భరోసా
- ప్రాజెక్టులు త్వరగా పూర్తయ్యే ఛాన్స్
- మీడియాతో సీఎం చంద్రబాబు వెల్లడి




**అమరావతి, ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):** పోలవరం ప్రాజెక్టుకు రూ.12 వేల కోట్ల నిధులు, రాష్ట్రంలో 2 ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలు ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడంతో ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వానికి ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, సీఆర్ పాటిల్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఏపీకి సంబంధించిన రెండు అంశాలను కేంద్రం క్లియర్ చేసిందని, కేంద్రం చర్యలతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆశ కలుగుతోందని చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర కేబినెట్ నిర్ణయాలు ఒక నమ్మకం, భరోసా ఇస్తున్నాయని అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు రూ.12,157 కోట్లు ఇవ్వడానికి కేంద్రం అంగీకరించిందని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టును 2027 మార్చి లోగా పూర్తి చేసేందుకు షెడ్యూల్ చేశామని వెల్లడించారు. గత ప్రభుత్వం కారణంగా పోలవరం ప్రాజెక్ట్‌కు చాలా ఇబ్బందులు వచ్చాయని ఆయన విచారం వ్యక్తం చేశారు. అలాగే ఎప్పుడో పూర్తి కావాల్సిన ప్రాజెక్ట్ పెండింగ్‌లో పడిందని అన్నారు. 'ఇది మనకు గుడ్ డే.. ఇది గుడ్ బిగినింగ్' అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. నిరాశ, నిస్పృహలతో ఉన్న రాష్ట్రానికి ఇవాళ వచ్చిన సమాచారం ఊరట కలిగిస్తుందని హర్షం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్ట్ కోసం రూ.12,157 కోట్లు ఇవ్వడానికి కేంద్ర కేబినెట్ సిద్ధంగా ఉందని, 2 ఏళ్లలో ఈ నిధులను ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించిందని పేర్కొన్నారు. 'పోలవరం నిర్మాణ పనులను తేదీల వారీగా ప్రస్తావిస్తూ ఈ నిధులు ఇస్తున్నారు. మొత్తం ప్రాజెక్ట్ 2026 లోగా ప్రాజెక్ట్ పూర్తయ్యేలా ఈ నిర్ణయం ఉంది. ఈ నిర్ణయం పట్ల ప్రధాని నరేంద్ర మోడీ, నిర్మలా సీతారామన్, జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు ధన్యవాదాలు. ఈ ప్రాజెక్టుకు అంజయ్య భూమిపూజ చేశారు. వైఎస్ఆర్ రాజశేఖర్ రెడ్డి, కాంట్రాక్టర్లు వల్ల ప్రాజెక్టు ఆరంభం ఆలస్యం అయింది. మాజీ సీఎం రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డిలు టెండర్లు పిలిచినా ముందుకు సాగలేదు. అప్పుడే రాష్ట్ర విభజన జరిగింది. విభజన సమయంలో జాతీయ ప్రాజెక్టుగా పోలవరం ఇచ్చారు. 7 మండలాలతో ప్రాజెక్టుకు ఇబ్బందులు ఉంటాయని గుర్తించి కేంద్రానికి చెప్పాము. ఆర్డినెన్స్ ఇచ్చి ఆ మండలాలను ఏపీలో కలిపాకే సీఎంగా అప్పట్లో ప్రమాణం చేశాను' అని చంద్రబాబు ప్రస్తావించారు. కేంద్రం చర్యలతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్న నమ్మకం కలుగుతోందని సీఎం చంద్రబాబు అన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇకపోతే వంద రోజుల పనితీరుపై మంత్రులకు ప్రోగ్రెస్ రిపోర్టు ఇవ్వనున్నట్లు సీఎం చంద్రబాబు అమాత్యులతో అన్నారు. జనసేన మంత్రుల రిపోర్ట్ పవన్ కల్యాణ్‌కు అందజేస్తామని చెప్పారు. కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు వివాదాస్పదంగా వ్యవహరించడంపై చంద్రబాబు సీరియస్ అయినట్టు తెలిసింది. కొందరు చేసే తప్పిదాల వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని మండిపడ్డారు. కుటుంబ సభ్యుల ప్రవర్తన మితిమీరకుండా చూసుకోవాల్సిన బాధ్యత మంత్రులు.. ఎమ్మెల్యేలదే అని వెల్లడించారు. ఒకరిద్దరు చేసే తప్పిదాల వల్ల ప్రభుత్వం చేసే మంచి అంతా పోయి, నేతల తీరే హైలెట్ అవుతోందని సీఎం వ్యాఖ్యానించినట్టు సమాచారం. క్యాబినెట్ భేటీ ముగిశాక అంతర్గతంగా రాజకీయ అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చించారు. రివర్స్ టెండరింగ్ విధానంపై ముఖ్యమంత్రి, మంత్రుల మధ్య కీలక చర్చ జరిగింది. గత ప్రభుత్వం మాయ చేయడానికే రివర్స్ టెండరింగ్ విధానం ప్రవేశపెట్టిందని మంత్రులు అభిప్రాయపడ్డారు. ఇసుక పాలసీ ఇప్పుడిప్పుడే గాడిన పడుతోందని చంద్రబాబు అన్నారు.

# తిరుమలలో వేడుకగా ఉట్లోత్సవం



**తిరుమల,ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):** శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకల్లో భాగంగా తిరుమలలో బుధవారం ఉట్లోత్సవం అత్యంత వేడుకగా జరిగింది. శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో గోకులాష్టమి ఆస్థానం నిర్వహించిన మరునాడు ఉట్లోత్సవాన్ని(శిక్యోత్సవం)నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా శ్రీమలయప్పస్వామివారు బంగారు తిరుచ్చిపై, శ్రీకృష్ణస్వామి మరో తిరుచ్చిపై తిరువీధులలో ఊరేగుతూ పలు ప్రాంతాల్లో ఉట్లోత్సవాన్ని తిలకించారు. ముందుగా శ్రీమలయప్పస్వామివారు, శ్రీ కృష్ణస్వామివారి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా పెద్దజీయర్ మఠానికి వేంచేపు చేశారు. అక్కడ ఆస్థానం చేపట్టారు. ఆ తరువాత శ్రీవారి ఆలయం ఎదుట ఉట్లోత్సవం ఉత్సాహంగా జరిగింది. సాయంత్రం నుండి రాత్రి వరకు ఆద్యంతం కోలాహలంగా పలు ప్రాంతాల్లో సాగిన ఈ ఉట్లోత్సవంలో స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉట్లను పగులగొట్టారు. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, తిరుమల శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, ఇఓ జె.శ్యామల రావు, అదనపు ఇఓ సిహెచ్ వెంకయ్య చౌదరి, డెప్యూటీ ఇఓ భాస్కర్, పేష్కర్ శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

# జ్వరాంధ్రప్రదేశ్‌గా ఏపీ



మండిపడ్డ ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల

**విజయవాడ, ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):** విషజ్వరాలు వణికిస్తుంటే.. కూటమి సర్కారుకి కనీసం సూది గుచ్చినట్టయినా లేదని కూటమి ప్రభుత్వంపై ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల విమర్శలు గుప్పించారు. డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యాతో రాష్ట్రం జ్వరాంధ్రప్రదేశ్‌గా మారితే.. వైద్యారోగ్య శాఖ ఇంకా నిద్ర మత్తు వీడలేదని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురు రోగులకు చికిత్స అందిస్తున్న దీన దుస్థితి ఉంది. ఓపీ ఫుల్.. వైద్యం నిల్.. అన్నట్లు ఉంది రాష్ట్రంలో సర్కారు వైద్యం పరిస్థితి. నియంత్రణకు చర్యలు మాత్రం లేవు. గత సర్కారును తిడుతూ ఐదేళ్లు కాలయాపన చేసేస్తారా?. జ్వరాలను అరికట్టడంపై ఇంతవరకు కార్యాచరణ లేకపోవడం ఈ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ పరిస్థితిని తలపిస్తోంది. విషజ్వరాల కాటుకు ప్రజలు బలి కాకముందే కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించాలి' అని షర్మిల అన్నారు.

### తిరుపతి శ్రీ గోవిందరాజస్వామి ఆలయంలో సెప్టెంబరులో

# విశేష ఉత్సవాలు

**తిరుమల,ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):** తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో సెప్టెంబరు నెలలో పలు విశేష ఉత్సవాలు జరుగనున్నాయి. సెప్టెంబరు 6, 20, 27వ తేదీల్లో శుక్రవారాల్లో సాయంత్రం 6 గంటలకు శ్రీ ఆండాళ్ అమ్మవారిని ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. సెప్టెంబరు 04న ఉత్తర నక్షత్రం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు ఉభయ నాంచారులతో కలిసి శ్రీ గోవిందరాజస్వామివారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. 13న శ్రీ గోవింద రాజస్వామివారి అలయంలో పత్రోత్సవాలకు అంకురార్పణ, 14 నుండి 16 వరకు పత్రోత్సవాలు, 18న శ్రీ గోవింద రాజస్వామివారి గరుడ సేవ, 23న రోహిణి నక్షత్రం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు రుక్మిణి, సత్యభామ సమేత శ్రీపార్థసారథిస్వామివారు మాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షిస్తారు.

# ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుంది



పండించిన పంట మొత్తం కొనుగోలు చేసేలా నిర్ణయం
పత్తిలో ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించేలా రైతులకు అవగాహన
వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం

**అమరావతి, ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):** రాష్ట్రంలో పత్తి రైతులకు అండగా ఉంటామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టంచేశారు. రాష్ట్రంలో పండించే పత్తి పంట మొత్తాన్ని కొనుగోలు చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు మంత్రులు అచ్చెన్నాయుడు, సవిత తెలిపారు. ముఖ్యంగా పత్తిలో ప్లాస్టిక్‌తో పాటు ఇతర వ్యర్థాల కారణంగా రైతుకు ధర రావడం లేదన్నారు. పత్తిలో వ్యర్థాల తొలగింపుతోనే అధిక ధర వస్తుందన్నారు. ఈ విషయంలో రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు మంత్రి సవిత సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా రైతులను చైతన్యం చేయాలన్నారు. పత్తి రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలను తీసుకుంటుందని తెలిపారు. అమరావతిలోని సచివాలయంలో పత్తిలో వ్యర్థాల తొలగింపు, రైతులకు అధిక ధర లభ్యంపై జిన్నింగ్, స్పిన్నింగ్ మిల్లరు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయం విద్యాలయం శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులతో మంత్రులు అచ్చెన్నాయుడు, సవిత సమావేశమయ్యారు. పత్తిలో వ్యర్థాల వల్ల ధర తగ్గుముఖంపై రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్యకార్యదర్శి కె.సునీత పవర్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. రాష్ట్రంలో 2017-18లో 20.50 లక్షల బేళ్ల పత్తి ఉత్పత్తి జరగ్గా, 2023-24లో 11.58 లక్షల బేళ్ల ఉత్పత్తికి తగ్గిపోయిందన్నారు. దీనివల్ల పత్తి నాణ్యత దెబ్బతినడంతో పాటు ధర కూడా తగ్గుతోందన్నారు. దీనివల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని మంత్రి తెలిపారు. పత్తి సేకరణ సమయంలో కాటన్ సంచులు వాడకం వల్ల ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు పడే అవకాశం ఉండదన్నారు. దీనికి వ్యవసాయశాఖాధికారులు రైతుల్లో అవగాహన కల్పించాలని మంత్రి సవిత సూచించారు. ఈ క్రాప్‌లో తప్పనిసరిగా పత్తి రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. ఈ క్రాప్‌లో నమోదు చేసిన పంటను కొనుగోలు చేయాలని సీసీఐ ప్రతినిధులకు మంత్రి స్పష్టంచేశారు. అదే సమయంలో ఈ క్రాప్‌లో నమోదు వల్ల ప్రభుత్వం అందించే ఫలాలతో లబ్ది పొందొచ్చుననే విషయంపై రైతులకు అధికారులు అవగాహన కల్పించాలన్నారు. అంతిమంగా రైతులకు మేలు చేయడమే తమ ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ప్లాస్టిక్ సంచుల్లో వచ్చే పత్తిని కొనుగోలు చేయబోమని రైతులకు తేల్చి చెప్పాలన్నారు.

### మంజూరైన ఇళ్ల నిర్మాణం

# పూర్తి చేయాలి

మంజూరైన గృహాలను నిర్మించకుంటే రద్దయ్యే అవకాశం

జిల్లా కలెక్టర్ డా.జి.సృజన



**జి.కొండూరు,ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):** పేదవానికి సొంతింటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పీఎంఏవై పథకం ద్వారా పక్కా గృహాలను మంజూరు చేయడం జరిగిందని లబ్ధిదారులు మంజూరైన ఇళ్ల నిర్మాణం చేపట్టి రానున్న జూన్ మాసం నాటికీ పూర్తి చేయకుంటే నిధులు విడుదలయ్యే అవకాశం ఉండదని గృహాలను నిర్మించుకోవడంలో లబ్ధిదారులుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.జి.సృజన సూచించారు. జి.కొండూరు సమీపంలో నిర్మాణంలో ఉన్న గృహనిర్మాణ లేఅవుట్ ను బుధవారం జిల్లా కలెక్టర్ జి.సృజన సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించి అనంతరం లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జి.కొండూరు సమీపంలో నిర్మిస్తున్న లేఅవుట్ నందు 360 మంది లబ్ధిదారులకు గృహాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. వీటిలో 51 గృహ నిర్మాణాలు పూర్తి చేయడం జరిగిందని 164 బిలో బేస్మెంట్ లెవెల్, 91 బేస్మెంట్ లెవెల్, 2 లింటల్ లెవెల్, 11 రూఫ్ లెవెల్, 34 రూఫ్ కాస్టింగ్ లెవెల్ దశలలో ఉన్నాయన్నారు. పేదలకు మంజూరు చేసిన గృహాలను రానున్న జూన్ నాటికీ తప్పనిసరిగా పూర్తి చేయవలసి ఉటుందన్నారు. నిర్మాణాలను చేపట్టకుంటే మంజూరైన గృహాలు రద్దవుతాయని భవిషత్తులో కేంద్ర ప్రభుత్వం నుండి గృహాలు మంజూరయ్యే అవకాశం ఉండదన్నారు.

# బయటకు వస్తున్న అరాచకాలు



ముంబై నటిని వేధించిన ఐపిఎస్‌లపై కేసు పెట్టి అరెస్టు చేయండి
అమరావతి బహుజన ఐకాస అధ్యక్షులు పోతుల బాలకోటయ్య విజ్ఞప్తి

**విజయవాడ, ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):** మనకు తెలియని మన చరిత్రల్లా ఐదేళ్ళ వైకాపా పాలనలో జరిగిన అరాచకాలు ఒక్కొక్కటిగా ఇప్పటికీ వెలుగు చూస్తున్నాయని, ముంబై నటి పట్ల విజయవాడలోని ఇద్దరు ఐపిఎస్ లు వ్యవహరించిన తీరు మహా దారుణంగా ఉందని తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు. వైకాపానాయకుని ప్రేమ వ్యవహాన్ని పురస్కరించుకుని అప్పటి ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆదేశాలతో నాటి విజయవాడ పోలీసు కమీషనర్ కాంతి రాణా టాటా, డిసిపి విశాల్ గున్నీ నేతృత్వంలో ఒక పోలీసు బృందం విమానంలో ముంబై వెళ్లి, అక్కడ నుంచి నటిని, ఆమె తల్లి దండ్రులను ఏపీకి తీసుకుని వచ్చి బెదిరించి, 18 రోజులు బంధించి, అక్రమ కేసులు పెట్టి, జైలుకు పంపి, బెయిల్ మీద విడుదల చేసి, తెల్ల కాగితాలపై సంతకాలు పెట్టించుకొని పంపారని చెప్పారు. ఈ సంఘటన ఎన్నికలకు ముందు ఫిబ్రవరిలో జరిగిందని, వైకాపా నాయకునితో ముంబై నటి ప్రేమ వ్యవహారం బయటికొస్తే, రాజకీయంగా వైకాపా పార్టీకి భారీ నష్టం ఉంటుందని, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మౌఖిక ఆదేశాలతోనే సజ్జల గుట్టుచప్పుడు కాకుండా గూడుపుఠాని వ్యవహారాన్ని పూర్తి చేశారన్నారు. ఈ కేసులో మరో పెద్ద నేరం కూడా దాగుందని, బొంబే లోని ఒక ప్రముఖ పారిశ్రామికవేత్తకు నటిపై జరిపిన అత్యాచారం కేసును మాఫీ చేసేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశ్శీసులతోనే ఐపిఎస్ లు వ్యవహారాన్ని చక్కబెట్టి, ఆయనపై ఉన్న కేసును మాఫీ చేసేందుకు ఇలాంటి విద్రోహక చర్యలకు పాల్పడ్డారని పేర్కొన్నారు.

అప్పట్లో వైసిపీ పోలీసులుగా పేరుగాంచిన వాళ్ళు చేయని అరాచకం లేదని గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం వైసిపీ అధికా రంలో లేదని, కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందని, మొత్తం వ్యవహా రంపై విచారణ చేస్తే, పెద్ద తిమింగలాలు బయటికి వస్తాయని తెలిపారు. ముంబై నుంచి నటిని, తల్లిదండ్రులను తీసుకుని వచ్చి, మీడియాతో మాట్లాడి స్తేనే ఏం జరిగిందో తెలుస్తోందని పేర్కొన్నారు.

రౌడీల్లా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని తొత్తులుగా పని చేసిన ఐపిఎస్‌లపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, నటుడిగా ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్, మహిళగా హెూం మంత్రి చొరవ తీసుకుని సజ్జల చీకటి బాగోతాన్ని, ముంబై నటి అంశాన్ని ప్రజలకు తెలియజేయాలని బాలకోటయ్య విజ్ఞప్తి చేశారు.

### విఐటి-ఏపి అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్‌లో మొదటి

# అంతర్జాతీయ సింపోజియం



**అమరావతి, ఆగస్టు 28 (ఆంధ్రపత్రిక):** విఐటి-ఏపి విశ్వవిద్యాలయంలో స్కూల్ అఫ్ అడ్వాన్స్డ్ సైన్సెస్ మరియు అమెరికన్ కెమికల్ సొసైటీ వారి సంయుక్త ఆధ్వర్యంలో అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్‌లో ప్రస్తుత ట్రెండ్స్‌పై మొదటి అంతర్జాతీయ సింపోజియంను నిర్వహించారు. ఈ అంతర్జాతీయ సింపోజియం 6 రోజుల పాటు ఆన్లైన్ విధానంలో నిర్వహిస్తున్నారు. ఈ అంతర్జాతీయ సింపోజియంలో ఫిల్ట్రేషన్ టెక్నాలజీస్, నానో మెటీరియల్స్ డిజైన్, పాలీమెరిక్ మెటీరియల్స్, మెరైన్ ఎకోసిస్టమ్ డైనమిక్స్, ఫోటోనిక్ మెటీరియల్స్, గ్రీన్ హైడ్రోజన్ జనరేషన్, సోలార్ సెల్ టెక్నాలజీస్, ఎలక్ట్రిక్-వెహికల్స్‌లో తాజా పురోగతులు మరియు పరిశోధనల గురించి చర్చించటం జరుగు తుంది. ఇండియన్ అకాడెమియా నుండి ,యూనివర్శిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్, టోక్యో యూనివర్శిటీ ఆఫ్ సైన్స్, హన్యాంగ్ యూనివర్శిటీ, టాటా స్టీల్, ఇండియా మరియు ఈటన్, యుఎస్ఏ నుండి నిష్ణాతులైన వక్తలు కీలక ఉపన్యాసాలు అందిస్తారు. అంతర్జాతీయ సింపోజియం ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జి.రంగారావు (ప్రొఫెసర్, ఐఐటీ మద్రాస్‌లోని రసాయన శాస్త్ర విభాగం) హాజరయ్యారు. ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాస్ (డీన్, స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ సైన్సెస్) మరియు సింపోజియం కన్వీనర్లు డా:రాజర్షి సర్కార్, డా:ప్రతీప్ కుమార్ మరియు ఇతర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పారిశ్రామిక స్పాన్సర్‌లుగా వ్యవహరించిన బ్రూకర్, మెట్రోమ్, ఎస్ఐఎస్, ఐబాకో సర్వీసెస్ మరియు లబ్‌కెమ్స్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

Printed and Published by KANCHARLA RAMAIAH on behalf of Nageswara Rao Estates Private Limited,Printed at Jagati Publications Limited, Sakshi Press, SY.No.481, Phase-2, Jawahar Autonagar, Vijayawada-520007 Andhra Pradesh, and Published from D.NO.29-28-34, Dasari vari street, Suryaraopeta,Vijayawada-520002, KRISHNA DISTRICT-ANDHRA PRADESH, Editor : KANCHARLA RAMAIAH. Excutive editor V.VIJAYALAKSHMI. RNI no. 10721/65 Mobile:9849998069, Email:andhrapatrikadaily@gmail.com